సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 343
సోమవారం 4-3-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'


మగపిల్లల పెంపకం
పిల్లల పెంపకంపై ప్రత్యేక కథనం - 11లో


తీవ్ర వ్యాధుల్లో ఆదుకునే అస్త్రం
క్రిటికల్ ఇల్‌నెస్ ఇన్సూరెన్స్.. మారిన జీవనశైలితో వ్యాధుల ముప్పు - 13లో


కాంగ్రెస్‌కు గరిష్ట సీట్లు ఖాయం
లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గరిష్టంగా సీట్లు కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు.
- వివరాలు 6లో


హిమగిరులకు పెనుముప్పు!
2100 నాటికి హిమాలయ పర్వతాల్లోని 75% మంచు కరిగిపోయే ప్రమాదం ఉందని ఇండియా పర్యావరణ నివేదిక-2024 తేల్చిచెప్పింది.
- వివరాలు 6లో


ట్రంప్‌కు హ్యాట్రిక్ విజయాలు
అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న ట్రంప్ మరో మూడు రాష్ట్రాల ప్రైమరీల్లో గెలుపొందారు.
- వివరాలు 6లో


వాట్సాప్ నుంచి వేరే యాప్‌లకూ..
ఇకపై వాట్సాప్ నుంచి సిగ్నల్, టెలిగ్రామ్ వంటి ఇతర యాప్‌లకూ మెసేజ్‌లను పంపుకోవచ్చు.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

హామీ ప్రకారం గ్యారంటీల అమలు



కాంగ్రెస్ ప్రభుత్వ గృహజ్యోతి పథకం ఫేమస్ అని, కేసీఆర్ ప్రభుత్వ 24 గంటల కరెంట్ మొత్తం బోగస్ అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన నల్లగొండలో సుడిగాలి పర్యటన చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం 90 రోజుల్లో 4 గ్యారంటీలను అమలు చేసి చూపిస్తున్నామన్నారు.

- వివరాలు 2లో▶


'ఉత్తర-దక్షిణా'ల మధ్య ఇక కరెంటు రైళ్లే



ఉత్తర, దక్షిణ భారతం మధ్య ఇకపై పూర్తిగా విద్యుత్ రైళ్ల మాత్రమే నడవనున్నాయి. డీజిల్ ఇంజన్ల అవసరం లేకుండా పూర్తిగా ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల వాడకానికే రైల్వే శాఖకు వీలుకలగనుంది. కేవలం షంటింగ్ లాంటి పనులకు మాత్రమే డీజిల్ ఇంజన్లను పరిమితం చేయొచ్చని తెలుస్తోంది.

- వివరాలు 14లో▶

కాంగ్రెస్ దోఖేబాజ్ పార్టీ



కాంగ్రెస్ దోఖేబాజ్ పార్టీ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని ఓట్లు దండుకున్న ఆ పార్టీ.. అధికారంలోకొచ్చాక వాటికి కోతలు పెడుతూ ప్రజలను మోసం చేస్తోందన్నారు.

- వివరాలు 2లో▶

ఉత్తర రింగుకు ఈపీసీ.. దక్షిణ రింగుకు బీఓటీ

ఆర్‌ఆర్‌ఆర్ టెండర్లపై కేంద్రం యోచన

- ఉత్తర రింగు వ్యయం పూర్తిగా కేంద్రానిదే.. దక్షిణ భాగంలో నిర్మాణ సంస్థకు టోల్ బాధ్యత? 2లో

కాంగ్రెస్‌పై వ్యతిరేకత


సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో కేటీఆర్

ప్రజలకు కొద్దిరోజుల్లోనే మనం యాదికొస్తాం

పార్టీ నేతలతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

- కొత్త ప్రభుత్వం ప్రజలకు నీళ్లు, కరెంటు ఇవ్వడం లేదు.. రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది
- బీఆర్‌ఎస్‌తోనే మేలు జరుగుతుందనే చర్చ ప్రజానీకంలో మొదలైంది
- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతోనే ప్రధాన పోటీ అన్న మాజీ సీఎం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్టీ నేతలతో సమావేశం
- కరీంనగర్, పెద్దపల్లి అభ్యర్థులుగా వినోద్‌కుమార్, కొప్పుల ఖరారు
- నేడు వీరిద్దరి పేర్లతోపాటు బీఆర్‌ఎస్ తొలి జాబితా ప్రకటించనున్న కేటీఆర్
- కరీంనగర్ నుంచే ఎన్నికల శంఖారావం .. 12న భారీ బహిరంగ సభ

సాక్షి, హైదరాబాద్: అతికొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన సర్కారు ప్రజలకు నీళ్లు, కరెంటు ఇవ్వడం లేదని విమర్శించారు. వాటి కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఆదివారం తెలంగాణ భవన్‌కు విచ్చేసిన కేసీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్టీ నేతలతో సమావేశమయ్యారు. మాజీ మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, కరీంనగర్ మేయర్ సునీల్ రావు, కరీంనగర్ పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో పాటు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్లను ఖరారు చేశారు. అయితే ఆదివారం అష్టమి కావడంతో అధికారికంగా ప్రకటించలేదు. సోమవారం మహబూబాబాద్, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ నేతలతో సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే ఉదయం 11 గంటలకు కరీంనగర్, పెద్దపల్లితో పాటు మరికొన్ని స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులతో బీఆర్‌ఎస్ తొలి జాబితాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించనున్నారు. కాగా పార్టీ నేతలతో సమావేశం సందర్భంగా కేసీఆర్ మాట్లాడారు.

రెగ్యులరైజేషన్ ఉచితంగా చేయాలి

విశ్వసనీయ సమాచారం మేరకు.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తోనే మేలు జరుగుతుందనే చర్చ ప్రజానీకంలో మొదలైందని కేసీఆర్ చెప్పారు. శాసనసభ

మిగతా 2వ పేజీలో ▶

బీఆర్‌ఎస్ నుంచి లోక్‌సభకు కొత్త వారే..

2లో

- పార్టీని వరుసగా వీడుతున్న సిట్టింగ్ ఎంపీలు
- ఎన్నికల ఖర్చు భరించే వారికే టికెట్లు అందే చాన్స్!



- నేడు నాగ్‌పూర్ నుంచి నేరుగా ఆదిలాబాద్‌కు మోదీ
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- పార్టీ ఎన్నికల ప్రచారాన్ని సైతం ప్రారంభించనున్న మోదీ
- బహిరంగ సభలు పార్టీకి మరింత ఊపు తెస్తాయని భావిస్తున్న బీజేపీ నేతలు
- స్వాగతం పలకనున్న గవర్నర్, సీఎం, ఇతర నేతలు

రెండు రోజులు రాష్ట్రంలో ప్రధాని

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, ఆదిలాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండురోజుల పర్యటన నిమిత్తం సోమవారం రాష్ట్రానికి రానున్నారు. మొత్తం రూ.15,718 కోట్ల అభివృద్ధి పనులకు (4న ఆదిలాబాద్‌లో రూ.6,697 కోట్లు, 5న సంగారెడ్డిలో రూ.9,021 కోట్లు) శ్రీకారం చుట్టనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లకు గాను ఇప్పటికే 9 మంది అభ్యర్థులను బీజేపీ నాయకత్వం ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో ప్రధాని సభలు పార్టీ యంత్రాగానికి మరింత ఊపు తెస్తాయని బీజేపీ నేతలు భావిస్తున్నారు.

హైదరాబాద్ నుంచి సంగారెడ్డికి

ప్రధాని సోమవారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి ఉదయం 10.20 గంటలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రధానికి స్వాగతం పలకనున్నారు. కాగా మోదీ రోడ్డు మార్గంలో స్టేడియానికి చేరుకుంటారు. అక్కడ రెండు వేదికలు ఏర్పాటు చేయగా, అందులో మొదటి వేదిక నుంచి పలు అభివృద్ధి పనులకు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఈ కార్యక్రమంలో గవర్నర్, సీఎం, కేంద్రమంత్రి పాల్గొంటారు. అనంతరం రెండో వేదికపైకి వెళ్లి బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఇందులో కిషన్‌రెడ్డితో పాటు ఒకరిద్దరు కేంద్ర మంత్రులు, పార్టీ నేతలు బండి సంజయ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ తదితరులు పాల్గొననున్నారు. ఆదిలాబాద్‌లో మోదీ సుమారు రెండు గంటల పాటు ఉండనున్నారు. ఇక్కడినుంచి మధ్యాహ్నం 12.10 గంటలకు

మిగతా 2వ పేజీలో ▶

9 వేల ఉద్యోగాలు!

9 నెలల్లో గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు రికార్డు

- న్యాయ వివాదాలకు తావులేకుండా విజయవంతంగా ఉద్యోగాల భర్తీ
- ఇప్పటికే 2 వేల మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలు
- మరో 6,500 మందికి నేడు సీఎం చేతుల మీదుగా పంపిణీకి ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీ రికార్డు స్థాయి వేగంతో జరిగింది. కేవలం తొమ్మిది నెలల వ్యవధిలోనే దాదాపు తొమ్మిది వేల ఉద్యోగాలను తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) భర్తీ చేసింది. న్యాయ వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించిన రికార్డును సైతం సొంతం చేసుకుంది. గురుకుల విద్యా సంస్థల్లో కొలువుల భర్తీ ప్రక్రియ మొదట్లో తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించింది. కానీ భర్తీ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని భావించిన ప్రభుత్వం గురుకుల నియామకాల కోసం ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేసింది. గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శుల సమన్వయంతో ఏర్పాటు చేసిన ఈ బోర్డు దూకుడుగా భర్తీ ప్రక్రియ చేపట్టింది. గతంలో దాదాపు 4 వేల ఉద్యోగ నియామకాలను ఏడాది కాలంలో పూర్తి చేయగా.. ఇప్పుడు ఏకంగా 9వేల ఉద్యోగాల భర్తీని కేవలం 9 నెలల్లోనే పూర్తి చేసింది. గత నెలలో 2 వేలకు పైగా ఫిజికల్ డైరెక్టర్ (పీడీ), లైబ్రేరియన్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) ఉద్యోగాలకు అర్హత సాధించిన వారికి నియామక పత్రాలు అందజేయగా.. ఇప్పుడు మరో 6,500 మందికి అందించనుంది.

గత ఏప్రిల్‌లో ప్రకటనలు జారీ చేసి..

గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి టీఆర్‌ఈఐఆర్‌బీ గతేడాది ఏప్రిల్ 5వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. 9 వేల ఉద్యోగాలకు ఏక కాలంలో 9 నోటిఫికేషన్లు విడుదల చేసి రికార్డు సృష్టించింది. అదే నెల 17వ తేదీ నుంచి దాదాపు నెల రోజుల పాటు దరఖాస్తుల స్వీకరించి గతేడాది ఆగస్టులో పరీక్షలను నిర్వహించింది. అవకతవకలకు ఆస్కారం లేకుండా కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్‌టీ) విధానం అవలంబించింది. సెప్టెంబర్ నెలలో అర్హత పరీక్షలకు సంబంధించి ప్రాథమిక కీలను విడుదల చేసింది. దీనితో పాటు క్షేత్రస్థాయి నుంచి అభ్యంతరాలు స్వీకరించడం,

మిగతా 2వ పేజీలో ▶

'కాళేశ్వరా'నికి హాలిడే!

4 నెలల్లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లు, నిర్మాణ లోపాలపై అధ్యయనం

- సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నిపుణుల కమిటీ ఏర్పాటు చేసిన ఎన్డీఎస్‌ఏ
- సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని కమిటీకి మార్గదర్శకాలు.. 4 నెలల్లోగా నివేదిక సమర్పించాలని గడువు.. ఆ తర్వాతే మరమ్మతులు, పునరుద్ధరణ పనులు
- అప్పటివరకు కాళేశ్వరం ప్రాజెక్టుకు హాలిడే ప్రకటించినట్లే..

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లు, నిర్మాణాన్ని పరీక్షించేందుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఆరుగురితో నిపుణుల కమిటీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్‌ఏ) ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఎన్డీఎస్‌ఏ విధాన, పరిశోధన విభాగం డిప్యూటీ డైరెక్టర్ అమిత్ మిత్తల్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మూడు బ్యారేజీల్లో ఏర్పడిన సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు సూచించడంతోపాటు భవిష్యత్తులో

మిగతా 10వ పేజీలో ▶



మేడిగడ్డ ఇంజనీర్లపై త్వరలో వేటు

వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ల జారీపై సర్కారు సీరియస్ 10లో

కొత్త ప్రభుత్వం ఏర్పడుతూనే..

100 రోజుల అజెండా!


- మంత్రివర్గ సహచరులతో మోదీ భేటీ
- 'వికసిత్ భారత్'పై మేధోమథనం
- దార్శనిక పత్రంపై సుదీర్ఘంగా చర్చ

వివరాలు 6లో

రాజకీయాలకు హర్ష్‌వర్ధన్ గుడ్‌బై

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బరిలోకి దిగనున్న అభ్యర్థుల తొలిజాబితాను బీజేపీ ప్రకటించిన మరుసటి రోజే రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్.హర్ష్ వర్ధన్ ప్రకటించారు.

వివరాలు 6లో



పాకిస్తాన్ ప్రధానిగా షెహబాజ్ షరీఫ్ ఎన్నిక

నేడు నూతన ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం

పాకిస్తాన్ ప్రధానమంత్రిగా పీఎంఎల్-ఎన్ నేత షెహబాజ్ షరీఫ్(72) ఎన్నికయ్యారు. నూతన ప్రధానిని ఎన్నుకోవడానికి పాకిస్తాన్ పార్లమెంట్‌లో ఆదివారం ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 336 ఓట్లకు గాను షెహబాజ్ షరీఫ్‌కు 201 ఓట్లు లభించాయి. ఇమ్రాన్ ఖాన్ నాయకత్వంలోని పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ అభ్యర్థి ఒమర్ అయూబ్ ఖాన్‌కు కేవలం 92 ఓట్లు దక్కాయి. 6లో

ఇలాంటివాళ్ళుంటారు!



తన పేరు ఫస్ట్ లిస్ట్‌లో రాలేదట! సెకండ్ లిస్ట్‌లో కూడా రాకుంటే పక్క పార్టీ ఫస్ట్ లిస్ట్‌లో వచ్చేట్లు చేసుకుంటాడట!



ఆస్తుల కోసం సునీత... అధికారం కోసం చంద్రబాబు

సూత్రధారులు, పాత్రధారుల ముసుగులు తొలగించే కథనమిదిగో... 3లో

వైఎస్ వివేకాను చంపిందెవరు?

వైఎస్ వివేకానందరెడ్డిని హత్య జరిగినపుడు ముఖ్యమంత్రి స్థానంలో అధికారంలో ఉన్న చంద్రబాబే ఇపుడు అమాయకంగా... హత్య చేసిందెవరు? అని ప్రశ్నిస్తున్నారు. ఇది వారంలో తేల్చాల్సిన కేసు అని చెబుతున్న వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత... హత్య జరిగాక రెండు నెలలపాటు అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడిని ప్రశ్నించటమే లేదు. అంతే కాదు. హత్య చేశానని, తన తల్లితో అక్రమ సంబంధం పెట్టుకున్నందుకు మరికొందరితో కలిసి వివేకాను తనే గొడ్డలితో నరికానని అంగీకరించిన దస్తగిరి ఇప్పుడు జైలు నుంచి విడుదలై దర్జాగా బయట తిరుగుతున్నాడు. సునీతకు, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఆత్మీయుడిగా మారాడు. చంద్రబాబు అనుకూల మీడియాకు వీఐపీ నాయకుడైపోయాడు. వివేకా గుండెపోటుతో చనిపోయారని సునీత బావగారు శివప్రకాశ్‌రెడ్డితో సహా పలువురికి ఫోన్లు చేసి చెప్పిన నాటి టీడీపీ మంత్రి ఆదినారాయణరెడ్డి.. తర్వాత ఓడిపోవటంతో బీజేపీలోకి ఫిరాయించారు. వీళ్లలో హత్య చేసిన వాళ్లు... చేయించిన వాళ్లు... దాన్ని కప్పిపుచ్చి రాజకీయ ప్రత్యర్థుల్ని ఇరికించడానికి ప్రయత్నిస్తున్న వారు... అంతా ఉన్నారు. అందరూ కలిసి లోతైన కుట్రతో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై, ఆయన కుటుంబంపై దుష్ప్రచారం చేశారు. ఇపుడు ఈ కుట్రను మరింత లోతుకు తీసుకెళుతున్నారు.

నేటి నుంచి డీఎస్సీ దరఖాస్తులు

సమగ్ర వివరాలతో బులెటిన్ విడుదల చేయనున్న విద్యాశాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డీఎస్సీ దరఖాస్తుల ప్రక్రియ సోమవారం ప్రారంభం కానుంది. ఏప్రిల్ 2 వరకూ కొనసాగనుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలు, రిజర్వేషన్లు, సిలబస్ ఇతర వివరాలతో విద్యాశాఖ పూర్తి సమాచార బులెటిన్‌ను https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో సోమవారం విడుదల చేయనుంది. దరఖాస్తుల స్వీకరణకు సర్వర్ సమస్యల్లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. గతేడాది డీఎస్సీ తేదీలను ప్రకటించినా ప్రస్తుతం దీన్ని రద్దు చేశారు.

అయితే అప్పుడు దరఖాస్తు చేసుకున్న 1.74 లక్షల మంది తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు ఇప్పటికే ప్రకటించినా ఈసారి 11,062 టీచర్ పోస్టులు ఉండటంతో ఎక్కువ మంది పోటీ పడే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4.5 లక్షల మంది టెట్ పాసయ్యారు. వారిలో చాలా మంది టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసే వీలుందని అధికారులు అంచనా వేస్తున్నారు. టెట్ ఉత్తీర్ణుల్లో చాలా మంది హైదరాబాద్‌లోని కోచింగ్ కేంద్రాల బాట పడుతున్నారు. ప్రైవేటు స్కూళ్లలో టీచర్లుగా పని చేస్తున్న వారిలో చాలా మంది ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఓయూ సహా పలు విశ్వవిద్యాలయ లైబ్రరీల్లోనూ విద్యార్థుల తాకిడి పెరుగుతోంది. మరోవైపు డీఎస్సీ సిలబస్‌తో కూడిన పుస్తకాలు రూపొందించే పనిలో ప్రచురణ సంస్థలు నిమగ్నమయ్యాయి. సబ్జెక్టు పరంగా పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని భావిస్తుండటంతో పాత పుస్తకాలనే తిరిగి ముద్రించే పనిలో ఉన్నాయి.

క్లుప్తంగా...



సీఎం రేవంత్‌ను కుటుంబంతో కలిసిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు. చిత్రంలో మంత్రి పొంగులేటి

నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎంని కలిశా

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

సాక్షి, హైదరాబాద్: నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసినట్లు భద్రాచలం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో ఆదివారం తెల్లం వెంకట్రావు కుటుంబసమేతంగా సీఎం రేవంత్‌ను కలిశారు. భద్రాచలం రామాలయం అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ చూపాలని, ఏపీలో విలీనం చేసిన ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని రేవంత్‌ను కోరినట్లు తెలిపారు. భద్రాచలంలోని రెండు వార్డులు కూడా ఆంధ్రాలో ఉన్నాయని, దీని ప్రభావం నియోజకవర్గ అభివృద్ధిపై పడుతుందని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. భద్రాచలంలో డంపింగ్‌యార్డు లేదని, మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

బీబీనగర్ ఎయిమ్స్‌లో రక్తహీనతపై అధ్యయనం



సాక్షి, న్యూఢిల్లీ: బీబీనగర్ ఎయిమ్స్‌లో రక్తహీనతపై అధ్యయనం చేయాలని కేంద్ర ఆరోగ్య, ఆయుష్ మంత్రిత్వ శాఖలు నిర్ణయించాయి. ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో ఆయుష్ మంత్రిత్వశాఖలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్సెస్(సీసీఆర్ఏఎస్) ఈ అధ్యయనం చేపట్టనుంది. బీబీనగర్ ఎయిమ్స్‌తో పాటు వార్ధా, జోద్‌పూర్, బెంగళూరు, రాంచీ, న్యూఢిల్లీ, భోపాల్‌లోనూ ఈ అధ్యయనాలు చేయనున్నారు.

ఏడాదిలో 50.98 ఎంటీఓఈ ఇంధనం ఆదా

బీఈఈ 22వ ఆవిర్భావ దినోత్సవంలో సంస్థ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) 2022–23 సంవత్సరంలో 50.98 మిలియన్ టన్నుల ఆయిల్‌తో సమానమైన (ఎంటీఓఈ) ఇంధనాన్ని ఆదా చేసింది. అదే ఏడాది 24.68 ఎంటీఓఈ థర్మల్ విద్యుత్‌ను సైతం ఆదా చేయడంతోపాటు, 30,655 బిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదాతో రూ.1.94 లక్షల కోట్ల మేర పొదుపు చేసినట్లు సంస్థ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే పేర్కొన్నారు. బీఈఈ 22వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతియేటా 306.40 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో బీఈఈ కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. భారత్‌లో 80శాతం పట్టణ, గ్రామీణ ప్రాంతాలను పర్యావరణహితంగా మార్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన లైఫ్‌మిషన్‌ను దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఈఈ కృషి చేస్తుందన్నారు. దక్షిణాదిలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్టణం, తిరువనంతపురం వంటి నగరాల్లో దశలవారీగా లైఫ్‌మిషన్‌ను అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణలో ఇంధన సామర్థ్య రంగంలో సాధించిన పలు విజయాలను (ప్రత్యేకంగా రవాణ రంగం)టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో నీతిఅయోగ్ సలహాదారు సుధేందు జ్యోతి సిన్హా, బీఈఈ డిప్యూటీ డీజీ అశోక్‌కుమార్, దక్షిణాది రాష్ట్రాల, కేంద్రప్రాంతాల బీఈఈ మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తా: మాధవీలత



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ ప్రజల కోసం అహర్నిశలు పని చేస్తానని బీజేపీ లోక్‌సభ అభ్యర్థి మాధవీలత పేర్కొన్నారు. బీజేపీలో తాను లేనంటూ తనపై సొంతపార్టీ వారే చేస్తున్న విమర్శల్ని సంఘ్ పరివార్ వ్యక్తిగా అస్సలు పట్టించుకోనని ఆమె స్పష్టం చేశారు. హైదరాబాద్ నియోజకవర్గం నుంచి మాధవీలతను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం పార్టీ పెద్దలతో భేటీ కావడానికి ఢిల్లీ వచ్చారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు తరుణ్‌ఛుగ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాధవీలతకు పార్టీ కండువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ...హైదరాబాద్ నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో మార్పు తథ్యమన్నారు. ఎంపీగా దీర్ఘకాలంగా కొనసాగుతున్న అసదుద్దీన్ ఒవైసీ ఇటు మైనారిటీలకు అటు హిందువులకు న్యాయం చేయలేదన్నారు. అనేకమంది యువకుల్ని అన్యాయంగా జైల్లో పెట్టించారని విమర్శించారు. హైదరాబాద్‌లో చట్టవ్యతిరేకమైన పనులు చేస్తే సహించేది లేదని, అసద్ భయ్ వస్తున్నా అంటూ వ్యాఖ్యానించారు.

బీఆర్‌ఎస్ నుంచి లోక్‌సభకు కొత్త వారే..

వరుసగా పార్టీని వీడుతున్న సిట్టింగ్ ఎంపీలు

- ఇప్పటికే కాంగ్రెస్ గూటికి ఒకరు.. బీజేపీలోకి మరో ఇద్దరు
- అభ్యర్థిత్వం ఖరారైనా పునరాలోచనలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి
- మిగతా నలుగురిలోనూ ముగ్గురు పోటీకి దూరం?
- మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు, కొత్త నేతల పేర్లపై పరిశీలన
- ఎన్నికల ఖర్చు భరించే వారికే టికెట్లు అందే చాన్స్!



సాక్షి, హైదరాబాద్: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి దాదాపుగా కొత్తవారే బరిలోకి దిగే పరిస్థితి కనిపిస్తోంది. ఒకరిద్దరు సిట్టింగ్‌లు మినహా మిగతా చోట్ల మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, కొత్త నేతలు పోటీచేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. కొందరు సిట్టింగ్ ఎంపీలు పార్టీని వీడటం, మరికొందరు పోటీకి దూరంగా ఉండనుండటమే దీనికి కారణమని అంటున్నాయి. లోక్‌సభలో బీఆర్‌ఎస్‌కు తొమ్మిది మంది సిట్టింగ్ ఎంపీలు ఉండగా.. అందులో ముగ్గురు పార్టీని వీడారు. దీంతోపాటు ఇప్పటికే అభ్యర్థిత్వం ఖరారైన చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కారు గుర్తుపై పోటీచేసే విషయంలో పునరాలోచనలో పడినట్టు సమాచారం. ఈక్రమంలో పక్షం రోజులుగా ఆయన బీఆర్‌ఎస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారని తెలిసింది. ఇప్పటికే చేవెళ్ల నుంచి బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరు ఖరారైన నేపథ్యంలో.. రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరవచ్చని లేదా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది.

మిగతా నలుగురిపై చర్చ

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికి బీఆర్‌ఎస్ నుంచి మరికొందరు ఎంపీలు నిష్క్రమించవచ్చని ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటివరకు సిట్టింగ్ ఎంపీలు వెంకటేశ్ నేత (పెద్దపల్లి) కాంగ్రెస్‌లోకి.. పి.రాములు (నాగర్‌కర్నూల్), బీబీ పాటిల్ (జహీరాబాద్) బీజేపీలోకి వెళ్లారు. బీజేపీ లోక్‌సభ అభ్యర్థులుగా బీబీ పాటిల్‌తోపాటు పి.రాములు కుమారుడు భరత్‌ను ఖరారు చేస్తున్నట్లు ప్రకటించింది కూడా. బీఆర్‌ఎస్‌లోని మరో సిట్టింగ్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇప్పుడు రంజిత్‌రెడ్డి అంశంపై చర్చ జరుగుతోంది. దీంతో మొత్తంగా ఇప్పటికే ఐదుగురు సిట్టింగ్‌ల భవితవ్యంపై స్పష్టత వచ్చినట్లయింది. మిగతా నలుగురు బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు (ఖమ్మం), పసునూరు దయాకర్ (వరంగల్), మాలోత్ కవిత (మహబూబాబాద్), మన్నె శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్)ల అడుగులు ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. సర్వేల ఫలితాలు, ఎన్నికల ఖర్చును దృష్టిలో పెట్టుకుని లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగేందుకు పలువురు నేతలు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం.

మరికొందరూ పోటీకి దూరం?

ప్రస్తుతం తన కుమారుడి వివాహ వేడుకల ఏర్పాట్లలో ఉన్న నామా నాగేశ్వర్‌రావు మరోమారు బీఆర్‌ఎస్ నుంచి పోటీచేసేందుకు సిద్ధమయ్యారు. మిగతా ముగ్గురిలో పసునూరు దయాకర్, మాలోత్ కవిత, మన్నె శ్రీనివాస్‌రెడ్డిలకు తిరిగి బీఆర్‌ఎస్ టికెట్ దక్కే అవకాశం లేదనే ప్రచారం జరుగుతోంది. దీంతో బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీల్లో ప్రస్తుతానికి నామా నాగేశ్వర్‌రావు (ఖమ్మం) మినహా మిగతా వారంతా పార్టీకి దూరం కావడమో లేదా పోటీ నుంచి నిష్క్రమించడమో జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

మాజీలు, కొత్తవారికి పోటీ చాన్స్!

వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందనే వార్తల నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించారు. ఈ కసరత్తును కొలిక్కి తెచ్చేందుకు ఒకట్రెండు రోజుల్లో తెలంగాణ భవన్ వేదికగా పార్టీ ముఖ్య నేతలతో భేటీ కానున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా భేటీలు ముగిశాక వారం పది రోజుల్లో అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల ఎంపికలో అనుసరిస్తున్న వ్యూహాన్ని నిశితంగా గమనిస్తున్న కేసీఆర్.. అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఇటీవలి ఎన్నికల్లో ఓటమి పాలైన కొందరు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతో పాటు పార్టీకి కొత్త రక్తం ఎక్కించే ఉద్దేశంతో కొంత యువ నాయకత్వానికి కూడా అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్టు సమాచారం. అయితే ఎన్నికల వ్యయాన్ని భరించే శక్తి ఉన్న వారికోసం బీఆర్‌ఎస్ అన్వేషణ సాగిస్తున్నట్టు తెలిసింది.



మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో హరీశ్, వినోద్, గంగుల, కేటీఆర్ తదితరులు

కాంగ్రెస్‌పై వ్యతిరేకత

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికల ఫలితాలు పట్టించుకోవద్దని, నేతలు, కార్యకర్తలు అధైర్యపడొద్దని సూచించారు. అంతా కలిసి పని చేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్ విషయంలో గతంలో బీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్ విమర్శించిందని, ప్రజల రక్తం పీలుస్తున్నారని వ్యాఖ్యానించిన వాళ్లు ఇప్పుడేం చేస్తున్నారని నిలదీశారు. పైగా అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని కాంగ్రెస్ మాట ఇచ్చిందని, ఇచ్చిన మాట ప్రకారం ఎల్ఆర్ఎస్ కింద ఉచితంగా ప్లాట్లు, లే అవుట్ల రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు.

మెజారిటీ సీట్లు మనవే..

ముందుగా కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నాయకులతో మాట్లాడిన కేసీఆర్.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించి దిశానిర్దేశం చేశారు. ఉద్యమ కాలం నుంచి పార్టీకి సెంటిమెంట్‌గా వస్తున్న కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కాలేజీ గ్రౌండ్‌లో ఈ నెల 12న భారీ బహిరంగ సభతో లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించాలని నిర్ణయించారు. సభను విజయవంతం చేసే బాధ్యతను గంగుల కమలాకర్‌కు అప్పగించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలువబోతున్నదని చెప్పారు. అలాగే మెజారిటీ స్థానాల్లో పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఓ పన్ను పాడైందని పళ్లన్నీ పీకేయలేం కదా!

ప్రాజెక్టుల్లో సమస్యలు రావడం సహజమని, మిడ్ మానేరులో సమస్యలు వస్తే వెంటనే మరమ్మతులు చేశామని కేసీఆర్ గుర్తు చేశారు. సమస్య వస్తే ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని, రాజకీయం చేస్తామంటే ప్రజలు గమనిస్తారని అన్నారు. ఒక పన్ను పాడైతే.. చికిత్స చేసుకుంటాం తప్ప.. మొత్తం పళ్లన్నీ పీకి వేసుకోలేం కదా? అని వ్యాఖ్యానించారు. నియోజకవర్గాల వారీగా బస్సు యాత్రలు చేయాలని, మండల స్థాయిలో పార్టీ సమావేశాలు పెట్టుకోవాలని నేతలకు సూచించారు. బీఆర్‌ఎస్‌కు గెలుపోటములు కొత్త కాదన్న ఆయన.. ఓడితే కుంగి పోయేది లేదు.. గెలిస్తే పొంగి పోయేది లేదని అన్నారు. కాంగ్రెస్‌లో వాళ్ల కుంపటి వాళ్ళు సర్దుకోవడానికే టైం సరిపోతుందని విమర్శించారు. ప్రజలకు కొద్ది రోజుల్లోనే మనం కచ్చితంగా యాదికొస్తామని, ధైర్యంగా ఉండాలని నాయకులకు భరోసా ఇచ్చారు.

ఉత్తర రింగుకు ఈపీసీ.. దక్షిణ రింగుకు బీఓటీ

ఆర్ఆర్ఆర్ టెండర్లపై కేంద్రం యోచన

- ఉత్తర రింగు వ్యయం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదే
- దక్షిణ భాగంలో నిర్మాణ సంస్థకు టోల్ బాధ్యత?



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు నిర్మాణం, నిర్వహణపై నిశిత పరిశీలన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కేంద్రం భావిస్తోంది. రెండేళ్ల క్రితమే ఉత్తర రింగుకు సంబంధించి కసరత్తు ప్రారంభించి అలైన్‌మెంటు ఖరారు చేసినా, ఇప్పటివరకు టెండర్ల దశకు రాలేదు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అనంతరం కదలిక వచ్చింది. 162 కి.మీ. నిడివి ఉండే ఉత్తర భాగానికి సంబంధించి భూపరిహారం చెల్లింపు ప్రక్రియలో భాగంగా గ్రామాల వారీగా అవార్డులు పాస్ చేసేందుకు అంతా సిద్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వెంటనే టెండర్లు పిలవనున్నారు. ఉత్తర భాగానికి సంబంధించిన పట్టణాల మధ్య రాకపోకలు సాగిస్తున్న వాహనాల సంఖ్య భారీగా ఉంది. దీంతో ఈ ప్రాంతంలో 4 వరసల యాక్సెస్ కంట్రోల్డ్ హైవే అవసరం ఉందని కేంద్రం తేల్చింది. ఈ భాగంలో రోడ్డు నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయాన్ని సొంతంగా భరించాలని కేంద్రం భావిస్తోంది. ఇందుకు ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో టెండర్లు పిలిచి రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టు సంస్థను గుర్తించాలని నిర్ణయించింది. రోడ్డు నిర్మాణం తర్వాత ఏర్పాటు చేసే టోల్ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం మరో టెండరు పిలిచి కాంట్రాక్టు సంస్థను గుర్తించనుంది. కేంద్రమే టోల్ రుసుమును వసూలు చేసుకుంటుంది.

బీఓటీ కాకుంటే హైబ్రిడ్ యాన్యుటీ మోడల్!

దక్షిణ భాగానికి వచ్చే సరికి ఈపీసీ టెండరింగ్‌కు వెళ్లొద్దని ప్రాథమికంగా నిర్ణయించింది. దాదాపు 180 కి.మీ. నిడివితో ఉండే దక్షిణ భాగాన్ని నిర్మించే ప్రాంతంలో ఉండే పట్టణాల మధ్య రాకపోకలు సాగిస్తున్న వాహనాల సంఖ్యను తెలుసుకునేందుకు సర్వే నిర్వహించింది. ఉత్తర ప్రాంతంతో పోలిస్తే దక్షిణ భాగం పరిధిలో వాహనాల సంఖ్య చాలా తక్కువగా ఉందని తేలింది. దీంతో అసలు దక్షిణ భాగానికి నాలుగు వరసల రోడ్డు అవసరం లేదన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేసింది. చివరకు రింగురోడ్డులా ఉండాలంటే రెండు భాగాలూ ఒకే తరహాలో ఉండాలన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనతో ఏకీభవించింది. అయితే ఈపీసీ పద్ధతిలో కాకుండా, బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(బీఓటీ) పద్ధతిలో దక్షిణ భాగానికి టెండర్లు పిలవాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ పద్ధతిలో.. నిర్మాణ సంస్థ సొంత నిధులతో రోడ్డును నిర్మించాల్సి ఉంటుంది. ఆ తర్వాత నిర్ధారిత కాలం ఆ రోడ్డుపై టోల్‌ను వసూలు చేసుకోవటం ద్వారా ఆ ఖర్చును రికవరీ చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ పద్ధతిలో రోడ్డు నిర్మాణ పని తలకెత్తుకునేందుకు నిర్మాణ సంస్థలు ముందుకు రాని పరిస్థితి నెలకొంటే.. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) పద్ధతిలో టెండర్లు పిలవాలని భావిస్తోంది. దాని ప్రకారం కేంద్ర ప్రభుత్వం నిర్మాణ వ్యయంలో 40% మొత్తాన్ని పది వాయిదాల్లో చెల్లిస్తుంది. మిగతా మొత్తాన్ని నిర్మాణ సంస్థ భరించాల్సి ఉంటుంది. వచ్చే జూన్, జూలైలలో దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంటుకు ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది.

9 వేల ఉద్యోగాలు!

▶ మొదటి పేజీ తరువాయి

తిరిగి తుది కీలను ఖరారు చేయడం దాదాపు నెల రోజుల వ్యవధిలో పూర్తి చేసింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడం, మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉండడంతో కొంత జాప్యం జరిగింది. తాజాగా రాష్ట్రంలో ఏర్పాటైన ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించి జీవోలు విడుదల చేయడంతో నియామకాల ప్రక్రియకు మార్గం సుగమమైంది. అర్హత పరీక్షల్లో అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా వివిధ కేటగిరీల్లో 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాలు ప్రకటించడం, అనంతరం డెమో పరీక్షలు, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాలను వెబ్‌సైట్‌లో ప్రచురించడం లాంటి వన్నీ నెల రోజుల్లోనే పూర్తి చేసింది. ఫిబ్రవరి నెలాఖరు నాటికి ఉద్యోగాల భర్తీని పూర్తి చేసింది.

నేటి మధ్యాహ్నం నియామక పత్రాలు

ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ), జూనియర్ లెక్చరర్ (జేఎల్), డిగ్రీ లెక్చరర్ (డీఎల్) ఉద్యోగాలకు సంబంధించి దాదాపు 6,500 మంది ఎంపికయ్యారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని లాల్ బహదూర్ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర మంత్రులు, గురుకుల సొసైటీ కార్యదర్శులు, సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఆయా జిల్లాలకు చెందిన అభ్యర్థులకు సోమవారం నియామకపత్రాలు ఇస్తారా? లేదా? అనే విషయమై స్పష్టత లేకుండా పోయింది.

పీఆర్ ఇంజనీర్స్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

హన్మకొండ: తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. హన్మకొండలోని జిల్లా పరిషత్‌లో జరిగిన సర్వసభ్య సమావేశం అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంకటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షులుగా బి.లింగారెడ్డి, పున్నమి క్రాంతి, సంయుక్త కార్యదర్శులుగా అశ్విన్‌కుమార్, మహేందర్, కోశాధికారిగా అట్ల శ్రీదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమణి, టెక్నికల్ కార్యదర్శిగా మనీశ్ ఎన్నికయ్యారు.

ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాలకూ సంక్షేమం

ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాల చెల్లింపు ఓ చరిత్ర: డిప్యూటీ సీఎం భట్టి



ఎర్రుపాలెం: ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భీమవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఈనెల ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు అందించామని, రాష్ట్రంలోని 3.65 లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులకు, 2.85 లక్షల మంది పెన్షన్‌దారులకు వారి ఖాతాల్లో జమ చేశామని వివరించారు. 2019 ఆగస్టు నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు ఇచ్చిన చరిత్ర లేదని, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇందిరమ్మ రాజ్యం వచ్చాకే ఇది సాధ్యమైందని చెప్పారు. తమ ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటుందన్నారు. ఉద్యోగులు సైతం పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయాలని చెప్పారు. ప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకాలు, ఆరు గ్యారంటీల అమలులో అలసత్వం లేకుండా పనిచేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే ఉద్యోగ నియామకాల కోసం టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేశామని, 3 నెలల్లోనే 25 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. గ్రూప్–1, డీఎస్సీ తదితర నోటిఫికేషన్లు కూడా జారీ చేశామన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత కోసం రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని జ్యోతిరావ్ పూలే ప్రజాభవన్‌లో అద్భుతమైన స్టూడియో నిర్మించి నిష్ణాతులైన అధ్యాపకులతో టైమ్ టేబుల్ ప్రకటించి నిరుద్యోగులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. భట్టి వెంట ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ దోఖేబాజ్ పార్టీ

నిబంధనల పేరుతో ఆరు గ్యారంటీలకు కోత

- మోదీలేని భారత్‌ను ఊహించుకోలేం: బండి సంజయ్



హుజూరాబాద్‌లోని సూపర్‌బజార్ రోడ్‌లో ప్రజలకు నమస్కరిస్తున్న బండి సంజయ్‌కుమార్

హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ దోఖేబాజ్ పార్టీ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని ఓట్లు దండుకున్న ఆ పార్టీ.. అధికారంలోకొచ్చాక వాటికి కోతలు పెడుతూ ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఇళ్లకోసం లక్షలాది కుటుంబాలు పదేళ్లుగా అల్లాడుతుంటే నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మాత్రమే ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజాహితయాత్రలో భాగంగా ఆదివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన పాదయాత్ర చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలంటే రూ.5 లక్షల కోట్లు అవసరమని, ఆ నిధులు ఎక్కడి నుంచి తెస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ప్రతినెలా రూ.2,500, ఆసరా కింద రూ.4 వేలు, రూ.రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామంటే ప్రజలు ఓట్లేశారని, ఇప్పటివరకు ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. రాష్ట్రంలో 90 లక్షల తెల్లరేషన్ కార్డులుంటే.. అందులో 40 లక్షల మందికి మాత్రమే రూ.500కు గ్యాస్ సిలిండర్, రెండు వందల యూనిట్లు ఉచిత కరెంట్‌ను అమలు చేస్తామంటున్నారని, మిగిలిన వారి సంగతేంటని ప్రశ్నించారు. నరేంద్రమోదీ లేని భారత్‌ను ఎవరూ ఊహించుకోవడం లేదని, మోదీని మూడోసారి ప్రధానిగా చేసేందుకు ప్రజలంతా సిద్ధమయ్యారని పేర్కొన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తమకు పోటీయే కాదని, గతంలోకంటే భారీ మెజార్టీతో విజయం సాధిస్తాననే నమ్మకం ఉందని బండి చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీ ప్రకారం గ్యారంటీల అమలు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- పదేళ్లలో బీఆర్‌ఎస్ సర్కార్ ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదు
- అలాంటి పార్టీ నాయకులు మాపై విమర్శలు చేయడం విడ్డూరం



నల్లగొండ పట్టణంలో బైక్ నడుపుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: కాంగ్రెస్ ప్రభుత్వ గృహజ్యోతి పథకం ఫేమస్ అని, కేసీఆర్ ప్రభుత్వ 24 గంటల కరెంట్ మొత్తం బోగస్ అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన నల్లగొండలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంత్రి మాట్లాడారు. ఇచ్చిన హామీ ప్రకారం 90 రోజుల్లోపే నాలుగు గ్యారంటీలను అమలు చేసి చూపిస్తున్నామన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని ధ్వజమెత్తారు. పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు కూడా ఇవ్వని బీఆర్‌ఎస్.. నేతలు నేడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 25 వేల మంది నిరుద్యోగులకు ఇప్పటికే ఉద్యోగాలు ఇచ్చామని, డీఎస్సీ, గ్రూప్–1 నోటిఫికేషన్లు ఇచ్చామని వివరించారు. రాబోయే రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేసి నల్లగొండ జిల్లాకు తాగు, సాగు నీటి కష్టాలు లేకుండా చేస్తామన్నారు.

11 నుంచి ఇందిరమ్మ ఇళ్లు..

ఈనెల 11 నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు ఇస్తామని.. ఇంటి స్థలం లేని వారికి ప్రభుత్వమే మామిళ్లగూడెంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. రూ. వేల కోట్ల బకాయిలు ఉన్నప్పటికీ 1వ తేదీనే ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నామని తెలిపారు.

బైక్ నడిపిన మంత్రి కోమటిరెడ్డి..

నల్లగొండలో ఆదివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వయంగా బైక్ నడిపి హల్‌చల్ చేశారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డిని బైక్‌పై ఎక్కించుకుని పట్టణంలోని పలు వార్డుల్లో తిరిగారు. హైదర్‌ఖాన్‌గూడ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కలెక్టర్ హరిచందనతో కలసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన తిప్పర్తి మండలం మర్రిగూడ, కనగల్ మండలాల్లోని పలువురు గృహజ్యోతి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బిల్లుల గురించి అడిగి తెలుసుకున్నారు.

కేటీఆర్ బచ్చా.. ఆయనతో పోటీ ఏంటి!

'కేటీఆర్ ఒక బచ్చా.. ఆయన తండ్రి చాటు కొడుకు. ఆయనతో నాకు, సీఎం రేవంత్‌కు పోటీ ఏంటి'అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రి నల్లగొండ నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా.. కేటీఆర్‌పై పోటీ చేస్తున్నారా? అని మీడియా అడగ్గా పైవిధంగా స్పందించారు. 'కేటీఆర్.. కేసీఆర్ సీఎం అయి, టికెట్ ఇస్తే అమెరికా నుంచి వచ్చి ఎమ్మెల్యే అయిండు. మా లెక్క కష్టపడి రాలేదు'అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జెడ్పీటీసీగా ఇండిపెండెంట్‌గా గెలిచి అక్కడ నుంచి ఎమ్మెల్యే, ఎంఎల్సీగా, ఎంపీగా అయి, ముఖ్యమంత్రి వరకు ఎదిగారన్నారు. తాను కూడా ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లో కొట్లాడి ఎమ్మెల్యే అయ్యానని, తమది వ్యవసాయ కుటుంబమని.. కేటీఆర్ తండ్రి వ్యవసాయం చేయడం లేదని స్పష్టం చేశారు. అలాంటి బచ్చాతో మాకు పోటీయా? అంటూ మంత్రి ఎద్దేవా చేశారు. పార్లమెంట్ టికెట్ల విషయాన్ని అధిష్టానం చూసుకుంటుందని, నల్లగొండ, భువనగిరిలో తమ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థులే మోదీ కంటే అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని అన్నారు.

రెండు రోజులు రాష్ట్రంలో ప్రధాని



ఆదిలాబాద్‌లోని స్టేడియంలో ప్రధాని బహిరంగ సభ వేదిక

▶ మొదటి పేజీ తరువాయి

హెలికాప్టర్‌లో బయల్దేరి నాందేడ్‌కు, అక్కడినుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకు వెళ్లనున్నారు. సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుని రాత్రికి రాజ్‌భవన్‌లో బస చేయనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లో సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (సీఏఆర్ఓ)ను జాతికి అంకితం చేస్తారు. అనంతరం సంగారెడ్డి పర్యటనలో పాల్గొంటారు. అక్కడా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ప్రధాని పర్యటన పురస్కరించుకుని మొత్తం 2 వేల మంది పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. సోమవారం ఆదిలాబాద్‌కు వస్తున్న ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై దాడి!

రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌ల విధానాలపై విమర్శలు ఎక్కుపెట్టడంతో పాటు ఈ రెండు పార్టీలు కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాయంటూ తీవ్రస్థాయిలో ఎండగట్టడం ద్వారా తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ప్రధాని శ్రీకారం చుట్టనున్నట్టు తెలుస్తోంది. పదేళ్లుగా తమ ప్రభుత్వం దేశాభివృద్ధికి పాటుపడుతుంటే...కాంగ్రెస్, బీఆర్‌ఎస్ లాంటి పార్టీలు వారసత్వ రాజకీయాలతో పాటు అవినీతి, నిరంకుశ రాజకీయాలు చేస్తున్నాయంటూ విరుచుకుపడనున్నట్టు సమాచారం. పలు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి, దేశ సర్వతోముఖాభివృద్ధికి, ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని సమున్నతంగా నిలబెట్టేందుకు తాము చేస్తున్న కృషిని వివరించనున్నారని సమాచారం.

కుట్రలో భాగంగానే...

మూడు రోజుల కిందట బాబు అనుకూల తోక పత్రికకు అధిపతిగా వ్యవహరిస్తున్న వ్యక్తి నర్రెడ్డి సునీతతో సహా చంద్రబాబును కలిశారు. కడప ఎంపీగా సునీతను పోటీకి దింపటంపై అక్కడ చర్చ జరిగింది. చివరకు సునీతను పోటీ చేయించని పక్షంలో ఆమె చేత విస్తృతంగా ప్రచారం చేయించాలనే నిర్ణయానికి వచ్చారు. ప్రచారమంటే... నియోజకవర్గంలో తిరగటం మాత్రమే కాదు. జాతీయ స్థాయిలో మీడియా సమావేశాలు కూడా. అందులో భాగమే ఢిల్లీలో సునీత ప్రెస్ కాన్ఫరెన్స్. దానికి కొనసాగింపే శనివారం 'హూ కిల్డ్ బాబాయ్' అంటూ బహిరంగ సభలో చంద్రబాబు ఊగిపోవటం. ఇదంతా ఒక స్కెచ్. సూత్రధారి చంద్రబాబు. పాత్రధారులు సునీత నుంచి దస్తగిరి, బీటెక్ రవి వరకూ ఎందరో!!.

? వివేకా హత్యతో లాభమెవరికి?

జాతీయ, అంతర్జాతీయ నేర పరిశోధన ప్రమాణాలు చెప్పేదొకటే..
ఒక నేరం వల్ల ఎవరికి లాభం ఉంటుందో వారే దోషులు, కుట్రదారులు.
అలా చూసినప్పుడు వివేకా హత్యతో లాభమెవరికి?
ఆయన్ను అడ్డు తొలగించుకోవాలనుకున్నది ఎవరు?
ఈ కోణంలో పరిశీలించినప్పుడు వచ్చే సమాధానాలు రెండే.

వివేకా సంపాదించిన ఆస్తులు తమకే దక్కాలని, ఆయన రాజకీయ వారసత్వమూ తమకే ఉండాలని వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి పంతం పట్టారు.

కాకపోతే షమీమ్ అనే మహిళను వివేకా రెండో వివాహం చేసుకున్నారు. అది అందరికీ తెలిసిన విషయమే. ఆమెతో వివేకాకు ఓ కుమారుడు కూడా ఉన్నాడు. ఈ రెండో వివాహంతో వివేకా కుటుంబంలో తీవ్ర విభేదాలు తలెత్తాయి.

వివాహాన్ని వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు, చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు.

అప్పటి నుంచి సౌభాగ్యమ్మ పులివెందులలో నివాసం ఉండకుండా హైదరాబాద్‌లో ఉన్న కుమార్తె సునీత వద్ద ఉంటున్నారు.

? సునీత నర్రెడ్డి

ఆస్తి మొత్తం మాకే దక్కాలి....




వివేకా రెండో వివాహాన్ని ఆయన కుమార్తె సునీత తీవ్రంగా వ్యతిరేకించారు. తన తండ్రి యావదాస్తీ తమకే చెందాలని ఆమె పంతం పట్టారు. కానీ వివేకానందరెడ్డి తన రెండో భార్యకు ఆస్తిలో వాటా ఇస్తానన్నారు. ఓ ఇల్లు ఇచ్చేశారు. హైదరాబాద్‌లోనూ ఒక ఇల్లు కొనుగోలు చేసి తన కుమారుడిని అక్కడే ఉంచి బాగా చదివిస్తానని షమీమ్‌కు మాట ఇచ్చారు. దాన్ని వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత తీవ్రంగా వ్యతిరేకించారు. వాగ్వాదానికి దిగారు. అక్కడితో ఆగకుండా కుటుంబానికి చెందిన కంపెనీల్లో ఆయనకున్న చెక్ పవర్‌ను రద్దు చేశారు. షమీమ్‌తో సునీత గొడవ పడ్డారు. పరస్పరం దారుణంగా దూషించుకుంటూ వారిద్దరి మధ్య సాగిన వాట్సాప్ చాటింగ్ వివరాలను కూడా దర్యాప్తు సంస్థలు వెలికి తీశాయి. సౌభాగ్యమ్మ, సునీత మొండి పట్టుదల చూశాక వివేకా కాస్త జాగ్రత్తపడ్డారు. తన ఆస్తిలో షమీమ్‌కు వాటా కల్పిస్తూ వీలునామా రాస్తానన్నారు. అందుకోసం స్టాంపు పేపర్లు కూడా తెప్పించుకున్నారు. అదిగో... అలా స్టాంపు పేపర్లు తెచ్చిన రోజుల వ్యవధిలోనే వివేకా హఠాత్తుగా హత్యకు గురయ్యారు. ఆయన్ను హత్య చేశాక దస్తగిరి సహా హంతకులు ఆ ఇంటిలో ఉన్న బీరువాలో ఏవో స్టాంపు పేపర్లు, రౌండ్ సీల్ కోసం వెతికారని ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వాచ్‌మెన్ రంగయ్య తన వాంగ్మూలంలో పేర్కొనడం ఇక్కడ ప్రస్తావనార్హం. పైపెచ్చు వివేకా హత్య జరిగిన కొన్ని నెలలకే కుటుంబానికి చెందిన భూములు, ఇతర ఆస్తులన్నింటినీ సునీత తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీన్ని బట్టి హత్య వల్ల ఎవరికి లబ్ధి కలిగిందో తెలుస్తోంది కదా!. మరి హత్య చేయించిందెవరో కనుక్కోవటానికి ఇంతకన్నా ఏం కావాలి?

మాటమార్చి... చంద్రబాబు గూటిలోకి


తన తండ్రి వివేకా హత్య వెనుక అప్పటి టీడీపీ ప్రభుత్వంలోని మంత్రి ఆదినారాయణ రెడ్డి, అప్పటి టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఉన్నారని సునీత 2019 మార్చిలో చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డి విజయం కోసం తన తండ్రి చివరి వరకూ కృషి చేశారని కూడా చెప్పారు. 2019 మార్చి 21న హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి మరీ ఇవన్నీ చెప్పిన సునీత... 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసి తన తండ్రి కోరిక నెరవేర్చాలని ప్రజలను కోరారు. కానీ 2020లో స్థానిక సంస్థల ఎన్నికల తరువాత ఆమె పూర్తిగా ప్లేటు ఫిరాయించారు. సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డి... చంద్రబాబు గుప్పిట్లోకి వెళ్లి టీడీపీ రాజకీయ కుట్రలో భాగస్వాములయ్యారు.

? చంద్రబాబు

రాజకీయ లబ్ధికి ఇదే అదను..



2019 మార్చి 15న వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు అధికారంలో ఉన్నది తెలుగుదేశం పార్టీ. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. నిజానికి కడప జిల్లాలోను, పులివెందులలోను టీడీపీకి ప్రధాన అడ్డంకి వైఎస్ వివేకా. ఆయన అడ్డు తొలగింది. వైసీపీ అధిపతి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సన్నిహితంగా ఉండే కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని దీనిలో ఇరికించి దుష్ప్రచారం సాగిస్తే... కడప జిల్లాలో తాము పాగా వేయొచ్చనేది బాబు దురాలోచన. అందుకే... మార్చి 15న వివేకా హత్య విషయం బయటకు వచ్చిన తరవాత బాబు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. తన సొంత మనిషి అయిన అప్పటి రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావును రంగంలోకి దింపారు. ఆయన అందరినీ ప్రభావితం చేస్తూ దర్యాప్తును ఆదిలోనే తప్పదోవ పట్టించారు. నిజానికి ఈ హత్య విషయంలో సునీత లక్ష్యం ఒక్కటే. హత్య వెనుకనున్న తన భర్త, బావగార్ల పేర్లు బయటకు రాకుండా ఉండటం. బాబు లక్ష్యమేమో తన ప్రత్యర్థులను ఇరికించటం. అందుకే ఈ విజాతి ధ్రువాలు రెండూ ఆకర్షించుకుని... ఒకరి లక్ష్యానికి మరొకరు సాయంగా నిలిచారని... రానురాను కుట్రను మరింత లోతుల్లోకి తీసుకెళుతున్నారని ఈ వ్యవహారాన్ని దగ్గర్నుంచి పరిశీలిస్తున్నవారు చెప్పే మాట. ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిలపై సందేహాలు రేకెత్తించేలా పచ్చ మీడియా ద్వారా అభూతకల్పనలతో దుష్ప్రచారం చేయటం... హత్య వెనుక ఉన్న కుట్రదారుల పాత్ర బయటకురాకుండా కేసును సంక్లిష్టంగా మార్చటం... ఇవన్నీ ఇందులో భాగంగానే జరిగిపోయాయి.



వైఎస్ వివేకాను చంపిందెవరు?

చంద్రబాబు గ్యాంగ్‌కు కృతజ్ఞతలతో.. మీ సునీత

బహుశా... నాలుగేళ్లుగా తాము సాగిస్తున్న కుట్రను మరింత పదునెక్కించాలనుకున్నారో, ఇకపై ముందుకు వెళ్లాలంటే ముసుగు తీయక తప్పదని భావించారో గానీ... సునీత ముసుగు తీశారు. రెండ్రోజుల కిందట ఢిల్లీలో బాబు స్క్రిప్టును చదువుతూ... ఆఖరికి టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభికి కూడా కృతజ్ఞతలు చెప్పారంటే టీడీపీ ఏ స్థాయిలో సునీతకు సహకరించిందో... ఈ కుట్ర ఎంత లోతైనదో తెలియకమానదు. వైఎస్సార్‌సీపీ టికెట్టుపై గెలిచి... ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని దూషిస్తూ సమాజంలో వర్గవిభేదాలు సృష్టించేందుకు కుట్రపన్నిన ఎంపీ రఘురామకృష్ణరాజు... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అత్యంత పరుషపదంతో దూషించిన టీడీపీ నేత పట్టాభి... సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతూ అత్యంత వివాదాస్పదుడిగా మారిన టీడీపీ నేత, పి.గన్నవరం అభ్యర్థి మహాసేన రాజేశ్.. తమ పార్టీ విధానాలతో నిమిత్తం లేకుండా చంద్రబాబు కోసమే పనిచేస్తున్న కాంగ్రెస్ నేత తులసిరెడ్డి, సీపీఐ నారాయణ... బీజేపీలో ఉంటూ బాబు ఎజెండాను అమలు చేస్తున్న సీఎం రమేశ్... బాబు లాయరు సిద్ధార్థ లూథ్రా... నిరపరాధులను హింసించి, వేధించి కేసు దర్యాప్తును పక్కదారి పట్టించిన సీబీఐ అధికారి రామ్‌సింగ్... సీఎం వైఎస్ జగన్‌పై తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా... వీళ్లందరికీ సునీత కృతజ్ఞతలు తెలిపారు. అంటే తాను ఆ పచ్చ ముఠాలో సభ్యురాలినేనని విస్పష్టంగా ప్రకటించారు. విశేషమేంటంటే వీళ్లందరిలో ఓ ఉమ్మడి లక్షణం ఉంది. అది... తమ వృత్తులు, పార్టీలకు అతీతంగా చంద్రబాబు కోసం పనిచేయటం. వైఎస్ జగన్‌ను తీవ్రంగా వ్యతిరేకించటం. అది చాలదూ... సునీత పాత్రను బయటపెట్టడానికి!!.

ఇంకా వివేకా ఎవరెవరికి అడ్డంకిగా ఉన్నారు? ఆయన హత్యతో ఏ పాత్రధారికి ఎలాంటి లాభం? ఇవన్నీ ఒకసారి చూద్దాం...

? ఆదినారాయణ రెడ్డి

గుండెపోటు అని మొదట చెప్పింది ఈయనే...




వివేకా గుండెపోటుతో చనిపోయారని మీడియా సాక్షిగా బయటకు చెప్పింది నాటి మంత్రి ఆదినారాయణ రెడ్డి. వివేకా బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి తనకు ఫోన్ చేసి గుండెపోటుతో వివేకా మరణించారని చెప్పారని, సిగరెట్లు ఎక్కువ తాగుతారు కనక అలా జరిగి ఉండొచ్చని తాను కూడా అన్నానని ఆయన స్వయంగా మీడియాకు వెల్లడించారు. అంతేకాదు.. శివప్రకాశ్ రెడ్డి ఇదే విషయాన్ని ఎన్నికల ప్రచారం కోసం వెళుతున్న ఎంపీ అవినాశ్‌రెడ్డికి చెప్పటంతో... ఆయన తన వాహనాన్ని నిలిపేసి, వెనక్కు తిరిగి వివేకా ఇంటికి వచ్చారు. మరి గుండెపోటు అని ప్రచారం చేయాల్సిందిగా శివప్రకాశ్‌రెడ్డికి చెప్పిందెవరు?

ఆదినారాయణ రెడ్డికి ఆయనే అడ్డంకి...

2014 ఎన్నికల్లో జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఆదినారాయణ రెడ్డి... టీడీపీకి అమ్ముడుపోయారు. వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే పదవికి రాజీనామ కూడా చేయకుండా అనైతికంగా టీడీపీ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. 2019 ఎన్నికల్లో ఆయన్ను కడప ఎంపీ అభ్యర్థిగా చంద్రబాబు నిర్ణయించారు. కానీ ఎంపీగా గెలవటానికి వివేకానందరెడ్డి ప్రధాన అడ్డంకిగా నిలిచారు. జిల్లాపై పూర్తి పట్టున్న వివేకా రంగంలో ఉంటే తాను ఎంపీగా గెలవడం అసాధ్యమని ఆది నారాయణ రెడ్డి గుర్తించారు. ఈ నేపథ్యంలో వివేకా హత్యకు గురయ్యారు. వివేకా హత్య ఆదినారాయణరెడ్డికి రాజకీయంగా ప్రయోజనం కలిగించేదే కదా?

? బీటెక్ రవి...

వివేకా ఉంటే ఇక అంతే..



పులివెందుల నియోజకవర్గంలో కనీసస్థాయిలోనైనా పట్టు సాధించాలన్నది టీడీపీ నేత బీటెక్ రవి లక్ష్యం. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో 2019 ఎన్నికల్లో యథేచ్ఛగా అక్రమాలు సాగించవచ్చనేది ఆయన పన్నాగం. కానీ వివేకా వైఎస్సార్‌సీపీకి పెద్దదిక్కుగా నిలబడటంతో బీటెక్ రవి ఆటలు సాగలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను దొంగదెబ్బ తీసిన బీటెక్ రవికి పులివెందుల అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కకుండా చేయాలని వివేకా పంతం పట్టారు. ఈ నేపథ్యంలోనే ఆయన హత్యకు గురయ్యారు. హత్యకు ముందు రోజు కొమ్మారెడ్డి పరమేశ్వర రెడ్డి(ఈయనకు వివేకాతో ఆర్థిక విభేదాలు తలెత్తాయి)తో బీటెక్ రవి రెండుసార్లు సమావేశమయ్యారు. ఈ భేటీలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి తర్వాత కొద్ది రోజులకే అనుమానాస్పద రీతిలో మృతి చెందారు కూడా. సిట్ దర్యాప్తులో నార్కో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినా పరమేశ్వరరెడ్డి తిరస్కరించడం సందేహాలకు తావిచ్చేదే.

? నర్రెడ్డి రాజశేఖరరెడ్డి

లేఖను దాచి... గుండె పోటని ప్రచారం చేసి



వివేకా హత్య కేసు దర్యాప్తు పక్కదారి పట్టించడంలో సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావగారు నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డిది కీలకపాత్ర. ఎందుకంటే హత్యకు గురైనపుడు వివేకా తన స్వదస్తూరితో రక్తంతో ఓ లేఖను రాశారు. ఆ లేఖను చూసిన ఎవరికైనా... అది మామూలు మరణం కాదని, ముమ్మాటికీ హత్యేనని తెలిసిపోతుంది. అలాంటి లేఖను ఆ రోజు (2019, మార్చి 15) ఉదయం 6.10 గంటలలోపే వివేకా పీఏ కృష్ణారెడ్డి చూశారు. ఆ విషయాన్ని వెంటనే సునీత భర్త రాజశేఖరరెడ్డికి ఫోన్లో చెప్పారు. 'మేం వచ్చే వరకు ఆ లేఖను గానీ, వివేకా సెల్‌ఫోన్‌ను గానీ ఎవరికీ ఇవ్వవద్దు. పోలీసులకు కూడా చెప్పొద్దు' అని వారు పీఏ కృష్ణారెడ్డిని ఆదేశించారు. ఆ లేఖను గనక వెంటనే పోలీసులకు ఇవ్వమని వారు చెప్పి ఉంటే... మొత్తం వ్యవహారం మరోలా ఉండేది. వివేకాది హత్య అని తేలిపోయేది. ఎవరూ మృతదేహం వద్దకు వెళ్లేవారు కాదు. పోలీసులు తమ పని తాము చేసేవారు. కానీ లేఖను ఉద్దేశపూర్వకంగా గోప్యంగా ఉంచటంతో... వ్యవహారం మొత్తం వారు ప్లాన్ చేసినట్టే సాగింది.

? రామ్‌సింగ్

చంద్రబాబు చేతిలో పావు...

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు ఎంతటి సిద్ధహస్తుడో వివేకా కేసులో సీబీఐ తీరే నిరూపిస్తోంది. వాస్తవానికి ఈ కేసులో నిశితమైన దర్యాప్తు జరిగి దోషులు బయటపడాలని మొదటి నుంచీ భావిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... కేసును సీబీఐ దర్యాప్తు కోసం అప్పగించాలని సునీత కోరగానే సరేనన్నారు. సీబీఐకి అప్పగించారు. కాకపోతే 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోగానే ముందస్తు కుట్రతో బీజేపీలోకి పంపిన తన మనుషులు సీఎం రమేశ్, సుజనా చౌదరి ద్వారా చంద్రబాబు చక్రం తిప్పటం మొదలెట్టారు. సీబీఐ దర్యాప్తు అధికారిగా నియమితుడైన రామ్ సింగ్ వివాదాస్పద వ్యవహార శైలే అందుకు తార్కాణం. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాల్సిన ఆయన ముందుగానే ఓ నిర్ణయానికి వచ్చేసినట్టుగా ఎంపీ అవినాశ్ రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిలను లక్ష్యంగా చేసుకుని కేసును పక్కదారి పట్టించారు. దస్తగిరిని ఢిల్లీకి తీసుకెళ్లి బెదిరించి... ప్రలోభాలకుగురి చేసి అప్రూవర్‌గా మార్చారు. తాము అనుకున్నది అతని అప్రూవర్ వాంగ్మూలంగా నమోదు చేశారు. పీఏ కృష్ణారెడ్డిని, మరికొందర్ని ఢిల్లీకి తీసుకువెళ్లి తీవ్ర చిత్రహింసలు పెట్టారు. తాను చెప్పిందే చెప్పాలని వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. వైఎస్సార్ జిల్లాలో పలువురిని అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురి చేయడంతో వారి కుటుంబాలు బెంబేలెత్తిపోయాయి. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు రామ్‌సింగ్ స్వయంగా అసత్య ఆరోపణలు చేశారు. కడపలో తాను కార్లో వెళ్తుంటే ఆగంతకులు వచ్చి హత్య చేస్తానని బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించగా ఆయన కారుపై ఎలాంటి దాడి జరగలేదని... ఎవరూ బెదిరించలేదని నిర్ధారణ అయ్యింది. అనేక ఫిర్యాదులు రావటంతో ఇంతటి వివాదాస్పదుడైన రామ్‌సింగ్‌ను న్యాయస్థానం ఆదేశాలతో కేంద్ర హోమ్ శాఖ ఈ కేసు దర్యాప్తు నుంచి తప్పించింది.

? దస్తగిరి

హత్య చేసి... హైడ్రామా



తండ్రిని చంపినవారిపై ఎవరికైనా కోపం, కక్ష ఉంటాయి. కానీ వివేకానందరెడ్డిని ఎంత పాశవికంగా హత్య చేసిందీ వెల్లడించిన దస్తగిరితో వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి అత్యంత సన్నిహితంగా ఉండటం విస్మయం కలిగించేదే. వివేకాను హత్య చేసిన నలుగురిలో దస్తగిరి ఉన్నారన్నది నిర్ధారణ అయ్యింది. కానీ అదే దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డిపై నిరాధారణ ఆరోపణలు చేయిస్తున్నారంటే... వెనుక ఎవరున్నారన్నది కీలకం. చంద్రబాబు, ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి...ఇలా అందరూ దస్తగిరికి బహిరంగంగానే సహకరిస్తున్నారు. వివేకా హత్యకు ముందు రూ.500 కు కూడా అప్పులు చేసిన దస్తగిరి ప్రస్తుతం ఓ కాన్వాయ్‌తో కూడిన బొలేరో వాహనాలను కొనుగోలు చేసి దర్జాగా తిరుగుతున్నారు. ఇక దస్తగిరి చేస్తున్న దుష్ప్రచారాన్ని పదే పదే టీడీపీ అనుకూల మీడియా ప్రసారం చేస్తోంది. ఆయన ఇంటర్వ్యూలు ప్రసారం చేస్తోంది. అంటే దస్తగిరి ఇష్టానుసారంగా చెబుతున్న కట్టుకథలు, చేస్తున్న అసత్య ఆరోపణల వెనుక చంద్రబాబు ముఠా, సునీత కుటుంబమే ఉందన్నది స్పష్టమవుతోంది కదా!.

? నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి

రాజకీయ వారసత్వం మాకే దక్కాలి..



వివేకానందరెడ్డి రాజకీయ వారసత్వంపై ఆయన అల్లుడు, చిన బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి కన్నేశారు. ఆయన తరువాత రాజకీయ వారసత్వంగా తమకే పదవులు దక్కాలని భావించారు. కానీ వివేకానందరెడ్డి తన రెండో భార్య షమీమ్‌తో తనకు కలిగిన కుమారుడిని రాజకీయ వారసుడిగా ప్రకటించాలని నిర్ణయించారు. దాంతో రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డి కంగుతిన్నారు. షమీమ్ ఇంటికి వెళ్లి ఆమెను తీవ్రంగా హెచ్చరించారు. ఆమె కుమారుడిని కిడ్నాప్ చేస్తామని కూడా బెదిరించారు. వారిద్దరికి భయపడి ఆమె పులివెందుల నుంచి హైదరాబాద్ వెళ్లిపోయి ఓ అజ్ఞాత ప్రదేశంలో ఉండేవారు. అంటే వివేకానందరెడ్డి రాజకీయ వారసత్వం తమకే దక్కాలని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్‌రెడ్డి ఎంతకైనా తెగించేందుకు సిద్ధపడ్డారన్నది సుస్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే వివేకానందరెడ్డి 2019 ఎన్నికల ముందు హత్యకు గురయ్యారు.

సెల్‌ఫోన్లో డేటా డిలీట్ చేశారెందుకు?

ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పులివెందుల చేరుకున్న సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డికి వివేకా రాసిన లేఖను, సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి అందజేశారు. వారు ఆ సెల్‌ఫోన్లోని డేటాను డిలీట్ చేశారు. సునీత ఆదేశాలతో సాయంత్రం 5 గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను పోలీసులకు ఇచ్చారు. "ఆ రోజు ఉదయం పీఏ కృష్ణా రెడ్డి ఫోన్ చేసి గాయాలతో వివేకా బాత్రూమ్‌లో పడి ఉన్నారని చెప్పారు. మా నాన్నకు గతంలో కూడా గుండె సమస్య ఉన్నందున బాత్రూమ్‌లో పడి తలకు బలమైన గాయం అయి ఉండొచ్చని భావించా. అందుకే పోలీసులకు అలాగే ఫిర్యాదు చేయమని కృష్ణారెడ్డితో చెప్పా" అని సిట్ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో సునీత పేర్కొన్నారు. లేఖను చూశాకైనా... వివేకా మృతదేహాన్ని చూశాకైనా ఒక డాక్టరైన సునీతకు ఎలాంటి అనుమానమూ రాలేదంటే ఏమనుకోవాలి? ఉద్దేశపూర్వకంగా నిజాలు దాటిపెట్టారని భావించనవసరం లేదా?

తండ్రిని ఓడించినా... సునీతకు ఇష్టులే

వివేకానందరెడ్డిని 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే చంద్రబాబు దొంగదెబ్బ తీసి ఓడించారు. 2017లో వైఎస్సార్ జిల్లాలో స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ వివేకాను పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎంపిక చేశారు. జిల్లాలో మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ వారే కావడంతో ఆయన గెలుపు నల్లేరుపై నడకేనని భావించారు. వివేకా ఎమ్మెల్సీగా ఎన్నికైతే జిల్లాలో టీడీపీకి ఉనికే ఉండదని చంద్రబాబు భావించారు. అందుకే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురి చేసి వివేకాను కుట్రతో ఓడించారు. అక్రమాలకు పాల్పడి బీటెక్ రవి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ కుట్రలో చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి సర్వంతామై వ్యవహరించారు. కానీ ఆ ముగ్గురూ సునీతకు, ఆమె భర్త, బావగారికిప్పుడు అత్యంత సన్నిహితులైపోవటమే విచిత్రం.

- సాక్షి, అమరావతి



లోతుగా ఆలోచించే ప్రతి ఒక్క ఆలోచనాపరుడు
తనను అర్థం చేసుకోవడం కంటే కూడా,
అపార్థం చేసుకోవడం గురించి ఎక్కువ భయపడతాడు.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 4 మార్చి 2024

పుస్తక హననం

నేను గనక కాలంలో వెనక్కి వెళ్లగలిగితే, అలెగ్జాండ్రియా లైబ్రరీని దర్శిస్తానంటాడు ఖగోళ శాస్త్రవేత్త కార్ల్ సాగన్. ఈజిప్టులోని అలెగ్జాండ్రియా లైబ్రరీకి ప్రపంచంలోనే అత్యంత గొప్ప గ్రంథాలయం అని పేరు. వేలాది గ్రీకు, హీబ్రూ, మెసొపొటేమియన్ సాహిత్య స్క్రోల్స్, ప్రాచీన ఈజిప్టుకు చెందిన కళోపకరణాలు ఇక్కడ ఉండేవి. ఎరాటోస్తనీస్, ఆర్కిమెడీస్, యూక్లిడ్ వంటి గ్రీకు శాస్త్రజ్ఞులు దీన్ని సందర్శించారు. రెండు వేల ఏళ్ల కిందట ఇది వైభవోపేతంగా వర్ధిల్లిందనీ, దీన్ని క్రీ.పూ. 48–47 ప్రాంతంలో సీజర్ తగలబెట్టేశాడనీ చెబుతుంటారు. అయితే, తగలబడిందని నిర్ధారించడానికి చారిత్రక ఆధారాలు లేవనీ, మానవ జాతి పోగేసుకున్న సమస్త వివేకసారం మట్టి పాలైందని అనుకోవడంలో ఉన్న ఉద్వేగంలోంచి ఈ కథ పుట్టివుంటుందనీ చెబుతాడు బ్రిటిష్ లైబ్రేరియన్, రచయిత రిచర్డ్ ఓవెండెన్. ఇప్పటి 'పుస్తకం' ఉనికిలో లేని ఆ కాలంలో నునుపు చేసిన చెట్ల బెరడుల రోల్స్ కాలక్రమంలో నశించడమే ఈ కథగా మారివుంటుందని మరో కథ. ఏమైనా, సమస్త విజ్ఞానం ఒక చోట రాశిగా పోగయ్యే గ్రంథాలయం అనే భావనను ఊహించడమే మానవ నాగరికత సాధించిన విజయం. ఆ గ్రంథాలయాలనే నేలమట్టం చేయడం ద్వారా శత్రువు మీద పైచేయి సాధించే ప్రయత్నం చేయడం... అదే నాగరిక మానవుడి అనాగరికతకు తార్కాణం.

ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం మొదలైనప్పటినుంచీ జరుగుతున్న ప్రాణనష్టం గురించి మీడియా మాట్లాడుతూనే ఉంది. కానీ గాజాలో కనీసం పదమూడు గ్రంథాలయాలకు ఇజ్రాయెల్ వల్ల నష్టం వాటిల్లింది. ఇందులో కొన్ని పూర్తిగా నాశనం కాగా, కొన్ని దారుణంగా దెబ్బతినడమో, అందులో ఉన్నవి దోచుకెళ్లడమో జరిగింది. నూటా యాభై ఏళ్ల గాజా చరిత్ర రికార్డులున్న సెంట్రల్ ఆర్కైవ్స్ ఆఫ్ గాజా, పాలస్తీనాలోని అరుదైన పుస్తకాల కలెక్షన్ కలిగివున్న గ్రేట్ ఒమారి మాస్క్, వేలాది పుస్తకాలకు నెలవైన డయానా తమారీ సబ్బాగ్ లైబ్రరీతో పాటు, గాజా యూనివర్సిటీ లైబ్రరీ, అల్–ఇస్రా యూనివర్సిటీ లైబ్రరీ కూడా దెబ్బతిన్నవాటిల్లో ఉన్నాయి. ''ఆర్కైవ్ మీద ఆధిపత్యం లేకపోతే రాజకీయ అధికారం లేదు'' అంటాడు ఫ్రెంచ్ విమర్శకుడు జాక్వెస్ డెరిడా. అందుకే గ్రంథాలయాలను దొంగదెబ్బ కొట్టడం అనేది చరిత్ర పొడవునా జరుగుతూనే ఉంది.

ప్రపంచానికే జ్ఞానకాంతిగా వెలుగొందింది భారత్‌లోని నలందా విశ్వవిద్యాలయం. 5వ శతాబ్దంలో గుప్తులకాలంలో ఇది నిర్మితమైంది. రత్నదధి, రత్నసాగర, రత్నరంజక పేరుతో మూడు తొమ్మిదంతస్థుల భవనాలుండేవి. ఖగోళం, జ్యోతిషం, గణితం, రాజకీయం, ఆయుర్వేదం, వైద్యం, కళలు, సాహిత్యం, వ్యాకరణం, తర్కం సంబంధిత అంశాలన్నింటికీ నెలవు ఇది. జైన తీర్థంకరుడు మహావీరుడు 14 వర్షాకాలాలు ఇక్కడ గడిపాడట! క్రీ.శ.1193లో భక్తియార్ ఖిల్జీ దీన్ని తగలబెట్టించాడు. దేశంలో బౌద్ధ ప్రాభవం క్షీణించడానికి ఇదీ ఓ కారణమని చెబుతారు. ''గ్రంథాలయాల ద్వారా సమాజం తన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంది. కొన్నిసార్లు గ్రంథాలయాలను సాంస్కృతిక హనన పథకంలో భాగంగా ఉద్దేశపూర్వకంగా నాశనం చేశారు. ఎన్నో ప్రజా, ప్రైవేటు లైబ్రరీలు మూర్ఖ దురాక్రమణదారుల వల్ల నాశనం అయ్యాయి'' అంటారు పాత్రికేయుడు జానీ డైమండ్.

బీజింగ్‌లో ఎనిమిదో శతాబ్దంలో నెలకొల్పిన హాన్లిన్ లైబ్రరీ ఒక విజ్ఞాన భాండాగారం. ఇందులో ఒక ముఖ్యమైన సోర్సు మింగ్ వంశపు చక్రవర్తి ఝూ డీ 1403లో 'జాంగ్లే దాదియన్' పేరుతో సిద్ధం చేయించిన ఎన్‌సైక్లోపీడియా. వ్యవసాయం, నాటకం, భూగర్భశాస్త్రం, వైద్యం, కళ, చరిత్ర, సాహిత్యం లాంటి వాటితో కూడిన 22,000 విభాగాలు అందులో ఉన్నాయి. 1900వ సంవత్సరంలో మంటల్లో లైబ్రరీ తగలబడినప్పుడు ఆ ఎన్‌సైక్లోపీడియా కూడా మసైపోయింది. వలసవాదులు, తిరుగుబాటుదారుల రూపంలో ఉన్న బ్రిటిష్ వాళ్లు, చైనీయులు దీనికి కారణం మీరంటే మీరేనని పరస్పరం నిందించుకున్నారు.

అమెరికా జాతీయ గ్రంథాలయాన్ని 1814లో బ్రిటిష్‌వాళ్లు నాశనం చేశారు. అప్పటికి దాన్ని నెలకొల్పి నాలుగేళ్లే అయింది. సెనేటర్ల ఉపయోగార్థం 3000 వాల్యూములు అందులో ఉన్నాయి. అయినప్పటికీ ఆ దెబ్బ తమ జాతి ఆత్మను గాయపరిచిందంటాడు అమెరికా చరిత్రకారుడు రాబర్ట్ డార్న్టన్. అదే బ్రిటనీయులు 2003లో ఇరాక్ జాతీయ గ్రంథాలయాన్ని నాశనం చేశారు. పనామ్ పెన్హ్ నగరంలోని జాతీయ గ్రంథాలయాన్ని 1967లో సర్వనాశనం చేయడం ద్వారా కంబోడియా నాగరికత మొత్తాన్నీ 'ఖ్మేర్ రూజ్' తుడిచిపెట్టింది. దేశ చరిత్రను మళ్లీ 'ఇయర్ జీరో' నుంచి మొదలుపెట్టించాలన్న మూర్ఖత్వంలో భాగంగా కమ్యూనిస్టు నాయకుడు పోల్ పాట్ సైన్యం నరమేధానికీ, సాంస్కృతిక హననానికీ పాల్పడింది. సుమారు లక్ష పుస్తకాలున్న, అప్పటికి యాభై ఏళ్ల పాతదైన శ్రీలంకలోని జాఫ్నా పబ్లిక్ లైబ్రరీని 1981లో సింహళ మూక కూడా అలాగే తగలబెట్టింది.

ఒక గ్రంథాలయం ధ్వంసమైతే మనం ఏం కోల్పోయామో కూడా మనకు తెలియకపోవడం అతి పెద్ద విషాదం. ఒక గ్రంథాలయాన్ని నిర్మూలించడమంటే ఒక దేశ, ఒక జాతి సాంస్కృతిక వారసత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టడం; గతపు ఘనతను పూర్తిగా నేలమట్టం గావించడం; అన్నీ కోల్పోయినా మళ్లీ మొదలెట్టగలిగే శక్తియుక్తులను నిర్వీర్యం చేయడం; చెప్పాలంటే ఇంకేమీ లేకుండా చేయడం, సున్నా దగ్గరికి తెచ్చి నిలబెట్టడం! అయినా గోడలు కూలితేనే, పుస్తకాలు కాలితేనే గ్రంథాలయం నాశనం కావడమా? వాటిపట్ల నిర్లక్ష్యం వహించడం మాత్రం నెమ్మదిగా నాశనం చేయడం కాదా?

తీక్షణ భావాల మృదుభాషి

కామెంట్



కరణ్ థాపర్

''ప్రతిపక్షం అన్నది ప్రజల అసంతృప్తిని ప్రతిఫలించే దృష్టికేంద్రం. ప్రతిపక్షమే లేకుంటే ప్రజాస్వామ్యమే ఉండదు'' అని దృఢంగా నమ్మేవారు ఫాలీ శామ్ నారిమన్. ''ప్రస్తుత పరిస్థితులతో ఎప్పటికీ మనం ఒక కొత్త రాజ్యాంగాన్ని రూపొందించుకోలేం'' అని అనేవారు. ''దారికి ఒప్పించటం, కోరినది ఇవ్వటం, ఓరిమి వహించటం'' అనే ఔదార్యాలు లేకుండా అద్భుతమైన, వినూత్నమైన ఆలోచనలు మాత్రమే మనకొక ఆదర్శవంతమైన రాజ్యాంగాన్ని ఏనాటికీ అందించలేవు. పరిస్థితులను బట్టి చూస్తే భారతదేశంలో ప్రస్తుతం ఇవి మూడూ క్షీణించి ఉన్నాయి'' అన్నది ఆయన అభిప్రాయం. ''భారత పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల పరిరక్షణకు మన న్యాయమూర్తులు మరింత సుముఖంగా ఉండాలి'' అనేవారు.

ఆఫీసులో నా డెస్కుకు ఎదురుగా ఉన్న గోడకు ఫాలీ నారిమన్ ఫొటో వేలాడదీసి ఉంటుంది. అది ఆయన స్వాభావిక మృదుహాసాన్ని, మిలమిల మెరిసే కళ్లను పట్టివ్వదు కానీ, ఆయనలోని దృఢచిత్తాన్ని, ఒడుదొడుకులను తట్టుకోగలిగిన స్థితిస్థాపక గుణాన్ని మాత్రం ప్రతిఫలిస్తూ ఉంటుంది. కెమెరాలోకి గుచ్చి చూస్తూ, తన కుడి చేతితో కుర్చీ అన్నును దృఢంగా పట్టుకుని ఉన్న ఆయన తీరును గమనిస్తే... ఆయన – తనేమిటో తనకు తెలిసిన మనిషి అనీ, తనను తాను స్వీయ స్పృహ లేకుండా వ్యక్తపరచుకోగలరనీ మీరు పసిగట్టగలరు.

ఆ గోడపైన ఉన్నది – ఆయన చివరి పుస్తకం 'యు మస్ట్ నో యువర్ కాన్‌స్టిట్యూషన్' ఆవిష్కరణ సందర్భంగా ఆయనతో నా చివరి ఇంటర్వ్యూకు ముందరి ఇంటర్వ్యూలో తీసిన ఫొటో. ఆ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడిన చాలా విషయాలు మన దేశానికి ఒక సందేశం అనే నేను నమ్ముతున్నాను.

ప్రసిద్ధ బ్రిటిష్ న్యాయ–విద్యావేత్త ఐవర్ జెన్నింగ్స్‌ను అంగీకారంగా ఉటంకిస్తూ, నారిమన్ ఇలా అన్నారు: ''పార్లమెంటులో అత్యంత ముఖ్యమైన వ్యవస్థ ప్రతిపక్షమే అని అనడంలో అవాస్తవమేమీ లేదు. ప్రతిపక్షం అన్నది ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం. ప్రజల అసంతృప్తిని ప్రతిఫలించే దృష్టికేంద్రం. ప్రభుత్వం ఎంత ముఖ్యమైనదో, ప్రతిపక్షం పనితీరు కూడా దాదాపుగా అంతే ముఖ్యమైనది. ప్రతిపక్షమే లేకుంటే ప్రజాస్వామ్యమే ఉండదు.''

అలా అని ప్రభుత్వాన్ని మనం ఎలా ఒప్పించగలమని ఇంటర్వ్యూ మధ్యలో నేను అడిగినప్పుడు, ఆయన నవ్వి ఊరుకున్నారు. అది నేను చేయగలిగిందైతే కాదు అన్నారు. ఏమైతేనేం, ఆయనే ఆ తర్వాత ''నాకొచ్చిన సందేహాన్నే మీరు వ్యక్తం చేయటం నాకెంతగానో సంతోషంగా ఉంది'' అన్నారు.

నారిమన్ మాట్లాడే ధోరణి సూటిగా, సందర్భశుద్ధితో ఉంటుంది తప్ప... ఎప్పుడూ కూడా బాధించేలా, అభ్యంతరకరంగా ఉండదు. కొన్నిసార్లు ఆయనే మిమ్మల్ని మెల్లగా నడిపిస్తున్నారని కూడా మీరు తెలుసుకోలేరు. ఉదాహరణకు, బహుశా మేము తొలిసారి కలుసుకోవటం రచయిత ఖుష్వంత్ సింగ్ ఇంట్లోననుకుంటా... ఆయన నా భుజం చుట్టూ చేయి వేసి – మిగతావాళ్లంతా డైనింగ్ టేబుల్ దగ్గర్నుంచి డ్రాయింగ్ రూమ్‌కు కదులుతూ ఉండగా – నన్ను ఒక మూలకు తోడ్కొని వెళ్లారు. ''గుర్తుంచుకో! ఖుష్వంత్ ఎప్పుడూ కూడా చివరి మాట తనదే కావాలని కోరుకుంటాడు. అలా ఉండేందుకు మీరు ఆయన్ని అనుమతిస్తే ఎప్పటికీ మీ స్నేహితుడిగా ఉంటాడు'' అన్నారు. బాగా గుర్తు... ఖుష్వంత్‌ని నేను ప్రశ్న మీద ప్రశ్న అడుగుతూనే ఉన్నాను. సన్నటి గీతను దాటేస్తున్నానేమోనని నారిమన్ నన్ను నెమ్మదిగా హెచ్చరిస్తూనే ఉన్నారు.



సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దివంగత ఫాలీ ఎస్. నారిమన్
(10 జనవరి 1929 - 21 ఫిబ్రవరి 2024)

ప్రభుత్వం అతి సమీపంగా ప్రస్తావనకు వచ్చిన అనేక అంశాలపై ఇంటర్వ్యూలో నారిమన్ ఇదే విధమైన సున్నిత శైలిని అవలంబించారు. ''ప్రస్తుత పరిస్థితుల్లో ఎప్పటికీ మనం ఒక కొత్త రాజ్యాంగాన్ని రూపొందించుకోలేం'' అని ఆయన అన్నారు. ''దారికి రప్పించటం, కోరినది ఇవ్వటం, ఓరిమి వహించటం'' అనే ఔదార్యాలు లేకుండా అద్భుతమైన, వినూత్నమైన ఆలోచనలు మాత్రమే మనకొక ఆదర్శవంతమైన రాజ్యాంగాన్ని ఏనాటికీ అందించలేవు. ''పరిస్థితులను బట్టి చూస్తే భారతదేశంలో ప్రస్తుతం ఇవి మూడూ క్షీణించి ఉన్నాయి'' అన్నారాయన.

ఇటీవలి ఆయన మరణం తర్వాత నేను మళ్లీ ఆనాటి ఇంటర్వ్యూను విన్నాను. నారిమన్ ఎంత బుద్ధిశాలిగా మాట్లాడారో వెంటనే గమనించాను. ''రాజ్యాంగంలో ప్రవేశిక చాలా ముఖ్యమైన భాగం'' అన్నారు. ప్రవేశికను ఆయన రాజ్యాంగం యొక్క మనస్సాక్షి అన్నారు. ప్రవేశికలోని 'సౌభ్రాతృత్వం' అనే భావన గురించే ఆనాడు ఆయన నొక్కి మాట్లాడారా? ప్రవేశికలో మాత్రమే ఉన్న మాట అది.

ఆ తర్వాత 'సహనశీలత' వైపుగా మా సంభాషణను నడిపించింది నేను కాదు, ఆయనే! ప్రస్తుతం సమస్యేమిటంటే మనకు ''సహనం లేదు'' అన్నారాయన. మళ్లీ ఆ తర్వాత కూడా ఈ మాట అనడం కోసం ఆయన తన పుస్తకం హద్దులను సైతం దాటేశారు.

అప్పుడు నేను పట్టుకోలేకపోయాను కానీ, ఇప్పుడు ఆయన మరణం తర్వాత ఆలోచిస్తే ఆయన ఎంత జాగ్రత్తగా ఆ సందేశాలు ఇచ్చారో కదా అని ఆశ్చర్యం కలుగుతోంది. మరికొన్ని కూడా ఉన్నాయి. భారత పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కుల్ని నిలబెట్టేందుకు మన న్యాయమూర్తులు మరింత సుముఖంగా ఉండాలి అన్నారు. అలా ఉండేందుకు వారు ఇష్టపడకపోవటం ఆయన్నెంతో నిరాశకు గురిచేసింది. అయితే వారిని తీవ్రంగా విమర్శించేందుకు సంకోచించి, 'క్యురేట్స్ ఎగ్'తో పోల్చి సరిపెట్టుకున్నారు... మంచీ ఉందీ, చెడూ ఉందీ... అయితే మంచిని చెడు తినేస్తోంది అనే అర్థంలో!

నారిమన్‌తో నేను పలు ఇంటర్వ్యూలు చేశాను. తొలినాళ్లలో ఆయన స్పోర్టింగ్ బ్రేసెస్‌ని ధరించి ఉండేవారు. నాకు బౌ టై ఉండేది. మా మధ్య సంభాషణ గొప్ప శక్తితో, ఆసక్తితో సాగేది. మధ్యలో స్నేహపూర్వకమైన అంతరాయాలను కలిగించుకునేవాళ్లం. ఉల్లాసం, ఉత్సాహం తరచూ మా ఇంటర్వ్యూలను నడిపించేవి. అవును, మా సంభాషణ గురించి ఇలాగే చెప్పాలి.

ఆయన భార్య బాప్సి ఓ వైపున కూర్చొని ఉండి మా సంభాషణను ఆలకిస్తూ ఉండేవారు. దాదాపు ప్రతిసారీ ఆమె నన్ను భోజనానికి ఉండమనేవారు. ఆమె అలా అనడమే ఆలస్యం నేను భోజనానికి తయార్! ఆయన నాతో పాటుగా కారు వరకు బయటికి నడిచి వచ్చేవారు. నేను వారికి వీడ్కోలు చెబుతున్నప్పుడు... ''ఆమెకు నువ్వంటే అభిమానం'' అని నవ్వుతూ అనేవారు.

ఆ గుణం కూడా ఆయన గురించిన సముచితమైన విశేషణమే. ఆయన పట్ల నాకు గొప్ప గౌరవభావం. ఆయన మేధ నన్ను ముగ్ధుడిని చేసేది. మనసులో ఏదీ దాచుకోలేని ఆయన స్వభావం, ఒక సరైన పని చేయటంలో ఆయనకు ఉండే నిస్సంశయ నిబద్ధత నన్ను ఆశ్చర్యచకితుడిని చేసేవి. నేను కూడా ఆయనపై అభిమానం పెంచుకున్నాను. పెద్దగా పరిచయం లేకుండానే ఏర్పడే ఆప్యాయత వంటిది ఆ అభిమానం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

డబ్బా మజాకా!



రిహానా (యూఎస్ గాయని) కోటాను కోట్ల విలువైన మనిషి. అట్లాంటి ఆమెను అంబానీలు పెళ్లిళ్లలో పాడే గాయనిని చేసేశారు. డబ్బు తలుచుకుంటే ఏదైనా చేయగలదు!

– ప్రశాంత్ రంగస్వామి, తమిళ నటుడు

కట్టేద్దాం గోడ!



దక్షిణ సరిహద్దును కాపాడుకోవడం అనేది సాంకేతిక సవాల్ కాదు. అది 'విల్' (సంకల్పం)కు సంబంధించినది. మనసుంటే మార్గం ఉంటుంది. విల్ ఉంటే వాల్ (గోడ) వస్తుంది.

– వివేక్ రామస్వామి, యూఎస్ నాయకుడు

గమనార్హం



పడికట్టు మాట: తన రీజియన్‌ను సరిగ్గా ఉంచుకోలేనంతవరకూ ఇండియా గ్లోబల్ పవర్ కాలేదు. వాస్తవం: ఇండియా ఇప్పటికే గ్లోబల్ పవర్. దాన్ని తన రీజియన్ పునారచన కోసం ఉపయోగిస్తోంది. దక్షిణాసియా, హిందూ మహాసముద్ర ప్రాంతాలలో (జపాన్, యూఎస్, యూరోపియన్ యూనియన్, ఫ్రాన్స్) ఇండియాకు ఉన్న ఆర్థిక, భద్రత భాగస్వామ్యాల వల్ల ఇండియా ఇరుగుపొరుగు విధానానికి మేలు జరుగుతోంది.

– కాన్‌స్టంటినో జేవియర్, ఫెలో

గొప్ప సంగతి



ఇండియా నుంచి అత్యంత పేదరికం అనేది తొలగిపోయింది. 'ద వరల్డ్ పావర్టీ క్లాక్' ఇండియాలోని అత్యంత పేదరికాన్ని 3 శాతం కంటే తక్కువగా చూపుతోంది. ఇది మన జీవిత కాలాల్లో సంభవించిన అత్యంత గణనీయమైన ప్రపంచ పరిణామాల్లో ఒకటి.

– శమికా రవి, ఆర్థికవేత్త

నిత్య హడావిడి



భారత స్టాక్ మార్కెట్లు, భారత రాజకీయాలు, భారత స్టార్టప్ ఎకో సిస్టమ్‌లలో నీరసమైన క్షణాలు అనేవే ఉండవు. మూడింట్లోనూ ఏదీ సరితూగనంత వేగం, రొద ఉంటూనే ఉంటాయి.

– రాజేశ్ సహానీ, వ్యాఖ్యాత

ఆగని సందడి



రానున్న రెండు వారాల్లో యూరప్, ఇండో–పసిఫిక్ రీజియన్ నుంచి ఉన్నతాధికారుల హైప్రొఫైల్ పర్యటనలకు ఇండియా ఆతిథ్యం ఇవ్వనుంది. దేశం ఎన్నికల దిశగా కదులుతున్నప్పటికీ, దౌత్యవేత్తల సందడి కొనసాగుతూనే ఉంది.

– సిద్ధాంత్ సిబాల్, జర్నలిస్ట్

నిజంగా బాగుందా?



బీజేపీ నుంచి టికెట్స్ రాని ప్రతి ఒక్కరూ, ఎంపీ బాధ్యతల నుంచి తమను విడుదల చేయమని (బీజేపీ జాతీయాధ్యక్షుడు) నడ్డాజీని కోరుతారు. అలాగే ప్రోటోకాల్ ప్రకారం ప్రధాని, హోంమంత్రికి ధన్యవాదాలు చెబుతారు. ఇదంతా కూడా అదేదో అమీర్ ఖాన్ సినిమాలో లాగా 'ఆల్ ఈజ్ వెల్' (అంతా బాగుంది) అని చాటేందుకు!

– నికుంజ్ షా, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

చిరస్మరణీయ మూర్తి

అనేక సాంస్కృతిక ప్రక్రియలలో ఆరితేరిన అసమాన్య ప్రతిభామూర్తి, క్రియాశీల చైతన్యంతో వందలాది మందిని సాహిత్య, నాటక రంగాలలో తీర్చిదిద్దిన సౌజన్యదీప్తి కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు. 1924 మార్చి 5న తూర్పుగోదావరి జిల్లా కొటిమేరులో మాతామహుల ఇంట జన్మించారు. చిన్న వయసులోనే ఆంగ్ల, తెలుగు నాటకాలలో నటనకు శ్రీకారం చుట్టారు. 1949 నుండి న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. సాహిత్య, నాటక రంగాలు ఆయనకు రెండు కళ్ళు. విశాఖ పట్టణాన్ని తమ కార్యక్షేత్రంగా జీవితాంతం పనిచేశారు. విలియమ్స్ మేక్పీస్ థేకర్ రచించిన 'జమిందార్ ఆఫ్ బొంకుల దిబ్బ', విలియమ్స్ షేక్స్‌పియర్ రచనలు 'హెన్రీ ఫిఫ్త్', 'యాజ్ యు లైక్ ఇట్' వంటి నాటకాలలో నటించారు. 'చాణక్య', 'తిమ్మరుసు', 'ఖిజీర్', 'షాజహాన్', 'అజాత శత్రువు' వంటి పాత్రల్లో నటించారు.



గణపతిరాజు
అచ్యుత రామరాజు

ఇక రచయితగా, కవిగా, 'ఖడ్గతిక్కన', 'మాలిని', 'బ్రహ్మముడి', 'వినాయకుడి పెళ్ళి', 'తీర్పు', 'ఆనందహేల', 'ఇంకానా ఇకపై సాగవు' (నాటిక), 'మున్నీ' (కథా సంకలనం), 'అమరం' (కవితా సంపుటి) ఇలా పలు అమూల్యమైన కవితా, వచన, నాటక రచనలు చేశారు. 'విశాఖ నాటక కళా మండలి', 'విశాఖ రచయితల సంఘం', 'విశాఖ నాటక కళాపరిషత్', 'విశాఖ సాహితి' వంటి, సాహిత్య, నాటక సంస్థల స్థాపకునిగా, అధ్యక్ష, గౌరవాధ్యక్షునిగా బాధ్యతలు వహించి ఎందరికో స్ఫూర్తినిచ్చారు.

వేదికలు, భావజాలాలు వేరయినా వివాద రహితునిగా, స్నేహపాత్రునిగా వందలాది మంది హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. తన రాజకీయ (భారతీయ జన సంఘ్ పార్టీ నేత) భావజాలం ప్రభావం ఇతరులైన సన్నిహితులపై పడకుండా, కేవలం సాంస్కృతిక సాన్నిహిత్యమే పరమావధిగా భావించి జీవించిన ధన్యజీవి. 1968–1974 మధ్య జనసంఘ్ పార్టీ పక్షాన శాసన మండలి సభ్యునిగా వ్యవహరించారు. ఆ పదవి తన సామాజిక బాధ్యతలో చిన్న భాగం మాత్రమే. తెలుగునాట రాజకీయ, సాహిత్య మేరు శిఖరాలైన పి.వి. నరసింహారావు, డా॥ బెజవాడ గోపాల రెడ్డి, దామోదరం సంజీవయ్య, డా॥ సి. నారాయణ రెడ్డి వంటి ఎందరికో ఆయన సన్నిహితులు. 2004 జూన్ 10వ తేదీన అమరులైన డా॥ గణపతి రాజు అచ్యుతరామరాజు స్ఫూర్తి కలకాలం తెలుగువారిపై ప్రసరిస్తూనే ఉంటుంది.

– బి.వి. అప్పారావు

(మార్చి 5న గణపతి అచ్యుత రామరాజు శతజయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గాలివాటంతో పోయిన విశ్వసనీయత

అభిప్రాయం




డా॥ జి. నవీన్

ఒకవైపు వైసీపీ అధినేత జగన్ రాష్ట్రం నలుమూలలా 'సిద్ధం' సభలు పెట్టి ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కిస్తుంటే... ఎట్టకేలకు ప్రతిపక్ష పార్టీలు జనసేన – తెలుగు దేశం కూటమిగా ఏర్పడి తాడేపల్లిగూడెంలో మొదటి సభ పెట్టాయి. అక్కడ పవన్ కల్యాణ్ చేసిన ప్రసంగం చర్చనీయాంశం. పవన్ సొంత పార్టీ పెట్టి ఇప్పటికి పదేళ్లు అయ్యింది. ఈ దశాబ్ద కాలంలో 2014లో హిందుత్వ బీజేపీనీ, అవకాశవాద చంద్రబాబు టీడీపీనీ బలపరిచారాయన. 2019కి వచ్చేటప్పటికి బీజేపీకి పూర్తి వ్యతిరేక వైఖరి అవలంబించే కమ్యూనిస్టు పార్టీలతో, బీఎస్పీతో జత కట్టారు. ఆ ఎన్నికలు అయిన వెనువెంటనే తిరిగి బీజేపీ పంచన చేరారు. ఇప్పుడు టీడీపీతో కలిసి బరిలోకి దిగారు. ఈ పదేళ్ల వ్యవహార శైలి అతడి రాజకీయ ఊసరవెల్లితనాన్ని చాటి చెబుతోంది. ఈ విషయంలో తాను చంద్రబాబుకి ఏ మాత్రం తీసిపోనని కించిత్ గర్వపడొచ్చు కూడా! దేశం కాని దేశ ప్రజల కోసం ఆత్మ త్యాగం చేసిన చేగువేరా వంటి అద్వితీయమైన నాయకుడిని స్మరించిన నోటితోనే వెన్నుపోటు పొడిచే కళలో ఆరితేరిన చంద్రబాబు నామజపం చేయడం సిగ్గు చేటు.

'జెండా' సభలో ఆయన మాటల్లో అక్కసు కనిపించింది తప్ప ఎన్నికల్లో వారి అజెండా ప్రస్తావనే లేదు. 2019లో జనం తనని రెండు చోట్ల ఓడించారు అనే కోపం ప్రదర్శించారు కానీ ఎందుకు ఆ పరిస్థితి దాపురించిందో సింహావలోకనం చేసుకునే సంయమనం చూపలేదాయన. సినిమా పాటల్లో గెటప్‌లు మార్చినంత తొందరగా రాజకీయాలలో రంగులు మారిస్తే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతాము అనే తర్కాన్నీ మరచారు. తనకు తానే దేశం కోసం, రాష్ట్రం కోసం పరితపిస్తున్నాను అని చెబితే నమ్మేసి మళ్లీ మళ్లీ మోసపోవడానికి ఇవి ఆడియో రిలీజ్ సభలు కాదు అనే విషయం పాపం 'పవర్' స్టార్ విస్మరించారు. అంతగా ఆలోచించి ఈయన దేశం కోసం చేసిన మంచి ఏమిటో మచ్చుకు ఒక్కటైనా చెప్పలేకపోయారు. 2014లో తాను గెలిపించిన చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు ఒక్కటైనా ఉందా? పోనీ ఈసారి గెలిస్తే ఇదీ మా ప్రణాళిక అని చెప్పే సాహసం కూడా చేయలేకపోయారు. 'నేను ఒక నియోజకవర్గం కూడా పెంపొందించుకోలేదు' అని అనడం ఎన్నికలు మొదలు కాక మునుపే ఓటమికి సాకులు వెతుక్కుంటున్నట్టు ఉంది.

ఒక దశలో తనను తాను వామనుడిగా, జగన్‌ను బలి చక్రవర్తిగా పోల్చారు. దక్షిణాది ప్రజల చరిత్ర ఈయనకి ఏ మాత్రం అవగతమైనట్లు లేదు. ఎన్నో పుస్తకాలు నెమరు వేశాను అని డాంబికాలు పలికే పవన్ కల్యాణ్ బలి చక్రవర్తి ఔన్నత్యాన్నీ, వామనుడి కుటిలత్వాన్నీ గమనించినట్లు లేరు. కేరళలో కానీ, ఇతర దక్షిణాది రాష్ట్రాలలో కానీ బలి చక్రవర్తిని ఒక ఉదార రాజుగా కొలుస్తారు. బహుజనుల నాయకుడైన బలిని అవహేళన చేస్తూ ఒక రాజకీయ సభలో ప్రసంగించడం ఆయన అపరిపక్వతకు మచ్చుతునక.



పలుమార్లు కోట్ల సంపాదన వదిలి ప్రజల కోసం తిట్లు తింటున్నాను అని ఈయన చెప్తారు. ఇది చాలా చవకబారు వాదన. తనకు తానే ఒక కారణ జన్ముడిగా, త్యాగశీలిగా చెప్పుకోవడం నిజానికి ప్రజల వివేకాన్ని అవమానించడమే. ఒక రాజకీయ నాయకుడు ప్రజలను మమేకం చేసుకుంటూ తన అజెండాని వారికి తెలియచెప్పాలి. కానీ 'అంతా నాకు వదిలేయండి. నాకు అన్నీ తెలుసు'ని ఏమార్చకూడదు. ఆది గమనించే 2019లో ప్రజలు ఈయన్ని తేలికగా తీసుకున్నారు.

రాష్ట్రంలో అన్ని స్థానాల్లో పోటీ చేసే స్థోమత లేదు అని చెప్పడం మరో హాస్యాస్పదమైన అంశం. చరిత్రలో ఎన్నో కొత్త పార్టీలు అటువంటి ధైర్యాన్నే చేసి ప్రజల మద్దతు కూడకట్టుకోగలిగాయి. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ కానీ, జగన్ సారథ్యంలో వచ్చిన వైసీపీ కానీ, ఈయన అన్నయ్య చిరంజీవి పెట్టిన 'ప్రజారాజ్యం' కానీ సొంతంగా రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేసి తాడో పేడో తేల్చుకున్న కొత్త పార్టీలే. ఇతర రాష్ట్రాలలో కూడా ఆమ్ ఆద్మీ పార్టీ లాంటి శక్తులు కొత్తగా బరిలోకి దిగి విజయం సాధించిన సందర్భాలు కోకొల్లలు. అంతటి మేధ లేక చీటికి మాటికి తనను గుడ్డిగా నమ్ముకున్న నాయకులనూ, కార్యకర్తలనూ 'పోల్ మేనేజ్‌మెంట్' రాదు అంటూ కించపరుస్తూ మాట్లాడడం ఒక పద్ధతిగా పెట్టుకున్నారు పవన్. ఒకసారి పార్టీ ఎదుగుదలకి 10 ఏళ్ళు కావాలి అన్నారు. పదేళ్లు గడిచాక ఇప్పుడు... కాదు కాదు 20–30 ఏళ్ళు అంటున్నారు. ఎంత కాలం ఇలా వెళ్ళబుచ్చుతారో చూడాలి!

24 సీట్లకి జనసేనను కుదించి చంద్రబాబు నాయుడు పవన్ కల్యాణ్‌ను భూస్థాపితం చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు అనిపిస్తుంది. కూటమి గెలిస్తే ఎందుకూ కొరగాని జూనియర్ పార్టీ అవుతుంది జనసేన. ఓడితే కూటమి వల్లే ఈ పరిస్థితి అని చెప్పడానికి సరిపోతుంది. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన సందర్భంలో కమ్యూనిస్టు పార్టీల మద్దతు ఇలాగే తీసుకున్న చంద్రబాబు వాళ్ళ విశ్వసనీయతపై ఇలాంటి దెబ్బే కొట్టారు. 1994లో సీపీఐ, సీపీఎంలు కలిపి 34 సీట్లు గెలిచి బలమైన స్థానంలో ఉండేవారు. ఎన్టీఆర్‌ను కాదని చంద్రబాబుతో చేతులు కలిపిన కమ్యూనిస్టు పార్టీలు ఆంధ్ర ప్రదేశ్‌లో పట్టు పోయి మళ్ళీ కోలుకోలేదు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు కలిపినా ఒకటో ఆరో సీటుకి పరిమితమయ్యి కాలగర్భంలో కలిసిపోయాయి. ఈసారి బాబు దెబ్బతో పవన్ కల్యాణ్ కూడా కరి మింగిన వెలగపండు అవుతారేమో!

వ్యాసకర్త సామాజిక, రాజకీయ అంశాల విశ్లేషకుడు

జగన్మాత కరుణ

సీతాదేవిని మహాలక్ష్మి అవతారం అంటారు. ఆ మహాలక్ష్మి కరుణకు మారుపేరు. ఆమె మహాలక్ష్మి అయితే రాముడు నారాయణుడు. సీతారాముల గురించి మాట్లాడుతున్నప్పుడు మహాత్ములు, ఆళ్వార్లు రాముడి కృప కన్నా సీతాదేవి కృపనే గొప్పగా చెప్పారు.

ఒకానొక కాకి అపరాధం చేసింది. రాముడు వెంటనే బాణాన్ని వదిలాడు. అది ఆ కాకిని తరిమింది. ఆ కాకి చివరికి రాముడి వద్దకు వచ్చి తనను క్షమించమని ప్రాధేయపడింది. అప్పుడు పక్కనే ఉన్న సీతాదేవి జాలిపడి దాన్ని విడిచి పెట్టమని కోరింది. దాంతో రాముడు సరేనన్నాడు. శూర్పణఖ రగడ చేసింది. అయితే సీత పక్కన ఉండడంతో రాముడు శూర్పణఖ ప్రాణం తీయకుండా హెచ్చరికలతో విడిచి పెట్టాడు. ఇలా సీతాదేవి పక్కన ఉన్నప్పుడు రాముడు ఎవరినీ వధించలేదు. సీత పక్కన లేనప్పుడే రాముడు పలువురిని వధించాడంటారు.

జ్యోతిర్మయం

రావణాసురుడిని వధించిన తర్వాత ఆంజనేయుడు అశోకవనంలో సీతతో 'మిమ్మల్ని ఇంతకాలమూ ఇబ్బంది పెట్టిన ఈ అసురుల నాశనానికి ఆదేశించండి' అని కోరాడు. అందుకు సీతాదేవి రావణాసురుడి ఆదేశాల మేరకే వారలా ప్రవర్తించారు. వారికి ఏ విధంగానూ హాని తలపెట్టకూడదు' అని చెప్పింది. జగన్మాతకు తప్పించి ఇంతటి కరుణ మరెవరికి ఉంటుంది. అందుకే, ఆమెను జగన్మాతగా భావించాలంటారు. అమ్మవారికి భూమాత అనేగా మరొక పేరు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.నవమి రా.2.55 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: జ్యేష్ఠ ఉ.11.34 వరకు, తదుపరి మూల, వర్జ్యం: రా.7.32 నుండి 9.02 వరకు, దుర్ముహూర్తం: ప.12.36 నుండి 1.24 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, అమృతఘడియలు: తె.5.03 నుండి 7.43 వరకు (తెల్లవారితే మంగళవారం), అమృతఘడియలు: సా.6.54 నుండి 8.40 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.21, సూర్యాస్తమయం: 6.03.

सत्यमेव जयते
భారత ప్రభుత్వం



అభివృద్ధి చెందిన భారతదేశం అభివృద్ధి చెందిన తెలంగాణ దిశగా కీలక అడుగులు

రూ. 56 వేల కోట్లకు పైగా

విద్యుత్ మరియు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల బహుమానం

గౌరవనీయ ప్రధానమంత్రి

శ్రీ నరేంద్ర మోదీ

ద్వారా

సోమవారం, 4 మార్చ్, 2024 ఉదయం 10.45 గంటలకు తెలంగాణ, ఆదిలాబాద్ లో

జాతికి అంకితం

- ఎన్‌టిపిసి తెలంగాణ STPP యొక్క యూనిట్ -02 (800 MW), దశ-1, పెద్దపల్లి, తెలంగాణ
- 660 మెగావాట్ల ఎన్‌టిపిసి నార్త్ కరణ్ పురా ఎన్‌టిపిసి చతరా, జార్ఖండ్ లోని యూనిట్ -02
- ఫ్లై యాష్ ఆధారిత లైట్ వెయిట్ అగ్రిగేట్ ప్లాంట్, ఎన్‌టిపిసి సిపట్, ఛత్తీస్ గఢ్
- సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నీటితో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, ఎన్‌టిపిసి నేత్ర, ఉత్తర ప్రదేశ్
- అంబారి-ఆదిలాబాద్ మధ్య పింపల్ కుట్టి రైల్వే లైన్ విద్యుదీకరణ

శంకుస్థాపన

- ఎన్‌టిపిసి సింగ్రౌలి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్, స్టేజ్ -III, (2x800 మెగావాట్లు)
- ఫ్లూ గ్యాస్ CO_2 తో 4G ఇథనాల్ ప్లాంట్, ఎన్‌టిపిసి లారా
- ఫ్లై యాష్ ఆధారిత FALG (ఫ్లై యాష్ - లైమ్ - జిప్సం) అగ్రిగేట్ ప్లాంట్, ఎన్‌టిపిసి కోర్బా
- సముద్ర జలంతో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటుకు, ఎన్‌టిపిసి సింహాద్రి
- 600 మెగావాట్ల లలిత్ పూర్ సోలార్ పవర్ ప్రాజెక్ట్, టుస్కో
- కర్నూల్ పవన విద్యుత్ జోన్ / సోలార్ ఎనర్జీ జోన్ (ఆంధ్రప్రదేశ్) కోసం ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-పవర్ గ్రిడ్
- 15 మెగావాట్ల నంగల్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్
- 382 మెగావాట్ల సున్నీ డ్యాం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్, ఎస్‌జేవీఎన్
- 70 మెగావాట్ల అస్సాం సోలార్ పవర్ ప్రాజెక్ట్, ఎస్‌జేవీఎన్
- NH-353B, ఎంఓఆర్‌టిహెచ్, ఆదిలాబాద్ – బేలా సెక్షన్, కిమీ. 0/000 నుంచి కిమీ. 31/000కు 2-లేన్/4లేన్ కు విస్తరణ.
- NH-163, ములుగు ట్రైబల్ డిస్ట్రిక్ట్ లో, ఎంఓఆర్‌టిహెచ్ (జగన్నాథపురం నుంచి చెరుకూరు సెక్షన్) కిమీ 278/150 నుంచి 280/500 కు 2 లేన్ గా విస్తరణ.
- జలౌన్ జిల్లా మెగా రెన్యూవబుల్ ఎనర్జీ పవర్ పార్క్ (1200 మెగావాట్లు), బిఎస్‌యుఎల్

ప్రారంభోత్సవం

- 765/400/220 KV GIS సబ్-స్టేషన్, రాంపూర్ మరియు 400/220/132 KV GIS, సబ్‌స్టేషన్, అసోసియేటెడ్ ట్రాన్స్‌మిషన్ లైన్‌లతో సంభాల్ నిర్మాణం కోసం ట్రాన్స్‌మిషన్ సిస్టమ్, పవర్ గ్రిడ్
- మీరట్ – సింభావలి ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్, పవర్ గ్రిడ్
- 50 మెగావాట్ల గుజ్రాయ్ సోలార్ పవర్ స్టేషన్, ఎస్‌జేవీఎన్
- 75 మెగావాట్ల గుర్హా సోలార్ పవర్ స్టేషన్, ఎస్‌జేవీఎన్
- 75 మెగావాట్ల పరాసన్ సోలార్ పవర్ స్టేషన్, ఎస్‌జేవీఎన్
- చండీగఢ్ జిఐఎస్ నుండి 400/220 కెవి పంచకుల పవర్ గ్రిడ్ సబ్ స్టేషన్, పవర్ గ్రిడ్ వరకు 220 కెవి డి/సి లైన్‌తో పాటు కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ వద్ద 220/66 కెవి జిఐఎస్ ఏర్పాటు.
- ఉత్తర ప్రాంతంలో వ్యవస్థను బలోపేతం చెయ్యడం (ఎన్ఆర్ఎస్ఎస్) - XXXV, పవర్ గ్రిడ్
- కోడెర్మా థర్మల్ పవర్ స్టేషన్ (2x500 మెగావాట్లు), DVC యొక్క రెట్రోఫిట్టింగ్ పొల్యూషన్ కంట్రోల్ సిస్టమ్-FGD యూనిట్-I (500 మెగావాట్లు)
- కొప్పల్ విండ్ ఎనర్జీ జోన్ (కర్నాటక) (2500 మెగావాట్లు) (SPV - కొప్పల్-నరేంద్ర ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్) లోని రెన్యూ నుండి విద్యుత్ తరలింపు
- కల్లం ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్, ఇండిగ్రిడ్
- ఉత్తర ప్రాంతంలో వ్యవస్థను బలోపేతం చెయ్యడం (ఎన్ఆర్ఎస్ఎస్) - XL, పవర్ గ్రిడ్
- 300 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్ట్, జైసల్మేర్, రాజస్థాన్, ఎన్‌హెచ్‌పిసి.
- ఉత్తర ప్రాంతంలో వ్యవస్థను బలోపేతం చేసే (ఎన్ఆర్ఎస్ఎస్- XXXVII) పథకం, పవర్ గ్రిడ్
- 60 మెగావాట్ల నైత్వార్ మోరి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్, ఎస్‌జేవీఎన్
- ఈశాన్య ప్రాంతాన్ని బలోపేతం చేసే పథకం - XII (ఎన్ఈఆర్ఎస్ఎస్-XII), పవర్ గ్రిడ్

ప్రాజెక్టుల ప్రయోజనాలు

- అత్యధిక సామర్ధ్యం కలిగిన ఎన్‌టిపిసి థర్మల్ ప్లాంట్ ద్వారా తెలంగాణాకు 85% విద్యుత్ అందించడం
- గ్రిడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేయడం ద్వారా 24x7 విశ్వసనీయమైన విద్యుత్ సరఫరాను నిర్ధారించడం
- తెలంగాణా మరియు ఇతర రాష్ట్రాలలో ఉద్యోగ అవకాశాల రూపకల్పన
- దేశం యొక్క సామాజిక-ఆర్థిక అభివృద్ధి
- సుస్థిర విద్యుత్ ఉత్పాదన ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం
- తెలంగాణా ప్రాంతంలో రైలు, రోడ్డు అనుసంధానాన్ని మెరుగుపరచడం

గౌరవ ప్రముఖుల సమక్షంలో

డాక్టర్ తమిళిసై సౌందరరాజన్
గవర్నర్, తెలంగాణ

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి
ముఖ్యమంత్రి, తెలంగాణ

శ్రీ ఆర్. కే. సింగ్
కేంద్ర మంత్రి, విద్యుత్ మంత్రిత్వ శాఖ,
నూతన మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ

శ్రీ జి. కిషన్ రెడ్డి
కేంద్ర మంత్రి, సాంస్కృతిక,
పర్యాటక మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ

శ్రీ క్రిషన్ పాల్ గుర్జర్
కేంద్ర సహాయ మంత్రి
విద్యుత్ మరియు భారీ పరిశ్రమల శాఖ

దయచేసి కార్యక్రమం యొక్క ప్రత్యక్ష ప్రసారం వీక్షించండి DD NEWS లో



బీజేపీకి ప్రధాని మోదీ రూ.2,000 విరాళం

న్యూఢిల్లీ: బీజేపీ ఎన్నికల ప్రచారం కోసం ఆ పార్టీ అగ్రనేత, ప్రధాని మోదీ ఆదివారం రూ.2,000 విరాళం ఇచ్చారు. వికసిత్ భారత్ లక్ష్యంగా కృషి చేస్తున్న బీజేపీకి ఆర్థిక బాసటగా నిలిచేందుకు రూ.2,000 ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు తన విరాళానికి సంబంధించిన రశీదును 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. '' వికసిత భారత్ కోసం అవిశ్రాంతంగా కష్టపడుతున్న బీజేపీకి సాయపడుతున్నందుకు సంతోషిస్తున్నా. వికసిత్ భారత్ సుసాధ్యం కోసం మీరూ మీ వంతు విరాళంతో ముందుకురండి. నమోయాప్ ద్వారా సైతం ప్రతి ఒక్కరు విరాళాలు ఇవ్వొచ్చు'' అని మోదీ అన్నారు. దీనికి డొనేషన్ ఫర్ నేషన్ బిల్డింగ్ హ్యాష్‌ట్యాగ్‌ను జతచేశారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ)ను ఉల్లంఘిస్తూ ఇన్నాళ్లూ కొనసాగిన ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని సుప్రీంకోర్టు తాజా తీర్పుతో రద్దుచేయడంతో బీజేపీ ఇలా విరాళాల బాట పట్టింది. నమో యాప్ ద్వారానూ విరాళాలు సేకరిస్తోంది.

పాక్‌లో భారీ వర్షాలు.. 37 మంది మృతి


పెషావర్: పాకిస్తాన్‌లోని ఆక్రమిత కశ్మీర్‌తోపాటు బలోచిస్తాన్, ఖైబర్ ఫక్తున్వా ప్రావిన్స్‌ల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 48 గంటల వ్యవధిలో ఈ ప్రాంతాల్లో వర్షాలు, వరద సంబంధిత ఘటనల్లో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా ఖైబర్ ఫక్తున్వా ప్రావిన్స్‌లో ఇళ్లుకూలి, ఇళ్లలోకి వరద చేరిన ఘటనల్లో 27 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది చిన్నారులేనని అధికారులు తెలిపారు. అదేవిధంగా, బలోచిస్తాన్, పీవోకేలో అయిదుగురు చొప్పున చనిపోయారు. గ్వాదర్ రేవు పట్టణం జల దిగ్బంధంలో చిక్కుకుంది. చైనా–పాకిస్తాన్‌లను కలిపే కారకోరం హైవే మూతబడింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు... జవాను, మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో ఆదివారం ఉదయం మావోలకు, పోలీసు బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో ఒక మావోయిస్టు, బస్తర్ ఫైటర్స్ విభాగానికి చెందిన ఒక జవాను మృతి చెందారు. జిల్లాలోని చోటీబెధియా పోలీస్ స్టేషన్ పరిధిలో గల హిదూర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారనే నిఘా వర్గాల సమాచారం మేరకు బస్తర్ ఫైటర్స్, జిల్లా రిజర్వ్ గార్డ్‌లు, బీఎస్‌ఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో హిదూర్ అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం పోలీసులకు మావోలు తారసపడ్డారు. వెంటనే భద్రతా బలగాలపైకి మావోలు కాల్పులతో విరుచుకుపడ్డారు. ఈ ఘటనలో బస్తర్ ఫైటర్స్ విభాగానికి చెందిన 28 ఏళ్ల జవాను రమేశ్ కురేతి ప్రాణాలు కోల్పోయారు. రమేశ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లా సంగం గ్రామానికి చెందిన వ్యక్తి. పోలీసులు తేరుకుని ఎదురుకాల్పులు జరపడంతో ఒక మావోయిస్టు మృతి చెందాడు.

హిమగిరులకు పెనుముప్పు!

2100 నాటికి హిమాలయాల్లో 75 శాతం మంచు మాయం | ఇండియా పర్యావరణ నివేదిక వెల్లడి



భారతదేశానికి పెట్టని కోటలాగా రక్షణ కవచంగా ఉన్న సుందర హిమాలయాలు కనుమరుగు కానున్నాయా? భూమిపై ఉష్ణోగ్రతల పెరుగుదలను అడ్డుకోకపోతే కచ్చితంగా ఇదే జరుగుతుందని ఇండియా పర్యావరణ నివేదిక–2024 తేల్చిచెప్పింది. 2100 నాటికి హిమాలయ పర్వతాల్లోని 75 శాతం మంచు కరిగిపోయే ప్రమాదం ఉందని స్పష్టంచేసింది. తద్వారా వరదలు, విపత్తులు సంభవిస్తాయని, పర్యావరణం, జీవజాలం, వృక్షజాతులకు ముప్పు సంభవిస్తుందని వెల్లడించింది. ఆసియాలో 200 కోట్ల మంది తీవ్రంగా ప్రభావితం అవుతారని పేర్కొంది. భూగోళంపై అత్యధికంగా మంచు నిల్వ ఉన్న మూడో అతిపెద్ద ప్రాంతం హిమాలయాలే. కాలుష్యం, ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల ఇక్కడి హిమానీనదాలు(గ్లేసియర్స్) వేగంగా కరిగిపోతున్నాయి. ఎగువ హిమాలయాల్లో ఇప్పటికే మంచు చాలావరకు మాయమైంది. 2013 నుంచి 2022 వరకు ఇండియాలో 44 శాతం ప్రకృతి విపత్తులకు హిమగిరుల్లో మంచు కరగడమే కారణమని ఇండియా పర్యావరణ నివేదిక–2024 వివరించింది. ఉత్తరాది రాష్ట్రాల్లో, ప్రధానంగా హిమాలయ రాష్ట్రాల్లో వరదలు, పెను తుఫాన్లు, కొండ చరియలు విరిగిపడడం వంటి విపత్తులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నట్లు ఈ నివేదిక గణాంకాలను బట్టి స్పష్టమవుతోంది. మనమంతా పర్యావరణ సంక్షోభం అంచున ఉన్నట్లు అర్థం చేసుకోవచ్చు. హిమాలయాల్లో మంచు కరిగిపోతుండడంతో విలువైన వృక్ష సంపద అంతరించిపోతున్నట్లు పలు పరిశోధనల్లో తేలింది. ప్రతి పదేళ్లకు 54 మీటర్ల మేర వృక్షాలు కనుమరుగు అవుతున్నట్లు వెల్లడయ్యింది. నిత్యం మంచుతో గడ్డకట్టుకొని ఉండే ప్రాంతాలు సైతం మాయమవుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమ భాగంలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. 2004 నుంచి 2020 వరకు 8,340 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మంచు కరిగింది. అదంతా మైదాన ప్రాంతంగా మారిపోయింది. హిమాలయాల్లో 40 శాతం మంచు ఇప్పటికే కరిగిపోయిందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే 2100 నాటికి 75 శాతం మంచు కనిపించకుండా పోతుందని ఇండియా పర్యావరణ నివేదిక హెచ్చరించింది. ఈ మహావిపత్తును నివారించాలంటే వెంటనే కార్యాచరణ ప్రారంభించాలని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెడ్ డెవలప్‌మెంట్(ఐసీఐఎంఓడీ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇజబెల్లా కొజీల్ సూచించారు. అత్యవసర, నిర్ణయాత్మక కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. హిమాలయ పర్యావరణ, జీవావరణ వ్యవస్థపై కోట్ల మంది జీవితాలు ఆధారపడి ఉన్నాయని గుర్తుచేశారు. మన ప్రభుత్వాలు చురుగ్గా వ్యవహరించాలని, హిమాలయాలను కాపాడుకోకపోతే మానవాళి మనుగడకు ప్రమాదం తప్పదని స్పష్టం చేశారు.

ప్రమాదంలో డూమ్స్ డే గ్లేసియర్



అంటార్కిటికా ఖండం పశ్చిమ భాగంలోని డూమ్స్ డే హిమానీనదం(థ్వాయిట్స్ గ్లేసియర్) మనుగడ ముప్పును ఎదుర్కొంటోంది. గత 80 ఏళ్లలో ఏకంగా 50 బిలియన్ టన్నుల మంచును కోల్పోయింది. ప్రస్తుతం 130 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ గ్లేసియర్ క్రమంగా కరిగిపోతోంది. కొత్తగా వచ్చిచేరే మంచు కంటే కరిగిపోతున్నదే ఎక్కువ. మరికొన్నేళ్లలో పూర్తిగా అంతమైనా ఆశ్చర్యం లేదని పరిశోధకులు చెబుతున్నారు. ఇటీవలే ఈ హిమానీనదంపై అధ్యయనం చేశారు. నమూనాలు సేకరించి విశ్లేషించారు. ఎల్–నినో ప్రభావం కారణంగా భూమి వేడెక్కుతుండడంతో డూమ్స్‌డే గ్లేసియర్ కరిగిపోతున్నట్లు గుర్తించారు. ఈ పరిణామం 80 సంత్సరాల క్రితం.. 1940వ దశకంలోనే మొదలైందని, 1970వ దశకంలో వేగం పుంజుకుందని తేల్చారు. అంటార్కిటికా ఖండంలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో హిమానీనదం కరిగిపోయే రేటు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నట్లు సైంటిస్టులు స్పష్టం చేశారు. పశ్చిమ అంటార్కిటికాలో మంచు ఫలకాల స్థిరత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఈ అధ్యయనం తోడ్పడుతుందని భావిస్తున్నారు. డూమ్స్ డే గ్లేసియర్ కీలకమైన ప్రదేశంలో ఉంది. ఇది పూర్తిగా కరిగిపోతే పశ్చిమ అంటార్కిటికా నుంచి సముద్రంలోకి మరింత నీరు చేరుతుంది. ఫలితంగా సముద్ర మట్టం 65 సెంటీమీటర్ల వరకు పెరిగే ప్రమాదం ఉంది. అదే జరిగితే లోతట్టు ప్రాంతాలు మునిగిపోతాయి. జల విధ్వంసం తప్పదు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కొత్త ప్రభుత్వం ఏర్పడుతూనే... 100 రోజుల అజెండా!

మంత్రివర్గ సహచరులతో మోదీ భేటీ
- 'వికసిత్ భారత్'పై మేధోమథనం
- దార్శనిక పత్రంపై సుదీర్ఘంగా చర్చ



న్యూఢిల్లీ: 'వికసిత్ భారత్: 2047' దార్శనిక పత్రంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మేధోమథనం నిర్వహించారు. ఆయన ఆదివారం తన సహచర మంత్రులతో సమావేశమయ్యారు. '2047 నాటికి వికసిత్ భారత్' అనే లక్ష్య సాధన కోసం రాబోయే ఐదేళ్లలో అనుసరించాల్సిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా 100 రోజుల అజెండాను మోదీ తెరపైకి తీసుకొచ్చినట్లు సమాచారం. రాబోయే మే నెలలో ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే 100 రోజుల్లో అమలు చేయాల్సిన అజెండాపై ఆయన చర్చించారు. దీనిపై కొందరు మంత్రులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. మంత్రివర్గ భేటీలో కొన్ని కీలక అంశాలపై ప్రజంటేషన్ కూడా ఇచ్చినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందాలని, ఘన విజయమే లక్ష్యంగా పని చేయాలని సహచర మంత్రులకు మోదీ సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమంతోపాటు దేశ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ 370కిపైగా స్థానాలు, ఎన్డీయే 400కుపైగా స్థానాలు గెలుచుకుంటాయని మరోసారి ధీమా వ్యక్తం చేశారు.

రోడ్‌మ్యాప్ సిద్ధం

ప్రధాని మోదీ లక్ష్యానికి అనుగుణంగా 'వికసిత్ భారత్' సాధన కోసం రోడ్‌మ్యాప్ సిద్ధం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. ఇందుకోసం గత రెండున్నరేళ్లలో వివిధ స్థాయిల్లో 2,700 సమావేశాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు నిర్వహించినట్లు తెలిపాయి. 20 లక్షల మంది యువతీ యువకుల నుంచి సలహాలు సూచనలు అందినట్లు పేర్కొన్నాయి. ఈ రోడ్‌మ్యాప్ ఆర్థిక వృద్ధి, అభివృద్ధి లక్ష్యాలు, సులభతర జీవనం, సులభతర వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, సామాజిక సంక్షేమం వంటి అంశాలతో కూడిన ఒక సమగ్ర బ్లూప్రింట్ అని అధికారులు స్పష్టం చేశారు.

10 రోజులు.. 29 కార్యక్రమాలు

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రధాని మోదీ రాష్ట్రాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. రాబోయే 10 రోజుల్లో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేయబోతున్నారు. ఆ సందర్భంగా మొత్తం 29 కార్యక్రమాల్లో పాల్గొంటారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు అనేక ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, జమ్మూకశ్మీర్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, ఢిల్లీలో మోదీ పర్యటిస్తారని అధికార వర్గాలు ఆదివారం పేర్కొన్నాయి. మోదీ సోమవారం తెలంగాణలో పర్యటించనున్నారు.

మరో మూడు ప్రైమరీలు

అధ్యక్ష అభ్యర్థిత్వానికి చేరువగా ట్రంప్

కొలంబియా(యూఎస్): అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం డొనాల్డ్ ట్రంప్‌కు దాదాపుగా ఖాయమైనట్టే. తాజాగా మిస్సోరీ, ఐదహో, మిషిగన్ ప్రైమరీల్లో ఆయన విజయం సాధించారు. ఆయనకు మద్దతు పలికిన డెలిగేట్ల సంఖ్య 244కు పెరిగింది. ప్రత్యర్థి నిక్కీ హేలీ కేవలం 24 డెలిగేట్ల మద్దతుతో చాలా వెనుకంజలో ఉన్నారు. రిపబ్లికన్ అభ్యర్థిత్వం దక్కాలంటే 1,215 డెలిగేట్ల మద్దతు కావాలి. మిషిగన్ రాష్ట్ర ప్రైమరీలో 68 శాతం ఓట్లు ట్రంప్‌కు, 27 శాతం ఓట్లు హేలీకి పడ్డాయి. మంగళవారం జరగబోయే 16 ప్రైమరీల ఫలితాలతో రిపబ్లికన్, డెమొక్రటిక్ అధ్యక్ష అభ్యర్థులు దాదాపు తేలిపోనున్నారు. మొత్తం డెలిగేట్లలో మూడింట ఒక వంతు మంది ఆ రోజున తమ పార్టీ తరఫున అభ్యర్థిగా ఎవరు ఉండాలనేది ఓటేసి నిర్ణయిస్తారు. ఇప్పటివరకు కొనసాగిన ట్రంప్ అజేయ జైత్రయాత్ర చూస్తుంటే బైడెన్‌కు పోటీగా బరిలో దిగే రిపబ్లికన్ అభ్యర్థి ట్రంపేనని దాదాపు ఖరారైనట్టు కన్పిస్తోంది.



పట్నాలో జన్‌విశ్వాస్ ర్యాలీలో ఏచూరి, ఖర్గే, లాలు, రాహుల్, తేజస్వి, అఖిలేశ్

ఇండియా కూటమి ఎన్నికల భేరి

కాంగ్రెస్‌కు గరిష్ట సీట్లు ఖాయం: ఖర్గే
- పట్నా జన్‌విశ్వాస్ ర్యాలీ బలప్రదర్శన
- ప్రసంగించిన ఆర్జేడీ చీఫ్ లాలూ
- పాల్గొన్న వామపక్ష పార్టీల నేతలు

పట్నా: ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు బిహార్ రాజధాని పట్నా వేదికగా ఎన్నికల ప్రచార నగారా మోగించారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ సారథ్యంలో ఆదివారం జరిగిన 'జన్ విశ్వాస్ మహా ర్యాలీ'లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ తదిపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే ప్రసంగిస్తూ..రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్టంగా సీట్లు కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నేతలపై ఈడీ, సీబీఐ, ఐటీ విభాగాలను ఉసిగొల్పుతూ దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. వాటిని చూసి తాము భయపడటం లేదని చెప్పారు. దేశ సంపదను, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. కేవలం ఇద్దరు, ముగ్గురు బడా పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలను కాపాడుతున్న మోదీ ప్రభుత్వం, దేశ జనాభాలో 73 శాతం మేర ఉన్న వెనుకబడిన వర్గాలు, దళితులను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా బిహార్ మాజీ సీఎం, ఆర్జేడీ చీఫ్ లాలూ యాదవ్ ప్రసంగిస్తూ.. ఇటీవల తమను వదిలేసి ఎన్డీఏ పక్షంలో చేరిన సీఎం నితీశ్‌పై మండిపడ్డారు. వచ్చే ఎన్నికల కోసం సిద్ధం కావాలంటూ ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. 'కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేలా మీలో నైతిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు నేను ఇక్కడే ఉంటాను'అని పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ..యూపీ, బిహార్‌లలో కలిపి 120 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీని ఓడిస్తే కేంద్రంలో ఆ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. వామపక్ష పార్టీల నేతలు సీతారాం ఏచూరి, డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య కూడా ర్యాలీలో ప్రసంగించారు.


రైల్వేపై రాహుల్ విమర్శలు

కేంద్ర ప్రభుత్వం ధనికులను మాత్రమే దృష్టిలో పెట్టుకుని రైల్వే విధానాలను రూపొందిస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని మోదీని నమ్మితే నమ్మకద్రోహం గ్యారెంటీ అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''డైనమిక్ ఫేర్ పేరుతో ఏటా 10 శాతం చొప్పున రైలు చార్జీలను ప్రభుత్వం పెంచుతోంది. క్యాన్సిలేషన్ చార్జీలను, ప్లాట్‌ఫాం టిక్కెట్ల ధరలను సైతం పెంచింది'' అని విమర్శించారు.

హౌతీల క్షిపణి దాడులతో.. ఎర్ర సముద్రంలో నౌక మునక

దుబాయ్: హౌతీ మిలిటెంట్ల క్షిపణి దాడిలో దెబ్బతిన్న మొట్టమొదటి వాణిజ్య నౌక ఎర్ర సముద్రంలో మునిగిపోయింది. గాజాలో హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం సాగిస్తున్న దాడులకు నిరసనగా యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్లు ఎర్ర సముద్రంలోని వాణిజ్య నౌకలే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 18వ తేదీన బాబ్ ఎల్ మండెల్ సింధుశాఖ వద్ద రుబీమర్ అనే నౌకపైకి హౌతీలు క్షిపణులను ప్రయోగించారు. దీంతో, ఆ నౌక దెబ్బతినడంతో అందులోని సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఆ నౌక నుంచి ఇంధన లీకవుతూ క్రమేపీ మునిగిపోతూ వచ్చింది. శనివారం మధ్యాహ్నానికి రుబీమర్ పూర్తిగా నీట మునిగినట్లు యెమెన్ అధికారులు ధ్రువీకరించారు.

పాక్ ప్రధానిగా షహబాజ్



ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రధానమంత్రిగా పీఎంఎల్–ఎన్ నేత షెహబాజ్ షరీఫ్(72) ఎన్నికయ్యారు. నూతన ప్రధానిని ఎన్నుకోవడానికి పాకిస్తాన్ పార్లమెంట్‌లో ఆదివారం ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 336 ఓట్లకుగాను షహబాజ్ షరీఫ్‌కు 201 ఓట్లు లభించాయి. ఇమ్రాన్ ఖాన్ నాయకత్వంలోని పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ అభ్యర్థి ఒమర్ అయూబ్ ఖాన్‌కు కేవలం 92 ఓట్లు దక్కాయి. షెహబాజ్ షరీఫ్‌కు సాధారణ మెజార్టీ కంటే 32 ఓట్లు అధికంగా లభించడం విశేషం. పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్(పీఎంఎల్–ఎన్), పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) సంకీర్ణ ప్రభుత్వానికి ఆయన నాయకత్వం వహించబోతున్నారు. పీఎంఎల్–ఎన్, పీపీపీ కూటమికి ముత్తహిదా ఖ్వామీ మూవ్‌మెంట్, పాకిస్తాన్ ముస్లిం లీగ్(ఖ్యూ), బలూచిస్తాన్ అవామీ పార్టీ, పాకిస్తాన్ ముస్లిం లీగ్(జెడ్), ఇస్తెఖామ్–ఇ–పాకిస్తాన్ పార్టీ, నేషనల్ పార్టీ మద్దతిస్తున్నాయి. షహబాజ్ షరీఫ్ పాకిస్తాన్ 24వ ప్రధానమంత్రిగా ఎన్నికైనట్లు పార్లమెంట్ స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిక్ ప్రకటించారు. షహబాజ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన 2022 ఏప్రిల్ నుంచి 2023 ఆగస్టు వరకు ప్రధానమంత్రిగా పనిచేశారు. ఇప్పుడు రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఓటింగ్ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులైన కొందరు ఎంపీలు సభలో అలజడి సృష్టించారు. అనంతరం షహబాజ్ మాట్లాడుతూ కశ్మీర్‌పై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. కశ్మీరీల, పాలస్తీనియన్ల స్వాతంత్య్రం కోసం ఒక్కటి కావాలని ఎంపీలకు పిలుపునిచ్చారు. వారి స్వేచ్ఛను కోరుతూ పార్లమెంట్‌లో తీర్మానం చేయాలన్నారు.

రాజకీయాలకు గుడ్‌బై

బీజేపీ ఎంపీ హర్ష్ వర్ధన్



న్యూఢిల్లీ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బరిలోకి దిగనున్న అభ్యర్థుల తొలిజాబితాను బీజేపీ ప్రకటించిన మరుసటి రోజే రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్. హర్ష్ వర్ధన్ ప్రకటించారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీ పరిధిలోని చాంద్‌నీచౌక్ స్థానం నుంచి సిట్టింగ్ బీజేపీ ఎంపీగా కొనసాగుతున్నారు. శనివారం బీజేపీ విడుదలచేసిన తొలి జాబితాలో ఈయన పేరు లేదు. అందుకే ఈయన రాజకీయాలను వదిలేస్తున్నట్లు వార్తలొచ్చాయి. ఈ సందర్భంగా ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. '' 50 ఏళ్ల క్రితం కాన్పూర్‌లో ఎంబీబీఎస్‌లో చేరా. పేదలకు సేవచేశా. 30 ఏళ్ల పైబడిన రాజకీయ జీవితంలో ఐదు సార్లు శాసనసభ, రెండు సార్లు పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచా. మళ్లీ ఇన్నాళ్లకు నా మూలాల్లోకి వెళ్లిపోతా'' అన్నారు. ఢిల్లీ పరిధిలో నలుగురు సిట్టింగ్ ఎంపీలు పర్వేశ్ శర్మ, రమేశ్ బిధూరి, మీనాక్షి లేఖీ, హర్ష్‌వర్ధన్‌లను కాదని కొత్త వారికి బీజేపీ అవకాశమిస్తూ వారి పేర్లను తొలి అభ్యర్థుల జాబితాల చేర్చడం తెల్సిందే.

నేను పోటీచేయలేను: పవన్ సింగ్

పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ ఎంపీ స్థానం నుంచి తనను బీజేపీ అభ్యర్థిగా నిలబెట్టినప్పటికీ తాను మాత్రం పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు బీజేపీ నేత పవన్ సింగ్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. '' నేనైతే పోటీ నుంచి వైదొలగుతున్నా. ఎందుకు పోటీ చేయట్లేను అనే కారణాలను వెల్లడించలేను' అని భోజ్‌పురీ గాయకుడు, నటుడు అయిన పవన్ సింగ్ స్పష్టంచేశారు. అసన్‌సోల్‌లో బీజేపీ ముందే ఓడిందంటూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎద్దేవాచేసింది.

అతివాద బోధకులకు బ్రిటన్‌లోకి నో ఎంట్రీ

లండన్: పాకిస్తాన్, ఆఫ్గానిస్తాన్, ఇండోనేసియా వంటి దేశాల నుంచి అతివాద ఇస్లామిస్ట్ విద్వేష ప్రబోధకులను దేశంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవాలని బ్రిటిష్ ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేసిందని 'డైలీ టెలిగ్రాఫ్' తెలిపింది. తీవ్రవాద కార్యకలాపాలు ఊహించని రీతిలో పెరుగుతుండటం పట్ల బ్రిటిష్ ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. విదేశాల నుంచి వచ్చే అతివాద మత ప్రబోధకులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వారి పేర్లను వీసా హెచ్చరిక జాబితాలో చేరుస్తారు. వీరికి దేశంలోకి ప్రవేశించే దారులు మూసుకుపోతాయని 'డైలీ టెలిగ్రాఫ్' పేర్కొంది.

వారిని డార్లింగ్ అనడం లైంగిక వేధింపే

- పరిచయం లేని మహిళ విషయంలో అది శిక్షార్హమైన నేరమే
- తేల్చిచెప్పిన హైకోర్టు

కోల్‌కతా: పూటుగా తాగి మహిళా కానిస్టేబుల్‌ను డార్లింగ్ అని పిలిచిన ఓ వ్యక్తిని దోషిగా తేలుస్తూ కలకత్తా హైకోర్టు తీర్పు వెలువరించింది. పరిచయం లేని మహిళను అలా పిలవడాన్ని 'లైంగిక వేధింపు నేరం'గా పరిగణిస్తామని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ సందర్భంగా ఇదే కేసులో గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 354ఏ (మహిళా గౌరవాన్ని భంగపరచడం), 509 సెక్షన్ల కింద అతడిని దోషిగా తేలింది. మహిళా కానిస్టేబుల్‌ను మద్యం మత్తులో డార్లింగ్ అని పిలిచిన జనక్ రామ్ అనే వ్యక్తికి గతంలో పడిన శిక్షను సమర్థిస్తూ జస్టిస్ జై సేన్ గుప్తా నేతృత్వంలోని ఏకసభ్య హైకోర్టు ధర్మాసనం తాజా తీర్పును వెలువరించింది. '' పరిచయంలేని మహిళను తాగిన/తాగని వ్యక్తి నడి వీధిలో డార్లింగ్ అనే పిలిచే ధోరణి భారతీయ సమాజంలో లేదు. నిందితుడు మద్యం మత్తులో ఉంటే అప్పుడు నేరాన్ని మరింత తీవ్రమైనదిగా పరిగణిస్తాం' అని జడ్జి వ్యాఖ్యానించారు. అండమాన్ నికోబార్ ద్వీపంలోని మాయాబందర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జనాన్ని అదుపు చేస్తున్న మహిళా కానిస్టేబుల్‌ను 'చలాన్ వేయడానికి వచ్చావా డార్లింగ్?' అంటూ జనక్‌రామ్ వేధించాడు.

రేపు నా రాజీనామా: జస్టిస్ అభిజిత్

కోల్‌కతా: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ మంగళవారం రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా సంబంధమైన పలు అంశాలపై ఈయన వెలువరించిన తీర్పులు ఇటీవల తీవ్ర రాజకీయ చర్చలకు దారితీశాయి. ఆదివారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో ప్రవేశించాలని అనుకుంటున్నారా అన్న ప్రశ్నకు ఆయన మంగళవారం రాజీనామా పత్రం సమర్పించాక అన్ని విషయాలను మీడియాతో పంచుకుంటానంటూ బదులిచ్చారు. రాజీనామా లేఖను మంగళవారం మొదటగా రాష్ట్రపతికి, లేఖ ప్రతులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపిస్తానన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ, ప్రభుత్వ సాయం అందుకునే, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర పోస్టుల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ దర్యాప్తు జరపాలంటూ ఈడీ, సీబీఐలకు ఆదేశాలిచ్చారు.

కేంద్రానికి 'యాంటీ పంజాబ్' సిండ్రోమ్

లూధియానా: పంజాబ్ వ్యతిరేకత అనే రుగ్మతతో బాధపడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో శిక్షించాలని ఆప్ అగ్రనేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. పంజాబ్‌లోని మొత్తం 13 లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీకి విజయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గణతంత్ర వేడుకల సందర్భంగా పంజాబ్ శకటాన్ని కేంద్రం నిరాకరించడం పంజాబీలను అవమానించడమేనన్నారు. దేశం కోసం అత్యున్నత త్యాగాలు చేసిన పంజాబ్ అమరులకు కేంద్రం నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ అవసరం లేదని వ్యాఖ్యానించారు. బీజేపీయేతర పార్టీల పాలిత రాష్ట్రాల్లో కేంద్రం మితిమీరి జోక్యం చేసుకుంటూ పాలన సజావుగా సాగకుండా ఆటంకాలు కలిగిస్తోందని విమర్శించారు. ఆదివారం ఆయన లూధియానాలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో తనను ఇబ్బందులు పెడుతున్న కేంద్రాన్ని అడ్డుకోగలిగానన్నారు. ఇక్కడ సీఎం మాన్ కేంద్రం, బీజేపీ, గవర్నర్‌ల వైఖరితో పోరాటం సాగిస్తున్నారని చెప్పారు.

మేం మీ కీలు బొమ్మలం కాదు

తైపీ: తైవాన్ విదేశాంగ మంత్రి భారత మీడియాకు ఇంటర్వ్యూ ఇవ్వడంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై తైవాన్ ఘాటుగా స్పందించింది. 'తైవాన్, భారత్ మీ తొత్తులు కాదు. స్వేచ్ఛాయుత మీడియా కలిగిన స్వతంత్ర ప్రజాస్వామ్య దేశాలు' అంటూ దీటుగా బదులిచ్చింది. తైవాన్ విదేశాంగ మంత్రి జోసెఫ్ వూ 'ఇండియా టుడే'టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూ ఫిబ్రవరి 29న ప్రసారమైంది. ఇందుకు నిరసనగా భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దాంతో, పొరుగు దేశాలను వేధించడం మాని దెబ్బతిన్న సొంత ఆర్థిక వ్యవస్థను గురించి ఆలోచించుకోవాలంది.

వాట్సాప్ నుంచి వేరే యాప్‌లకూ మెసేజ్‌లు!



న్యూఢిల్లీ: ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లను తీసుకొస్తూ వినియోగదారులకు అనువుగా యాప్‌లో మార్పులు చేస్తున్న 'వాట్సాప్' త్వరలో మరో ఫీచర్‌ను జతచేయనుంది. ఇకపై వాట్సాప్ నుంచి సిగ్నల్, టెలిగ్రామ్ వంటి ఇతర యాప్‌లకూ మెసేజ్‌లను పంపుకోవచ్చు. దీనికి అనువుగా కొత్త ఫీచర్‌ను వాట్సాప్‌లో త్వరలో తీసుకురానున్నారు. దీంతో ఇతర సామాజిక మాధ్యమాల వేదికలపైనా వాట్సాప్ నుంచి మెసేజ్‌లను షేర్ చేసుకోవచ్చు. ఇతర చాట్స్ కోసం ప్రత్యేకంగా, విడిగా ఒక చాట్ ఇన్‌ఫో స్క్రీన్ ఒకటి కనిపించేలా ఫీచర్‌ను వాట్సాప్ సిద్ధంచేస్తోంది. ఈ కొత్త ఫీచర్‌కు తుది మెరుగులు దిద్ది అందుబాటులోకి తెచ్చేందుకు వాట్సాప్ నిపుణులు తలమునకలైనట్లు తెలుస్తోంది. వాట్సాప్‌తో మెసేజ్‌ల షేరింగ్‌లపై సిగ్నల్, టెలిగ్రామ్ యాప్‌లు ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదని వాబేటాఇన్ఫో అనే సంస్థ స్పష్టంచేసింది. ఏఏ యాప్‌లతో అనుసంధానం అవ్వాలనేది ఆయా వాట్సాప్ యూజర్ల స్వీయనిర్ణయం, స్వీయ నియంత్రణ పైనే ఆధారపడి ఉంటుంది కాబట్టి వ్యక్తిగత భద్రతకు భంగం వాటిల్లదని వివరించింది. బీటీ వెర్షన్‌ను టెస్ట్‌చేస్తున్న కొన్ని సెలక్ట్ చేసిన గ్రూప్‌లకు మాత్రమే ఈ వాట్సాప్ ప్రొఫైల్ స్క్రీన్‌షాట్ అడ్డుకునే ఫీచర్ అందుబాటులో ఉంది. మరి కొద్ది వారాల్లో ఈ ఫీచర్‌ను యూజర్లు అందరికీ అందుబాటులోకి తేనున్నారు.

బీఎస్‌ఎఫ్‌లో తొలి మహిళా స్నైపర్

సుమన్ కుమారి ఘనత



షిమ్లా: సుదూరంగా మాటువేసి గురి చూసి షూట్‌చేసే 'స్నైపర్' విధుల్లో చేరి పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ సుమన్ కుమారి చరిత్ర సృష్టించనున్నారు. సరిహద్దు భద్రతా దళం(బీఎస్‌ఎఫ్)లో తొలి స్నైపర్‌గా కుమారి పేరు రికార్డులకెక్కనుంది. ఇండోర్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్(సీఎస్‌డబ్ల్యూటీ)లో ఎనిమిది వారాల కఠోర శిక్షణను కుమారి విజయవంతంగా పూర్తిచేసుకున్నారు. దీంతో శిక్షణలో ఆమె ఇన్‌స్ట్రక్టర్ గ్రేడ్ సాధించారు. బీఎస్‌ఎఫ్‌లో స్నైపర్ బాధ్యతలు అప్పజెప్పనున్నారు. కుమారి 2021లో బీఎస్‌ఎఫ్‌లో చేరారు. నిరాయుధంగా శత్రువుతో పోరాడే 'నిరాయుధ దళం'కు గతంలోనే ఆమె ఎంపికయ్యారు. పాకిస్తాన్ సరిహద్దుల వెంట మాటువేసి అదనుచూసి చొరబాట్లకు తెగబడే ఉగ్రవాదులను మట్టుబెట్టడంలో స్నైపర్‌లది కీలక పాత్ర.

సాక్షి
కరీంనగర్
సోమవారం ౹ 4 ౹ మార్చి ౹ 2024



వాకర్స్ శ్రమదానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): మానేరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం మానేరు డ్యామ్ కట్ట పక్కన వాకింగ్ ట్రాక్‌పై చెట్లు, చెత్తను తొలగించారు.



ఓదెల మల్లన్నకు మొక్కులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల శ్రీమల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
35.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళ చలిగా ఉంటుంది. పగలు ఎండగా ఉండి, వేడిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'వైరాగ్యం'కు జాషువా పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న రచయిత వైరాగ్యం ప్రభాకర్

కరీంనగర్‌కల్చరల్: రచయిత వైరాగ్యం ప్రభాకర్‌కు గుర్రం జాషువా పురస్కారం వరించింది. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ, గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ దుగ్గిరాల, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన జాతీయ కవి సమ్మేళనంలో డాక్టర్ బిక్కి కృష్ణ, డాక్టర్ పెద్దింటి యోహాను చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాధాకుసుమ, డాక్టర్ జె.విద్యాసాగర్, డాక్టర్ యు.హనుమంతరాయుడు, వేము వందనం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్ మూల్యాంకనం

కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని (ప్రభుత్వ, ప్రైవేట్, సాంఘిక సంక్షేమ, జ్యోతిబాపూలే, ఆదర్శ, కేజీబీవీ, మైనార్టీ) జూనియర్ కళాశాలల్లో పనిచేసే ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి పద్మనగర్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు, ప్రిన్సిపాల్స్‌కు ఎగ్జామినర్ నియామక ఉత్తర్వులు tsbie. cgg. gov. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. స్పాట్ వాల్యుయేషన్ నియామక ఉత్తర్వులు వచ్చినవారందరూ మూల్యాంకనం కేంద్రానికి సకాలంలో హాజరుకావాలని సూచించారు.

తెలంగాణ కోసం పదవి త్యాగం చేసిన 'బోయిన్‌పల్లి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీవీ రామకృష్ణారావు, నాయకులు

కరీంనగర్: ప్రత్యేక రాష్ట్రం కోసం మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ పదవి త్యాగం చేసి పదహారేళ్లు అవుతుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అన్నారు. ఈసందర్భంగా కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమ నేత కేసీఆర్ సారథ్యంలో పదవికి రాజీనామా చేసి తెలంగాణ సాధనే ధ్యేయంగా కొట్లాడిన చరిత్ర వినోద్‌కుమార్‌దని పేర్కొన్నారు. 2004లో హనుమకొండ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారని, అప్పుడు తెలంగాణ ఇస్తామని కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయడంతో 28 ఫిబ్రవరి 2008 కేసీఆర్‌తో కలిసి పదవికి రాజీనామా చేస్తామని ప్రకటించారని తెలిపారు. నిత్యం ప్రజల కోసమే ఆలోచన చేసే ఆయనను కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని కోరారు. 2014లో ఎంపీగా గెలిచి కరీంనగర్ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు జక్కుల నాగరాజు, ద్యావ మధుసూదన్‌రెడ్డి, సంపత్ గౌడ్, వంశీధర్‌రెడ్డి, సాయికృష్ణ, ఓంకార్, శ్రీను, శ్రావణ్, రాజశేఖర్, అజయ్, రమేశ్, విజేందర్‌రెడ్డి, సతీశ్, తరుణ్ పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న రామారావు

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా టెట్ అర్హత పరీక్షలో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు న్యాయం చేయాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో మాట్లాడారు. అగ్రకుల సామాజిక వర్గాల్లో నిరుపేదలైన ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అర్హత మార్కులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సడలింపు ఇవ్వకుండా 90 మార్కుల కటాఫ్ నిర్ణయించడం దురదృష్టకరమన్నారు. టెట్ అర్హతకు ఓసీ అభ్యర్థులకు 90 మార్కులు, బీసీలకు 75, ఎస్సీ, ఎస్టీలకు 60 మార్కుల అర్హత ఉన్నందున ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 75 మార్కులు అర్హతగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద వివిధ ఓసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట సంఘం నాయకులు ఉన్నారు.

కరీంనగర్ నుంచే బీఆర్‌ఎస్ కదనభేరి



- కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ పరిధి నేతలతో సన్నాహక సమావేశం
- గెలుపు వ్యూహాలపై మాజీ సీఎం కేసీఆర్ సమాలోచన
- ఈనెల 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభకు నిర్ణయం
- ఎంపీ అభ్యర్థులుగా వినోద్‌కుమార్, కొప్పుల పేర్లు ప్రకటించే అవకాశం



వినోద్‌కుమార్



కొప్పుల ఈశ్వర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి/కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ కరీంనగర్ నుంచే పార్లమెంట్ ఎన్నికల కదనభేరి మోగించబోతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ.. గులాబీ దళాన్ని ఎన్నికలకు సన్నద్ధం చేసేలా.. లోక్‌సభ ఎన్నికల కసరత్తును ప్రారంభించనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో నైరాశ్యంలో ఉన్న పార్టీ క్యాడర్‌లో జోష్ నింపేలా.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల ఆవరణలో నిర్వహించే బహిరంగసభను వేదికగా చేసుకోవాలని ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇప్పటికే జనవరిలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. తాజాగా ఆదివారం మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాల ముఖ్యనేతలతో విడివిడిగా సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన గెలుపు వ్యూహాలపై సమాలోచనలు చేశారు. బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీల వలసలు ఆపేలా.. అలాగే ఈనెల 12న కరీంనగర్‌లో నిర్వహించబోయే బహిరంగసభను సక్సెస్ చేయడంపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

దశమిరోజు ఇద్దరు అభ్యర్థుల ప్రకటన

పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ అన్ని పార్టీలు ఎన్నికల కసరత్తు ప్రారంభించాయి. ఇప్పటికే బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులతో కూడిన తొలిజాబితాను విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీ ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధికి ముగ్గురు పేర్లతో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)కు పంపింది. కాంగ్రెస్, బీజేపీకి ధీటైన అభ్యర్థులను బరిలో నిలిపేందుకు పార్టీ ముఖ్యనేతల నుంచే ఇప్పటికే అభిప్రాయాలు సేకరించింది. ఇక తెలంగాణభవన్‌లో నిర్వహించిన సమావేశంలోనే ఎంపీ అభ్యర్థులుగా కరీంనగర్ నుంచి మాజీ ఎంపీ బొయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించాలనుకున్నా.. ఆదివారం అష్టమి, సోమవారం నవమి కావడంతో వాయిదా వేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దశమి రోజు అధికారికంగా మొదట జాబితాలో కరీంనగర్, పెద్దపల్లి స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారని నేతలు చెబుతున్నారు. లేదంటే ఈనెల 12న కరీంనగర్ ఎస్సారార్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ అధిష్టానం వీరిద్దరికీ జనవరిలోనే టికెట్‌పై గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో వీరు తమ నియోజకవర్గం పరిధిలో వాల్‌రైటింగ్స్, ఫ్లెక్సీలతో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. అధికారికంగా అభ్యర్థుల ఖరారు చేసిన తరువాత పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారంలో దిగేందుకు నేతలు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

మనమే యాదికొస్తున్నాం..

లోక్‌సభ ఎన్నికల్లో గెలవబోతున్నామని, బీఆర్‌ఎస్ సత్తా చూపెట్టబోతున్నామని కేసీఆర్ నేతలతో అన్నట్లు సమాచారం. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కంటే మేడిగడ్డతో సహా గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులపై అభాండాలు వేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న విషయాన్ని ప్రజలు గుర్తించారని, ప్రభుత్వంపై అతి కొద్దిరోజుల్లోనే వ్యతిరేకత వచ్చిందని, రైతులు రోడ్లు ఎక్కే పరిస్థితి తెచ్చారన్న కేసీఆర్.. బీఆర్‌ఎస్‌తోనే మేలు జరుగుతుందనే చర్చ ప్రజల్లో మొదలైందని పేర్కొన్నారు. 'ప్రజలకు కొద్ది రోజుల్లోనే మనం యాదికొస్తున్నాం..' గెలుపోటములు కొత్త కాదు.. కుంగి పోయేది.. పొంగిపోయేది ఏమీ లేదంటూ నేతలకు కేసీఆర్ సూచించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్ స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలవగా.. మిగిలిన నాలుగింటిలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. అయితే ఆరు స్థానాల్లో బీఆర్‌ఎస్ సెకండ్ ప్లేస్‌లో ఉండగా.. బీజేపీ కేవలం మంచిర్యాలలో ద్వితీయ స్థానంలో ఉన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఓడిన అన్నిస్థానాల్లో బీఆర్‌ఎస్ గణనీయమైన ఓట్లతో సెకండ్ ప్లేస్‌లో నిలిచి పార్టీ క్యాడర్ బలంగానే ఉందన్నారు. నేతలు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే విజయం సాధించవచ్చని నేతల్లో జోష్ నింపుతూ, దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. సమావేశంలో మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, నగర మేయర్ వై.సునీల్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, పార్టీ ఇన్‌చార్జీలు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, జీవీ.రామక్రిష్ణారావు, తోట ఆగయ్య, బండ శ్రీనివాస్, సిద్ధం వేణు, ఎల్.రూప్‌సింగ్, తుల ఉమ, చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

- జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ పమేలా సత్పతి, నగర మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్: ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా సత్పతి, నగర మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్ మాట్లాడుతూ, పోలియోను రూపుమాపేందుకు అందరూ సహకరించాలని, పిల్లలందరికీ తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. 3 రోజుల పాటు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డిప్యూటీ వైద్యాధికారి జువేరియా, డీఐవో సాజిదా, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా మాస్ మీడియా అధికారి రంగారెడ్డి, మాతాశిశు కేంద్రం సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ నవీన తదితరులు పాల్గొన్నారు.

విజిటర్స్ షెడ్డును ఆధునీకరించండి: కలెక్టర్

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని విజిటర్స్ షెడ్డును ఆధునీకరించాలని వైద్యాధికారులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఆదివారం షెడ్డును పరిశీలించి మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగుల కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా షెల్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. బెడ్స్, కుర్చీలు, లాకర్ సదుపాయం కల్పించాలన్నారు. రాత్రిపూట రోగుల కుటుంబ సభ్యులు ఉండేలా ఏర్పాట్లు చేపట్టాలని పేర్కొన్నారు. వారం రోజుల్లో ఈ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నపిల్లల వార్డుల్లోకి ఎప్పుడు పడితే అప్పుడు రోగుల కుటుంబ సభ్యులను పంపించవద్దని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రిని నిత్యం శుభ్రంగా ఉంచాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని పేర్కొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వీణవంక(హుజూరాబాద్): 48 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. 1975–76 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. 60 మంది విద్యార్థులకు 40 మంది హాజరయ్యారు. నలుగురు ఉపాధ్యాయులు హాజరు కాగా వారిని సన్మానించారు. పాఠశాలకు సాయం అందిస్తామని ప్రకటించారు.


ఫేస్ టు ఫేస్

- ముఖం.. ఇక ముఖ్యం
- ఉపాధి పనుల్లో పారదర్శకతకు పెద్దపీట
- అక్రమాలకు అడ్డుకట్ట

కరీంనగర్ అర్బన్: ఉపాధి పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పనుల్లో పారదర్శకతతో పాటు నిధులు సద్వినియోగం జరిగేలా చర్యలు చేపడుతుండగా కేంద్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. పనికి వచ్చే కూలీలు తప్పనిసరిగా హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా కూలీల ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందుకోసం ఇప్పటికే ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి సిబ్బందికి శిక్షణనిచ్చారు. త్వరలో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ముందుగా కొన్ని పంచాయతీల్లో ఇటీవల పరిశీలన చేశారు. అందులో లోపాల్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించారు.

అక్రమాలకు అడ్డుకట్ట

జిల్లాలోని 313 పంచాయతీల్లో జాబ్‌కార్డులు 1,35,642 ఉండగా కూలీలు 2,96,756 మంది ఉన్నారు. ఉపాధి పథకంలో కూలీల హాజరుపై తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. గతంలో సామాజిక తనిఖీల్లో మస్టర్లపై ఎన్నో లొసుగులు బయటపడ్డాయి. వాటికి అడ్డుకట్ట వేయడంతో పాటు అర్హులకు న్యాయం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కూలీలకు ముఖ విధానాన్ని తెర పైకి తెచ్చింది. ఈ విధానంతో బోగస్ హాజరుకు అడ్డుకట్ట పడనుంది. జిల్లావ్యాప్తంగా ఉపాధి జాబ్ కార్డుల్లోని సభ్యులందరికీ ఆధార్ అనుసంధానం చేశారు. పని ప్రదేశాల్లో తొలుత కూలీల ముఖ చిత్రాలను



ఉపాధి పనుల్లో కూలీలు (ఫైల్)

గ్రామ పంచాయతీలు	313
ఫీల్డ్ అసిస్టెంట్లు	205
జాబ్‌కార్డులు	1,35,642
కూలీలు	2,96,756

నమోదు చేస్తారు. తర్వాత కూలీ ఫొటో, ఆధార్‌తో అంతకుముందు దిగిన ఫొటో సరిపోలితేనే వారికి హాజరు పడుతుంది. పని చేసే రోజు ఉదయం, మధ్యాహ్నం కూలీల ముఖ చిత్రీకరణ తప్పనిసరిగా ఉంటుంది.

లోపాలను సవరిస్తేనే సరి

పని ప్రదేశానికి కేవలం పది మీటర్ల పరిధిలోనే హాజరు నమోదవుతుంది. ఉదాహరణకు పంట కాల్వ పనులు చేస్తున్నప్పుడు ముఖ గుర్తింపు సాధ్యం కావడం లేదు. ముఖ గుర్తింపునకు సమయం ఎక్కువగా తీసుకుంటుంది. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్ర సహాయకుల ఫోన్‌లలో నెట్ స్పీడ్ సరిపోవడం లేదు. కనీసం 5జీ నెట్‌వర్క్ ఉండాలి. తరచూ స్టోరేజీ సమస్య ఏర్పడుతోంది. జిల్లాలో పలువురు ఎఫ్‌ఏలకు రెండు నుంచి ఆరు పంచాయతీల అదనపు బాధ్యత లున్నాయి. ఈ సమస్య పరిష్కరించి నూతన ఆర్థిక సంవత్సరం నుంచి ఈ యాప్‌ను ప్రారంభించవచ్చని డీఆర్డీవో అధికారులు చెబుతున్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా..

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్



సైదాపూర్ ప్రజాహితయాత్రలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్



మొలంగూర్‌లో దూద్ బావి నుంచి నీటిని తోడుతున్న బండి సంజయ్

సైదాపూర్/శంకరపట్నం: వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కోతలు పెడుతూ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం సైదాపూర్ మండలం అమ్మనగుర్తి, గుండ్లపల్లి, బొమ్మకల్, రాయికల్, ఘనపూర్, వెన్కెపల్లి–సైదాపూర్, శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామాల్లో ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. మొలంగూర్ ఖిల్లా దూద్ బావి నీటిని స్వయంగా తోడ్కొని తాగి, నీటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, సైదాపూర్ అంటేనే పువ్వు గుర్తని, అందులో డౌటే లేదన్నారు. మొన్నటి ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేశారని, ఇప్పుడు మాత్రం పువ్వు గుర్తుకు వేయాలని కోరారు. కరీంనగర్ ప్రజల ఆశీర్వాదంతో ఎంపీగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగానని, ఎంతో రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉందని, గ్యారంటీలు ఎలా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తెలంగాణను వల్లకాడు చేశాడని, వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేని పరిస్థితి బీఆర్‌ఎస్‌కు ఉందన్నారు. తెలంగాణలో చెట్లు నాటినా, మరుగుదొడ్లు కట్టినా, సీసీ రోడ్లు వేసినా, గ్రామ పంచాయతీలు కట్టినా కేంద్రం ఉపాధి నిధులేనని వివరించారు. మూడోసారి మోదీని ప్రధానిగా, కరీంనగర్ ఎంపీగా రెండోసారి తనను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కరీంనగర్ ఎంపీగా జిల్లాకు 12 వేల కోట్ల నిధులు తెచ్చానన్నారు. రెండవసారీ ఎంపీగా గెలిస్తే మోదీని ఒప్పించి మరిన్ని ఎక్కువ నిధులు తెచ్చి కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ప్రవీణ్‌రావు, కందుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, పల్లేని వేణుగోపాల్‌రావు, వెంకట్‌రెడ్డి, దండు కొమురయ్య, సమ్మిరెడ్డి, అనిల్, నరేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బరాబర్ హిందువుల కోసం కొట్లాడుతా

వీణవంక(హుజూరాబాద్): రాముడు అంటే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు వణుకు పుడుతుందని, హిందువుల గురించి మాట్లాడితే తప్పు పడుతున్నారని, కచ్చితంగా హిందువుల గురించి మాట్లాడుతానని ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఆదివారం సాయంత్రం వీణవంక మండలం చల్లూరు, ఎల్బాక గ్రామాల్లో ప్రజాహితయాత్రలో భాగంగా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రామునికి పూజ చేస్తే తప్పు పడుతున్నారని, బరాబర్ హిందువుల కోసం కొట్లాడుతానని స్పష్టం చేశారు. 317జీవో గురించి బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు ఓటు వేశారని అన్నారు. ఫస్ట్ నాడే జీతాలు ఇస్తామని కాంగ్రెస్ బాండ్ రాసిస్తుందా.. ఆ దమ్ము ఉందా అని అన్నారు. కేవలం ఓట్ల కోసం ప్రస్తుతం ఫస్ట్ నాడు జీతాలు ఇస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు మింగాడని కానీ, కాంగ్రెస్ పార్టీ దీనిపై విచారణ జరుపడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, మాడ గౌతంరెడ్డి, పెద్ది మల్లారెడ్డి, నరసింహరాజు, బత్తిని నరేశ్‌గౌడ్, ముత్యాల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్, రాజకొంరయ్య, గణపతి, ఎంపీటీసీ మోరే స్వామి తదితరులు ఉన్నారు.

మిర్చి రైతుకు కష్టకాలం

- వేరుకుళ్లు, తామరపురుగుతో కుదేలు
- ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి
- గణనీయంగా పడిపోయిన దిగుబడి
- ఒక్కసారికే లూటీపోయిన చేన్లు

వీణవంక(హుజూరాబాద్): మిర్చి రైతుకు కష్టకాలమొచ్చింది. గత చేదు అనుభవాలను దిగమింగుతూ ఈసారి మిర్చి పంట సాగు చేస్తే చేతికి వచ్చే సమయంలో వేరుకుళ్లు, తామరపురుగు(వైరస్) ఆశించి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. కాయ దశలో ఉన్న సమయంలో చేను మొత్తం ఎండిపోయిది. పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. ఒక్కో రైతు రూ.లక్షల్లో రసాయన మందులు పిచికారీ చేసినా పంట దక్కలేదు. ఫలితంగా దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఒక్కసారికే చేను లూటీ పోయిందని రైతులు వాపోతున్నారు. గత రెండేళ్లుగా ఇదే దుస్థితి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొడ్డురకం కంటే ఎక్కువగా సన్నరకం మిర్చి సాగున చేసిన రైతులే పూర్తిగా నష్టపోయారు. కనీసం పెట్టుబడి రాలేని పరిస్థితి దాపురించింది. ఉమ్మడి జిల్లాలో ఈయేడు 50వేల ఎకరాల్లో మిర్చి పంట సాగులోకి వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.



వేరుకుళ్లు తాకిడికి గురైన చేను

ధర ఉన్నా దిగుబడి లేదు

ఈయేడు మిర్చి ధర ఆశించిన స్థాయిలో పలుకుతుంది. దొడ్డు రకం మిర్చి క్వింటాల్‌కు రూ.50వేలు దాటింది. సన్నరకం క్వింటాల్‌కు రూ.22వేల చేరువలో ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో మిర్చికి డిమాండ్ ఉండటంతో రోజు రోజుకు ధరలు పెరుగుతున్నాయి. అయితే ధరలను చూసి రైతులు మంచి లాభాలు ఆర్జించవచ్చని ఆశించారు. ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టారు. దిగుబడి మాత్రం నాలుగు బస్తాల కంటే ఎక్కువ రాలేదని జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రావు అనే రైతు వాపోయాడు. మొదట్లో చేను ఏపుగా ఉండటంతో ఇక ఢోకా లేదనుకున్నారు. పెట్టుబడికి వెనకడుగు వేయలేదు. మార్కెట్లో మిర్చి ధర(సన్నరకం) రూ.22వేలు పలుకుతుండటంతో కనీసం ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి తీయాలని ఆశించారు. కానీ చేను కాయ దశలో రాగానే వేరుకుళ్లతో పాటు వైరస్ విజృంభించడంతో చేను పూర్తిగా ఎండిపోయింది. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. మూడుసార్లు ఏరుదామనుకున్న చేన్లు ఒక్కసారికే లూటీ పోయాయి. కొంత మంది రైతులు చేనును చెడగొట్టి మక్క సాగు చేశారు. గతేడాది ఒక్కో రైతు ఎకరాకు రూ.3 లక్షల దిగుబడి తీశారు. కానీ ఈ సారి కోలుకోలేని దెబ్బతీయడంతో లబోదిబోమంటున్నారు. వరి సాగు చేస్తే దిగుబడి ఎక్కువగా రావడంలేదని రైతులు మిర్చి వైపు దృష్టి పెట్టారు. మండలంలోని జగ్గయ్యపల్లి–బేతిగల్ గ్రామ శివారులలో కొంత మంది రైతులు వరికి బదులు మిర్చి పంట వేశారు. కానీ, తెగుళ్ల కోలుకోలేని దెబ్బతీశాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి రాలేదు



వరి పంట వేస్తే దిగుబడి వస్తలేదని పంట మార్పిడి చేసి సన్నరకం మిర్చి పంటను 30గుంటల్లో సాగు చేశా. మొదట్లో చేను ఏపుగా పెరిగింది. పెట్టుబడికి వెనకడుగు వేయలేదు. కానీ, పూత దశకు రాగానే వేరుకుళ్ల ఆశించింది. ఎన్ని రసాయన మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. 2లక్షల దిగుబడి వస్తుందని ఆశించా. కానీ 60వేలు రాలేదు. ఈ పంట కూడా దెబ్బతీసింది. ఈయేడు మిర్చి సాగు చేసిన రైతులందరిదీ నాలాంటి దీనస్థితే.

– శేఖర్‌రావు, రైతు, జగ్గయ్యపల్లి

ఎకరా మిర్చి సాగుకు పెట్టుబడి ఇలా..	(రూ.లలో)
చెలకదుక్కి పొతం చేయడం (ట్రాక్టర్)	6 వేలు
విత్తనం ఖర్చు	30 వేలు
కూలీలు(కలుపు, మొలకలు పెట్టడం)	10 వేలు
రసాయన మందులు	45 వేలు
ఎరువులు	15 వేలు
మొత్తం ఖర్చులు	రూ.1.06 లక్షలు

క్లుప్తంగా

మహిళను కబళించిన క్యాన్సర్

కోనరావుపేట(వేములవాడ): నిరుపేద మహిళను క్యాన్సర్ కబళించింది. కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన తాళ్లపెల్లి కల్పన(35) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. మెడపై కంతి అవడంతో ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా క్యాన్సర్ అని నిర్ధారించారు. కరీంనగర్, హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగా రూ.3 లక్షల వరకు అప్పులు అయ్యాయి. వ్యాధి ముదరడంతో ఆదివారం మృతి చెందింది. మృతురాలి భర్త శ్రీనివాస్ కూలీ పనులు చేస్తుండగా, కుమారుడు రిషిక్, కూతురు మనస్విని ఉన్నారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

మల్యాల(చొప్పదండి): బైక్‌ను లారీ ఢీకొని ఒకరు గాయపడిన సంఘటన మండలంలోని ముత్యంపేట శివారులో చోటుచేసుకుంది. ముత్యంపేటకు చెందిన ముల్క మల్లయ్య ఆదివారం బైక్‌పై కొండగట్టువైపు వెళ్తుండగా మారుతి టౌన్‌షిప్ సమీపంలో జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై లారీ వెనక భాగం తగలిగింది. ఘటనలో మల్లయ్య కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

చందోళిలో చిరుత.!?


వైరల్‌గా మారిన ఫొటోలు

గొల్లపల్లి: మండలంలోని చెందోళి గ్రామంలో శనివారం రాత్రి చిరుత కనిపించిందన్న వార్తలు గుప్పుమన్నాయి. చిరుత ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయందోళనకు గురయ్యారు. చందోళి శ్మశాన వాటిక నుంచి టేకు తోట లోపలికి వెళ్లి.. అటుగా వెళ్లిన ప్రయాణికులను వెంబడించిందని, వాహనాలను వేగంగా నడిపి ప్రమాదం నుంచి తప్పించుకున్నారని, చిరుతను దగ్గరగా తీసినట్లు ఉన్న ఫొటోలను చూసిన జనం అయోమయానికి గురయ్యారు. దీనిపై ఆదివారం ఉదయం గ్రామంలో ఆరా తీయగా అదంతా ఫేక్ అని కొట్టిపారేయడం గమనార్హం.

వృద్ధురాలి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన జీలుక వెంకటమ్మ(85) అనారోగ్యం బాధ భరించలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు. వెంకటమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. కుమారుల ఇంట్లో ఉండేందుకు ఆమె నిరాకరించింది. తన ఇంట్లోనే ఉంటోంది. అయితే, గ్రామానికి చెందిన పైడిపాల ప్రభాకర్ ఆదివారం ఉదయం వచ్చి చూడగా చేదబావిలో శవమై తేలింది. మృతురాలి కుమారుడు కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు శవాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చిట్‌ఫండ్ నిర్వాహకుల్లో వణుకు

- చిట్టీల పేరుతో మోసాలు చేస్తున్న వారికి కటకటాలు
- ఒక ప్రైవేట్ చిట్స్ బాధ్యులను జైలుకు పంపిన పోలీసులు
- ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్న వైనం
- కంపెనీలపై వరుస ఫిర్యాదులు

'ఇటీవల ఖాతాదారుడితో చిట్టి వేయించుకొని తిరిగి అతడికి రావాల్సిన మొత్తం ఇవ్వకపోవడంతో వరంగల్‌కు చెందిన ఒక చిట్‌ఫండ్ కంపెనీ ప్రతినిధులపై కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంపెనీ చైర్మన్‌తోపాటు పలువురు డైరెక్టర్లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు'

'ఇటీవల మూడు చిట్‌ఫండ్ కంపెనీలు చిట్టీలు వేయించుకొని సకాలంలో డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని చిట్‌ఫండ్ బాధ్యులు, ఏజెంట్లపై వేర్వేరు ఫిర్యాదులు చేశారు. కరీంనగర్ టూటౌన్‌లో కేసులు నమోదయ్యాయి'.



కరీంనగర్‌క్రైం: చిట్‌ఫండ్ కంపెనీల మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. పొదుపు పేరు చెప్పి నిండా ముంచుతున్నారు. చిట్టీల పేరుతో ఖాతాదారుల నుంచి కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేస్తున్నాయి. చిట్‌ఫండ్ కంపెనీలు వందల సంఖ్యలో ఏజెంట్లను నియమించుకొని రకరకాల చిట్టీల గురించి ఖాతాదారులకు చెప్పి ఆకర్షించి చిట్టీలు వేయించుకొని వారి గడువు పూర్తయిన తర్వాత చెల్లించడం లేదు. కరీంనగర్ జిల్లా పోలీసులు ఇటీవల ఒక ప్రముఖ చిట్‌ఫండ్ కంపెనీ చైర్మన్, డైరెక్టర్లను అరెస్టు చేసి జైలుకు పంపించడంతో.. మిగతా చిట్‌ఫండ్ కంపెనీల్లో వణుకు మొదలైంది. ఖాతాదారులను నిండా ముంచి ఆస్తులు కొనుగోలు చేసుకుంటూ వారి డబ్బులు వారికి చెల్లించకుండా వివిధ రకాల బాండ్లు ఇస్తూ మోసాలు చేస్తున్నారు. మాయమాటలు చెప్పి ఖాతాదారులను నిండా ముంచుతున్న చిట్‌ఫండ్ కంపెనీలపై పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

ఆశ చూపి మోసాలు

చిట్‌ఫండ్ కంపెనీలు మోసాలు చేస్తున్నాయని ఇటీవల కరీంనగర్ పోలీసులకు వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లాలో అధికారికంగా 61 చిట్‌ఫండ్‌లు ఉండగా.. అనధికారికంగా 2వేలకు పైగా నడుస్తుంటాయి. చిట్‌ఫండ్ కంపెనీల ఏజెంట్లకు కమీషన్ల ఎరవేసి ఖాతాదారులకు వివిధ స్కీముల పేరుతో ఆశ చూపిస్తున్నారు. అత్యాశే కేటుగాళ్ల పెట్టుబడిగా వాడుకొని ఖాతాదారులను నిండా ముంచుతూ కోట్లు గడించి టోకరా వేస్తున్నారు. చిట్టీ గడువు పూర్తయిన తర్వాత ష్యూరిటీలు ఇప్పిస్తే చెల్లిస్తామంటూ నమ్మబలుకుతూ ఏడాది కాలమైనా చెల్లించడం లేదు. సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో ఖాతాదారులు ఆందోళనకు దిగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, పైసాపైస కూడబెట్టుకునే చిరు వ్యాపారులు, ఇతర ప్రైవేట్ ఉద్యోగులు పిల్లల చదువులు, వివాహాది శుభకార్యాలు, ఇళ్లు, స్థలాలు కొనుక్కోవడం, వివిధ భవిష్యత్ ఆర్థిక అవసరాల కోసం చిట్టీలు వేస్తున్నారు. కంపెనీలు బోర్డు తిప్పేసే దశకు రావడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కరీంనగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఒకేరోజు మూడు ఫిర్యాదులు రాగా.. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఏజెంట్ల వద్దకు ఖాతాదారులు

పలు చిట్‌ఫండ్ కంపెనీల్లో పెద్దసంఖ్యలో ఏజెంట్లను నియమించుకొని మార్కెటింగ్ చేస్తుంటారు. ఈక్రమంలో కంపెనీల బాధ్యులు, పెద్దస్థాయి అధికారులెవరూ ఖాతాదారులను నేరుగా కలవరు. ఏజెంట్లకు చిట్టీలు వేయించాలని టార్గెట్ పెట్టి వేల సంఖ్యలో ఖాతాదారులతో చిట్టీలు వేయిస్తారు. చిట్టీలపై వచ్చే కమీషన్లకు కక్కుర్తి పడి ఖాతాదారులతో మాయమాటలు చెప్పి చిట్టీలు వేయించారు. చిట్టీల గడువు ముగియగానే ఖాతాదారులకు చెల్లించకుండా కాలయాపన చేస్తుండడంతో ఖాతాదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పుడు కంపెనీలు దివాలా తీస్తూ బోర్డులు తిప్పేసే పరిస్థితి రావడంతో కంపెనీతో తమకు సంబంధం లేదంటూ పలువురు ఖాతాదారులు ఏజెంట్ల ఇళ్లలోకి వెళ్లి నిలదీస్తున్నారు. మరికొందరు ఏజెంట్లపై పోలీసులకు ఫిర్యాదులు సైతం చేస్తున్నారు. దీంతో చిట్‌ఫండ్ నిర్వాహకులు, ఏజెంట్ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. చిట్‌ఫండ్ మోసాలపై పోలీసులు దృష్టి పెట్టడంతో.. మరి కొన్ని చిట్‌ఫండ్ కంపెనీలకు చెందినవారు కటకటాలపాలవనున్నట్లు చర్చ జరుగుతోంది.

ముగిసిన న్యూరో వైద్యుల రాష్ట్ర సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ ఏకే పురోహిత్

కరీంనగర్ టౌన్: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి మూడు రోజుల పాటు కరీంనగర్‌లో నిర్వహించిన న్యూరో వైద్యుల 8వ రాష్ట్ర స్థాయి సదస్సు ఆదివారం ముగిసింది. బ్రెయిన్ ట్యూమర్, అండర్ డిస్క్ సర్జరీలు, మెదడు, వెన్నుముక, నరాల సమస్యలకు అధునాతన వైద్య పద్ధతులు, న్యూరో సర్జరీ విభాగంలో నూతనంగా వస్తున్న మెలకువలను వివరించారు. స్పైనల్ కార్డు శస్త్ర చికిత్సలో కోతలు లేకుండా ఎండోస్కోపీ ద్వారా శస్త్ర చికిత్స ఎలా చేయాలనే దానిపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ న్యూరో వైద్యుడు ఏకే పురోహిత్ మాట్లాడుతూ, రోబోటిక్ సర్జరీ, ఎండోస్కోపి, నావిగేషన్, అల్ట్రాసోనిక్, అస్టురేటివ్, లేజర్ ద్వారా అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వీటితో పాటు మైక్రోస్కోప్, ఎండోస్కోప్ సర్జరీలు తెలుగు రాష్ట్రాల్లో సక్సెస్‌ఫుల్‌గా చేయడం శుభ పరిణామం అన్నారు. స్పైన్ సర్జరీలు సైతం ఎండోస్కోపి ద్వారా అందుబాటులోకి రావడంతో పేషంట్ల రికవరీ ఎక్కువగా ఉందన్నారు. స్పైనల్ కార్డు స్టీమ్‌లెటర్ పక్షవాతానికి గురైన వ్యక్తులకు ఎంతో దోహదపడుతుందని వివరించారు. న్యూరో విభాగంలో నూతనంగా వస్తున్న మెలకువలను నేర్చుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ పీవీకే కిషోర్, నిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ విజయసారథి, దాసరి శ్రీనివాస్, రంజిత్‌కుమార్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత


బాధితురాలికి నగలు అప్పగిస్తున్న ఏసీపీ

సుల్తానాబాద్‌రూరల్: ఆటోలో పోగొట్టుకున్న బంగారాన్ని పోలీసులు వెతికి మూడు గంటల్లోనే బాధితురాలికి అప్పగించారు. పెద్దపల్లి ఏసీపీ కృష్ణ కథనం ప్రకారం.. చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మండల వసంత వారం క్రితం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి సుగ్లాంపల్లిలోని తన తల్లిగారింటికి వచ్చింది. ఆదివారం గుమ్లాపూర్ వెళ్లేందుకు సుగ్లాంపల్లి వద్ద ఆటో ఎక్కి సుల్తానాబాద్ బస్టాండ్‌కు చేరుకుంది. బంగారం ఉన్న బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయి బస్టాండ్‌లోకి వెళ్లింది. ఆ వెంటనే బయటకు వచ్చి చూసేసరికి ఆటో కనిపించలేదు. వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్సై వినతకు ఫిర్యాదు చేసింది. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో అప్రమత్తమైన పోలీసులు.. సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, గోదావరిఖని, కరీంనగర్ ఆటో స్టాండ్‌ల వద్ద తనిఖీలు చేశారు. హైవేపై సీసీ కెమెరాల సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఈక్రమంలో ఆటో డ్రైవర్ ఫోన్‌నంబరు తెలుసుకొని కరీంనగర్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడ ఆటో తనిఖీ చేయగా బ్యాగ్ లభించింది. అందులో 3 తులాల నెక్లెస్, మరో 3 తులాల హారం, 2 తులాల లాకెట్ చైన్, అర్ధతులం ఉంగరాలు, అర్ధతులం చెవి కమ్మలు అలాగే ఉన్నాయి. వాటిని బాధితురాలకి అప్పగించారు. వెంటనే అప్రమత్తమై, మూడు గంటల్లోనూ బంగారం కలిగిన బ్యాగ్‌ను గుర్తించిన న సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై వినిత, కానిస్టేబుళ్లు అశోక్‌కుమార్, మునీందర్, నాయక్, రాజ్‌కుమార్, వేణును ఏసీపీ అభినందించారు.

మున్నూరుకాపులు సంఘటితంగా పోరాడాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య


మాట్లాడుతున్న కొండ దేవయ్య

కరీంనగర్: సమస్యల సాధనకు మున్నూరుకాపులు సంఘటితంగా కలిసి రావాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్ర విడిపోయిన నాటి నుంచి మున్నూరుకాపుల అభివృద్ధికి, పేద పిల్లల విద్య, ఉపాధి అవకాశాలకు ప్రతి జిల్లా కేంద్రంలో బాలబాలికల హాస్టల్స్ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బలమైన సామాజికవర్గంగా ఉన్న మున్నూరుకాపులు గత అసెంబ్లీలో 9 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, ప్రస్తుతం ఆ సంఖ్య నలుగురికి పడిపోవడం అనైక్యతే కారణమన్నారు. మున్నూరుకాపుల డిమాండ్ల సాధనకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో పర్యటిస్తున్నామని వివరించారు. డిమాండ్లు నెరవేర్చాలని ఇటీవలే వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరగా, సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్, సత్తినేని శ్రీనివాస్, సమన్వయకర్త బొల్లం లింగమూర్తి, గాండ్ల రమేశ్, శ్రావణ్, ఎండీఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి, యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్, గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వీ మహేందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని ఓ గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతుంది. చికిత్స పొందుతూ బాధితురాలు మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వివరాలు.. బాధితురాలు ఇంట్లో ఉండగా ఇంటి ఎదురుగా ఉండే ఓ మహిళ అకారణంగా తిట్టిందని, ఎవరైనా ఇంటికి వస్తే వారితో అక్రమసంబంధం ఉందని దుర్భాషలాడిందని, మళ్లీ సదరు మహిళనే డయల్ 100కు ఫోన్ చేసిందని బాధితురాలు వాపోయింది. అయితే పోలీసులు విచారిస్తుండగానే మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న హార్పిక్ తాగి కుప్పకూలడంతో వెంటనే గ్రామస్తులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి భర్త స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి లక్ష్మీపురం గ్రామశివారులోని పేకాట స్థావరంపై దాడిచేసి నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పాలకుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామ శివారు శ్మశాన శానవాటిక సమీపంలోని శిబిరంపై దాడిచేశామన్నారు. ఈ సందర్భంగా నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారినుంచి రూ.3,560 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్, కానిస్టేబుల్ శివకుమార్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


పిట్టల సురేశ్(ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు కాలువలోపడి మృతి చెందాడు. రామగుండం కార్పొరేషన్‌లోని ఐదో డివిజన్ మల్కాపూర్ గ్రామ శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇదే ప్రాంతానికి చెందిన పిట్టల సురేశ్ (30) ఆదివారం సమీపంలోని ఎన్టీపీసీ వరద కాలువలో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడిపోయాడు. నీటిలో ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి తల్లి పిట్టల బాయమ్మ తన కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు గాలింపు చేపట్టి సురేశ్ కాలువలో పడిమృతి చెందాడని గుర్తించారు. ఈమేరకు బంధువులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


వెంకటేశ్ (ఫైల్)

ధర్మపురి: తాగుడుకు బానిసై.. అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం ధర్మపురిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బిసగోని వెంకటేశ్ (28) ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తిమ్మాపూర్‌లో భార్యాపిల్లలతో ఉంటున్న ఆయన.. తాగుడుకు బానిసై అప్పుల పాలయ్యాడు. మనస్తాపానికి గురై ధర్మపురి శివారు ఒడ్డెరకాలనీ సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

కార్పొరేటర్‌కు తప్పిన ప్రమాదం


నుజ్జునుజ్జయిన కారు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన మేయర్ బంగి అనిల్‌కుమార్‌తోపాటు పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి హైదరాబాద్ తరలివెళ్లారు. ఆదివారం ఈ చేరిక కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉంది. ముగ్గురు కాంగ్రెస్ నాయకులతో కలిసి కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, కార్పొరేటర్ బొంతల రాజేశ్ తన కారులో వెళ్తుండగా శామీర్‌పేట సమీపంలో ఎదురుగా వెళ్తున్న కారు హఠాత్తుగా వేగం తగ్గడంతో ప్రమాదానికి గురైంది. కారులోని సేఫ్టీ బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. బొంతల రాజేశ్‌తోపాటు కారులో ప్రయాణిస్తున్న నాయకులు తిప్పారపు శ్రీనివాస్, ఓదెలు, తిరుపతి సురక్షితంగా బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. అప్పటికే హైదరాబాద్‌లో ఉన్న కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకుడు పాతిపెల్లి ఎల్లయ్య వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. రాజేశ్‌తోపాటు మిగతా వారిని తమతో మరో కారులో హైదరాబాద్ తీసుకెళ్లారు. ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రి శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యానగర్‌లో మూడిళ్లలో చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌లో తాళాలు వేసిన మూడిళ్లలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. విద్యానగర్‌కు చెందిన మూడు కుటుంబాలు ఇళ్లకు తాళాలు వేసి పని నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లారు. దొంగలు ఆ ఇళ్ల తాళాలు పగులగొట్టి ఇంట్లోని వస్తువులను చిందర వందర చేశారు. ఇంట్లో విలువైన వస్తువులు లేకపోవడంతో బాధితులు ఊపిరిపీల్చుకున్నారు. పట్టణ ఎస్సై మన్మథరావు దొంగతనం జరిగిన ఇళ్లను పరిశీలించి వేలిముద్రలను సేకరించారు.

రెండు ఆలయాల్లో చోరీ

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరంలోని శ్రీహనుమాన్, మల్లికార్జునస్వామి ఆలయాల్లో ఆదివారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. రెండు ఆలయాల్లోని హుండీలను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలలో నిక్షిప్తమైంది.

అవార్డులు వారి సొంతం

- సామాజిక సేవలో ఒకరు.. • సాహిత్య సృజనతో మరొకరు.. • ఫొటోగ్రఫీ, కళారంగంతో ఇంకొకరు.. • కృషికి గుర్తింపుగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అవును.. వారు నిజమైన సమాజ ప్రేమికులు. ఒకరు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పంపిణీ చేస్తుండగా.. మరొకరు సాహిత్య సృజనతో బాలల మేధస్సుకు అవసరమైన కథలు, కవితలు రాస్తున్నారు.. ఇంకొకరు కార్వింగ్ ఆర్ట్, మరొకరు తన కెమెరాతో అద్భుత కళాఖండాలను సృష్టిస్తున్నారు. ఇలా ఎల్లారెడ్డిపేటకు చెందిన దుంపెన రమేశ్, వాసరవేణి పర్శరాములు, శ్యామంతుల అనిల్, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి.. తాము ఎంచుకున్న రంగాల్లో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. వారి గురించి ప్రత్యేక కథనం.

మొక్కల స్నే'హితుడు'.. రమేశ్


ఇంటింటికి వెళ్లి మొక్కలు పంపిణీ చేస్తున్న దుంపెన రమేశ్

ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన దుంపెన రమేశ్ వృత్తిరీత్యా స్వర్ణకారుడు. ఉపాధి కోసం రేడియో మెకానిక్ రంగాన్ని ఎంచుకున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, పెరుగుతున్న కాలుష్యంపై తరచూ స్నేహితులతో చర్చించేవారు. పర్యావరణ పరిరక్షణ కోసం తనవంతుగా ఏదైనా చేయాలని ఆలోచించేవారు. ఈక్రమంలో మొక్కలను పంపిణీ చేస్తూ.. వాటిని పెంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. పదమూడేళ్లుగా ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రతీ గ్రామానికి వెళ్లి మొక్కలు పంపిణీ చేస్తున్నారు. మొక్కల పంపిణీతో కలిగే లాభాల గురించి పల్లెప్రజలకు వివరిస్తున్నారు. మొక్కల పంపిణీ కోసం తాను సొంతంగా రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. ఇలా రమేశ్ చేస్తున్న కృషిని గుర్తించిన పలు స్వచ్ఛంద సంస్థలు పురస్కారాలతో సన్మానించాయి. పర్యావరణ సేవారత్న, హరితమిత్ర, మహానంది, ఆచార్య జయశంకర్, స్ఫూర్తి శిఖరం, విరాట్ విశ్వకర్మ సేవారత్న జాతీయ అవార్డులు అందుకున్నారు.

బాలసాహిత్యకారుడు.. పర్శరాములు



ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామానికి చెందిన వాసరవేణి పర్శరాములు ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. బాలసాహిత్యంలో రచనలతో పరిశోధనలు చేస్తున్న నిరంతర కృషికి అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి. బాలసాహిత్యంలో పీహెచ్‌డీ పట్టాను పొందారు. బాలల సాహిత్యంపై పలు పుస్తకాలు ప్రచురించారు. తాజాగా పెద్దోట బాలసాహిత్య విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. దీంతో పలు స్వచ్ఛంద సంస్థలు అనేక పురస్కారాలు అందించాయి. బాల్యాన్ని చక్కగా మలిస్తేనే మంచి సమాజం నిర్మాణమవుతుందనే సంకల్పంతో బాలల కోసం రచనలు చేస్తున్నట్లు చెప్పారు. ఇలా..చుక్ చుక్ రైలు, చల్‌చల్ గుర్రం, చిర్రగోనే, చెట్టిర్క, నారుమడి, గొర్రెపిల్ల, కర్రెద్దు, మట్టిలో మాణిక్యం, చైతన్యమూర్తి వంటి బాలల పుస్తకాలు ప్రచురించారు.

కెమెరాతో అద్భుతాలు.. ప్రభాకర్ సొంతం



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ముత్యాల ప్రభాకర్‌రెడ్డి వృత్తిరీత్య ఫొటోగ్రాఫర్. తనకున్న కళపై మక్కువతో ఫొటోగ్రఫీలో కొత్తదనాన్ని తెచ్చేందుకు నిత్యం కృషి చేస్తున్నాడు. పల్లెప్రజల జీవన విధానాలను తన కెమెరాలతో బంధించడంలో ప్రభాకర్ సిద్ధహస్తుడు. ఫొటోగ్రఫీలో వినూత్నంగా ప్రయత్నించేందుకు ప్రభాకర్ వివిధ రాష్ట్రాలలో పర్యటిస్తుంటారు. ఆ యా ప్రాంతాల్లోని సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లుగా ఫొటోలు తీయడం ఆయన నైజం. ఫొటోగ్రఫీలో ప్రభాకర్ చేస్తున్న ప్రయోగాలు, కృషిని గుర్తించి అనేక స్వచ్ఛంద సంస్థలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులతో సన్మానించాయి. ఇటీవల తెలుగు–వెలుగు విశిష్ట కళారత్న జాతీయ అవార్డుతో సత్కరించాయి. 1998లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి బండి రాజన్‌బాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు . అప్పటి నుంచి ప్రభాకర్ అవార్డుల ప్రస్థానం ఇప్పటికీ ఏ కాంపిటీషన్ జరిగిన అందులో పాల్గొని అవార్డు అందుకోవడం పరిపాటిగా మారింది.


ముత్యాల ప్రభాకర్‌రెడ్డి తీసిన ఫొటో


అనిల్ కళాసృష్టి.. అయోధ్య రామమందిరం

కార్వింగ్ కళ.. అనిల్ భళా..


శ్యామంతుల అనిల్

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్‌కుమార్ వృత్తిరీత్యా ఆర్టిస్ట్. తాను ఎంచుకున్న రంగంలో వినూత్నంగా ప్రయత్నించాలనే ఉద్దేశంతో కార్వింగ్ కళను నేర్చుకున్నాడు. పదేళ్ల క్రితం దుబాయ్ వెళ్లిన అనిల్.. అక్కడ చూసిన కార్వింగ్ ఆర్ట్‌ను నేర్చుకున్నాడు. అందులో విభిన్నంగా ప్రయత్నించేందుకు నిత్యం కృషి చేస్తున్నాడు. ప్రత్యేక రోజులు, పండుగలు, ఉత్సవాల సమయంలో ఆయా సందర్భాలను బట్టి తన కార్వింగ్‌తో ఆకట్టుకునే కళారూపాలను సృష్టిస్తుంటాడు. ఇలా మహాశివరాత్రికి పుచ్చకాయపై శివుడి రూపం, అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠను పరస్కరించుకొని గుమ్మడికాయ, క్యారెట్లతో రామ మందిరాన్ని తయారు చేశారు. అంతేకాకుండా మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్సార్, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ పుట్టిన రోజుల సందర్భంగా వారి రూపాలను పుచ్చకాయలపై చెక్కి శభాష్ అనిపించుకున్నారు. ఇలా అనిల్ కళాఖండాలకు అనేక అవార్డులు వచ్చాయి. ఇటీవల విశిష్ట స్ఫూర్తి చిత్రకళారత్న జాతీయ అవార్డు అందుకున్నారు. గతంలోనూ పలు స్వచ్ఛంద సంస్థలు అవార్డులతో సన్మానించాయి.


చామనపల్లిలో చిన్నారికి చుక్కలు వేస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య


బావుపేటలో పోలియో చుక్కలు వేస్తున్న కొత్తపల్లి ఎంపీపీ శ్రీలత


దుర్శేడ్‌లో చుక్కలు వేస్తున్న వైద్యసిబ్బంది

పోలియోను నిర్మూలిద్దాం


పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ షర్ఫుద్దీన్

కొత్తపల్లి: పోలియో నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ పిల్లి శ్రీలతమహేశ్ అన్నారు. కొత్తపల్లి మండలం బావుపేట హెల్త్ సెంటర్‌లో ఆదివారం పోలియో చుక్కలు వేసి క్యాంప్‌ను ప్రారంభించారు. 0–5 ఏళ్ల చిన్నారులకు రెండు చుక్కల మందు వేసి భావితరాలు అంగవైకల్యం బారినపడకుండా రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కమల మనోహర్, గ్రామ ప్రత్యేకాధికారి రంజిత్ కుమార్, వైద్యులు మౌనిక, వనజ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎస్‌ఎం శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ మండలంలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో విజయవంతమైంది. చామనపల్లిలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య చిన్నారికి పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. గోపాల్‌పూర్‌లో వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఎంపీవో సీహెచ్.జగన్మోహన్‌రెడ్డిలు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కరీంనగర్ మండలంలో మొత్తం 2,650 మంది చిన్నారులుండగా ఆదివారం 2,374 మందికి పోలియో చుక్కలు వేసినట్లు చామనపల్లి పీహెచ్‌సీ వైద్యులు మనోహర్ తెలిపారు. మిగిలిన 276 మంది చిన్నారులకు సోమ, మంగళవారాల్లో వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తారని వివరించారు.

47వ డివిజన్‌లో..

విద్యానగర్(కరీంనగర్): నగరంలోని 47వ డివిజన్ పరిధిలోని రిషి కాన్వెంట్ స్కూల్, గ్రీన్‌లాండ్ స్కూళ్లలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో కార్పొరేటర్ మహ్మద్ శర్ఫుద్దీన్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలియో రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, మంజుల, ఆర్పీలు రమాదేవి, ప్రవళిక పాల్గొన్నారు.


గోపాల్‌పూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీవో



గరుడ హోమం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాల సమీపంలో గల భక్తాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణంలో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు జగన్నాథ విష్ణుశర్మ ఆధ్వర్యంలో గరుడ హోమం నిర్వహించి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామస్తులు, భక్తులు, పురప్రముఖుల సమక్షంలో వేద పండితులైన బ్రాహ్మణులు ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం ఆలయ నిర్మాణ పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు ఓ కమిటీగా ఏర్పడి సేకరించిన విరాళాలతో నిర్మాణ పనులు చేపడుతున్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

కరీంనగర్‌క్రైం: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలభద్రతా చర్యల్లో భాగంగా కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్‌లు, వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ ఈ డ్రైవ్‌లో వాహనంలో పేషెంట్లు లేనప్పటికీ సైరన్ వాడుతూ రోడ్లపై తిరుగుతున్న అంబులెన్సులపై దృష్టి పెట్టామన్నారు. అవి వాడే వాహనాలను గుర్తించి పట్టుకున్నామని తెలిపారు. అంబులెన్సు వాహన డ్రైవర్లు రోగులను తరలించే సమయంలో మాత్రమే ఎమర్జెన్సీ సైరన్ వాడాలని సూచించారు. పట్టుబడిన అంబులెన్సుకు ఈ–చలాన్ ద్వారా జరిమానా విధించామన్నారు. తనిఖీల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్, ఖరీముల్లాఖాన్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఇషాక్, నీలవేణి రాజు, శనిగల శ్రీకాంత్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన అంబులెన్స్

పోచమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం

కరీంనగర్‌రూరల్:: కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం పెంపొందుతోంది. గతేడాది దాతల సాయంతో శ్రీమరకత లింగ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇటీవల ఆలయ మొదటి వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న బంగారు పోచమ్మ ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భక్తుల విజ్ఞప్తి మేరకు దుర్శేడ్ సింగిల్‌విండో మాజీ చైర్మన్ కోరుకంటి వేణుమాధవరావు సుమారు రూ.10లక్షల వ్యయంతో నూతనంగా పోచమ్మ ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. మాజీ సర్పంచ్ గాజుల అంజయ్య పర్యవేక్షణలో వారం రోజుల క్రితం నిర్మాణపు పనులు ప్రారంభించారు. ఈనెల 15న స్లాబ్ వేసేందుకు వీలుగా శరవేగంగా నిర్మాణపు పనులను పూర్తి చేస్తున్నారు. ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం పోచమ్మ విగ్రహప్రతిష్టాపనతో పాటు బొడ్రాయి ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సింగిల్‌విండో మాజీ చైర్మన్ వేణుమాధవరావు తెలిపారు.


నిర్మాణంలో ఉన్న పోచమ్మ ఆలయం

ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు హర్షణీయం

కరీంనగర్: తెలంగాణ విముక్తి, దొరల దోపిడీ పాలన అంతం కోసం అలుపెరగని పోరాటం చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తామనడం హర్షణీయమని రజక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుబ్బాక రమేశ్ అన్నారు. ఆదివారం మంకమ్మతోటలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని కొన్నేళ్లుగా చేస్తున్న విజ్ఞప్తిని గత పాలక ప్రభుత్వాలు మాట ఇచ్చి తప్పాయన్నారు. శ్రీపాదరావు జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహంఏర్పాటు చేస్తామని ప్రకటించడంపై రజక సంఘాల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. సమాజంలో అణిచివేతకు గురవుతున్న రజకజాతి ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో రజక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్తకొండ రాజయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమేశ్

గంజాయి పట్టివేత

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం వద్ద గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రవి వివరాల ప్రకారం.. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన కొనగాని మధు, మానకొండూర్ మండలం గంగిపెల్లికి చెందిన బల్ల వెంకటేశ్ ఆదివారం అంబేద్కర్ స్టేడియం వద్ద గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారు. పోలీసులను చూసి పరుగు తీయడంతో వారిని పట్టుకొని 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి జైలుకు పంపించినట్లు ఎస్సై తెలిపారు.



జీరో విద్యుత్ బిల్లులు వచ్చేశాయ్

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకం ఆదివారం నుంచి అమల్లోకి వచ్చింది. ఎన్పీడీసీఎల్ అధికారులు కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలో జీరో బిల్లులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించారు. మొత్తం 53,011గృహ విద్యుత్ కనెక్షన్లుండగా గృహజ్యోతికి 17,503 కనెక్షన్లకు అవకాశం కల్పించారు. ఏడీఈ కె.రాజు బిల్లింగ్ సిబ్బందితో కలిసి ఆదివారం రేకుర్తిలో వినియోగదారులకు జీరో బిల్లులను అందించారు. ఫిబ్రవరి నెలలో వాడిన విద్యుత్‌ను లెక్కించి బిల్లింగ్ చేసే సిబ్బంది 200 యూనిట్లలోపు ఉంటే జీరో బిల్లులు జారీ చేస్తున్నారు.

సబ్సిడీ ఇలా వర్తిస్తుంది..

ప్రతీనెల విద్యుత్ సిబ్బంది వినియోగదారుల ఇంటికి వచ్చి మీటర్ రీడింగ్ నమోదు చేస్తారు. మొత్తం వాడిన యూనిట్లు, అందుకయ్యే చార్జి, సేవా రుసుం, విద్యుత్‌సుంకం తదితర వివరాలను నమోదు చేస్తారు.200 యూనిట్ల లోపుంటే గృహజ్యోతి కింద సబ్సిడీ ఎంత అనేది ఉంటుంది. అనంతరం నికర బిల్లు దగ్గర సున్నా చూపిస్తోంది. ఒకవేళ 201 యూనిట్లు వస్తే వినియోగదారులు పూర్తి బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ యూనిట్ల వినియోగాన్ని బట్టి నెలనెలా లబ్ధిదారుల సంఖ్య మారుతుంటుంది.


మహిళకు జీరో బిల్లు రశీదు ఇస్తున్న ఏడీఈ రాజు

అర్హులకు మరో అవకాశం

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, మీటర్ నంబర్ వివరాలను విద్యుత్‌శాఖకు ఇచ్చిన వారందరికీ గృహజ్యోతి పథకం వర్తిస్తుంది. అర్హతలున్న వారు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముంది.

– కె.రాజు, ట్రాన్స్‌కో రూరల్ ఏడీఈ

క్లుప్తంగా

ఎమ్మెస్సీ బాటనీ ఫలితాల్లో ‘జహర’కు ప్రథమ ర్యాంకు


సర్టిఫికెట్ అందుకుంటున్న బదర్ జహర

కొత్తపల్లి: శాతవాహన విశ్వవిద్యాలయం ప్రకటించిన ఎమ్మెస్సీ బాటనీ ఫలితాల్లో కొత్తపల్లికి చెందిన విద్యార్థిని బదర్ జహర యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా జహరను వర్సిటీ సైన్స్ కళాశాల ప్రధాన అధ్యాపకుడు జయంతి అభినందించారు. అధ్యాపకులు దిశా నిర్దేశంతో బంగారు పతకం సాధించానని, భవిష్యత్‌లో వివిధ రకాల వృక్ష జాతులపై పరిశోధన చేస్తానని ఆ విద్యార్థిని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర అధ్యాపకులు ఈట నర్సింహామూర్తి, ఈట కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెస్ పోటీలు


చెస్ ఆడుతున్న విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థుల్లోని క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆదివారం అంతర్గత చదరంగ పోటీలు నిర్వహించారు. మూడు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కంకటి కనుకయ్య, కోచ్ అనూప్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టించొద్దు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో కృత్రిమ కొరత సృష్టించొద్దని డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చాలా ప్రాంతాల్లో నీటి సరఫరా తగ్గించారని, ఇది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసే కుట్ర అని ఆరోపించారు. ఇలాంటి కుట్రలు మేయర్, ఎమ్మెల్యే మానుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతీరోజు తాగునీటి సరఫరా చేయాలని లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దొంతి గోపీ, కూడల శిరీష్ పాల్గొన్నారు.

యువత లక్ష్యసాధనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న కుతాడి తిరుపతి

విద్యానగర్(కరీంనగర్): యువత, విద్యార్థులు లక్ష్య సాధన కోసం కృషి చేయాలని ఇంపాక్ట్ డైరెక్టర్ కుడాడి తిరుపతి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని షెడ్యూల్ కులాల కళాశాల విద్యార్థుల వసతి గృహంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. యువత తీసుకునే నిర్ణయాలే వారి జీవితాన్ని మలుపు తిప్పుతాయన్నారు. అందరికీ రోల్ మోడల్‌గా నిలవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ విజయలక్ష్మి, ఇంపాక్ట్ స్పీకర్ సాయిబాబు, ట్రైనర్ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.




మొగ్ధుంపూర్‌లో వ్యవసాయబావిలో పూడిక తీస్తున్న రైతులు, నీళ్లు లేక ఎండిన ఎస్సారెస్పీ కాలువ, నల్లగుంటపల్లిలో కొత్తబోరు బిగిస్తున్న రైతు సంపత్

- అందని ఎస్సారెస్పీ కాలువ నీరు
- ఎండుతున్న పంటలతో రైతుల ఆందోళన
- వ్యవసాయబావుల్లో పూడికతీత పనులు

అడుగంటిన భూగర్భ జలాలు


మొగ్ధుంపూర్‌లో ఎండిన వరిపంట

కరీంనగర్‌రూరల్: సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయి. వ్యవసాయబావుల్లోని నీరు అడుగంటాయి. ఎస్సారెస్పీ నీళ్లు రాకపోవడంతో ఆయకట్టు పరిధిలోని బావులన్నీ నీరులేక వట్టిపోతున్నాయి. యాసంగి సీజన్‌లో ఎన్నో ఆశలతో కరీంనగర్ మండలంలో పంటలను సాగు చేసిన రైతులను ప్రస్తుతం సాగునీటి కొరత వేధిస్తోంది. వరి 2,368, మొక్కజొన్న 558 ఎకరాల్లో సాగు చేశారు.

ఎండుతున్న ఆయకట్టు

ఎస్సారెస్పీ ఆయకట్టులోని పంటలన్నీ నీళ్లందక ఎండిపోతున్నాయి. పెద్దపల్లి జిల్లాకు డీ86 ప్రధానకాలువ ద్వారా అధికారులు ఎక్కువ నీటిని విడుదల చేస్తూ కరీంనగర్ మండలాన్ని పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా డీ89 కాలువ పరిధిలోని మొగ్ధుంపూర్, చెర్లభూత్కూర్, ఇరుకుల్ల, చేగుర్తి, నల్లగుంటపల్లి, సాంబయ్యపల్లి, గొల్లపల్లి గ్రామాలకు నీరందడం లేదు. ఆయా గ్రామాలకు ఎస్సారెస్పీ నీరు రాకపోవడంతో పాటు బావుల్లో నీరు అడుగంటడంతో వందలాది ఎకరాల్లోని వరిపంట ఎండిపోతోంది. ఇప్పటివరకు ఎస్సారెస్పీ అధికారులు ఐదు తడులిచ్చినప్పటికీ నగునూరు, జూబ్లీనగర్ వరకే నీళ్లు రాగా ఆయకట్టు చివరిగ్రామాలకు నీరందలేదు. ఇప్పటికైనా ఎస్సారెస్పీ అధికారులు ఆయకట్టు చివరిగ్రామాలకు నీరందించి పంటలు ఎండిపోకుండా తగిన చర్యలు చేపట్టాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయబావుల్లో పూడికతీత

వేసవికాలం ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. నాలుగైదు రోజుల నుంచి ఎండ తీవ్రత మరింత పెరిగింది. ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వ్యవసాయబావులు నీరు లేక బావురుమంటున్నాయి. బోర్లు ఎత్తిపోయాయి. వేసవి ప్రారంభంలోనే ఈ పరిస్థితి ఉండటంతో సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. పలువురు రైతులు బావుల్లో పూడిక తీయిస్తున్నారు. సైడ్‌బోర్లు వేయిస్తున్నారు. కొందరు రైతులు కొత్తగా అదనపు బోర్లను వేస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు సాగునీటికోసం చేస్తున్న ప్రయత్నాలతో అదనపు ఆర్థికభారంపడుతుందని నల్లగుంటపల్లికి చెందిన రైతులు సంపత్, రమేశ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.

ఐక్య ఉద్యమాలతోనే రాజ్యాధికారం

విద్యానగర్: ఐక్య ఉద్యమాలతోనే కాపులకు రాజ్యాధికారం వస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చింతకుంట విఠల్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర కార్యవర్గ ఆత్మీయ సత్కారంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాల శ్రీనివాస్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండి వద్మ, వైద్యులు సాయినరేందర్, ఇంజినీర్ అన్నారెడ్డి. తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సత్కారంలో పాల్గొన్న నాయకులు

మొదటి ప్రయత్నంలోనే మూడు ఉద్యోగాలు

కరీంనగర్: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న గంగాధర మండలం బూర్గుపల్లికి చెందిన ఆడెపు మాధవి ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గురుకుల ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలు మొదటి ప్రయత్నంలోనే సాధించారు. మూడు ఉద్యోగాలు సాధించడంపై మాధవిని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.


ఆడెపు మాధవి

బీజేపీ నాయకుల సంబరాలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్‌కుమార్‌ను ప్రకటించడంతో ఆదివారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో దుర్శేడ్‌లో సంబరాలు నిర్వహించారు. బీజేపీ నాయకులు బ్యాండ్ బాజాలను వాయిస్తూ టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎంపీగా బండి సంజయ్‌కు రెండోసారి అవకాశమివ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజలందరూ బీజేపీని గెలిపించి మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి, నాయకులు రమేశ్, ప్రవీణ్, సత్యం, ఓదెలు, దేవేందర్, శ్రీనివాస్, మల్లేశం, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.


దుర్శేడ్‌లో సంబరాల్లో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు

ఎంపీ సంజయ్‌కి సన్మానం

కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్‌ను బీజేపీ అధిష్టానం రెండోసారి ప్రకటించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ప్రజాహిత యాత్ర చేపట్టిన బండి సంజయ్‌ను బీజేపీ మండల నాయకులు కలిసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాశం తిరుపతి, కాల్వ రాంచంద్రం, ఆసిరి తిరుపతి, దాది సుధాకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ కార్యవర్గం


కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యానగర్‌లోని పీవీ నరసింహారావు వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హనుమాన్ రఘుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొండా రవీందర్, ఉపాధ్యక్షులిగా మిరియాల శ్రీధర్‌రెడ్డితో పాటు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉండాలి

కరీంనగర్‌టౌన్: నేటి యువత సోషల్ మీడియాలో మరింత క్రియాశీలకంగా ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ కరీంనగర్ విభాగ్ సంఘ్ చాలక్ భీమనాథుని శంకర్ అన్నారు. ఆదివారం నగరంలోని ఫిలింభవన్‌లో సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సోషల్ మీడియా సంగమంలో మాట్లాడారు. సీనియర్ జర్నలిస్ట్ సురేశ్ కొచ్చాటిల్ మాట్లాడుతూ విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు. సామాజిక కార్యకర్త కట్టా రాజగోపాల్ మాట్లాడుతూ భారతదేశ సాంస్కృతిక మూలాలు గొప్పవని వాటిని ప్రస్తుతతరం వారు ఖచ్చితంగా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు నిరంజనాచారి, ఎలగందుల సత్యనారాయణ, సమాచార భారతి కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భీమనాథుని శంకర్

మెరిట్ లిస్ట్ ఆధారంగా ఖాళీలు భర్తీ చేయాలి

కరీంనగర్: గురుకుల నియామకాల్లో ఖాళీలను మెరిట్ లిస్ట్ ఆధారంగా భర్తీ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల సందర్భంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో ప్రతిభావంతులైన విద్యార్థులు ఎక్కువ మంది డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ సెలెక్ట్ అయ్యారన్నారు. అభ్యర్థులు తమ ఇష్టమైన పోస్టును ఎంపిక చేసుకున్న తర్వాత వదిలేసిన ఖాళీలను 1:2లో మెరిట్ ఆధారంగా నింపితే న్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. లేకుంటే పోస్టులు అన్నీ వచ్చే నోటిఫికేషన్‌లో ఇస్తామనడం ప్రభుత్వం తప్పించుకోవడం, కాలయాపన చేయడం అవుతుందన్నారు. ప్రతీ మెరిట్ లిస్ట్ అభ్యర్థికి కూడా ఉద్యోగం అందేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకొని అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రాజకీయాల్లో తెలుగు వారేరీ?

- గతంలో సంజీవరెడ్డి, పీవీ, ఎన్టీఆర్ జాతీయ రాజకీయాలను శాసించారు
- జైపాల్‌రెడ్డి, వెంకయ్య నాయుడు కొంత నిలబెట్టారు
- ఇప్పుడు తెలుగువారి అంశాల గురించి ఢిల్లీలో మాట్లాడేందుకు ఎవరూ కనిపించని స్థితి
- గవర్నర్‌పేట్ టు గవర్నర్స్ హౌస్ పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి



'గవర్నర్‌పేట్ టు గవర్నర్స్ హౌస్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డీజీపీ రవిగుప్తా, రామ్మోహన్‌రావు, రంగయ్య నాయుడు, శశాంక్ గోయల్

సాక్షి, హైదరాబాద్: జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర కాలక్రమంగా తగ్గుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 'గతంలో సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, ఎన్టీఆర్ జాతీయ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. వారి తరువాత జైపాల్‌రెడ్డి, వెంకయ్య నాయుడు ఆ స్థాయిని కొంతవరకు నిలబెట్టారు. కానీ ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో తెలుగువారి పాత్ర కనిపించడం లేదు. ఫుల్‌టైం బిజినెస్‌లు చేసేవాళ్లు రాజకీయాల్లోకి పార్ట్‌టైంగా రావడమే ఇందుకు కారణం కావొచ్చు. ఇది మన మనుగడకు, గుర్తింపునకు మంచి పరిణామం కాదు'అని సీఎం పేర్కొన్నారు. మాజీ డీజీపీ, తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహన్‌రావు రచించిన 'గవర్నర్‌పేట్ టు గవర్నర్స్ హౌస్'పుస్తకావిష్కరణ ఆదివారం సాయంత్రం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఢిల్లీలో తెలుగువారి అంశాల గురించి పార్లమెంటరీ వ్యవస్థలో మాట్లాడేందుకు, విజ్ఞప్తి చేసేందుకు ఎవరూ కనపించని పరిస్థితి నెలకొందన్నారు.

దేశ పరిపాలనలో మన పాత్ర ఉండాలి..

'జాతీయ స్థాయిలో హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు. జాతీయ స్థాయిలో మన భాష రెండో స్థానంలో ఉన్నట్లుగానే దేశ పరిపాలనలో, నిర్ణయాల్లో మన పాత్ర ఉండాలి. గతంలో ప్రధాని పదవి ఉత్తరాది వారికి ఇస్తే రాష్ట్రపతి దక్షిణాది నుంచి అయ్యేవారు. ఇక్కడి వారు ప్రధాని అయితే ఉత్తరాది నేతకు రాష్ట్రపతి అవకాశం దక్కింది. అలాగే కేంద్ర కేబినేట్‌లోనూ గతంలో కనీసం ముగ్గురు కీలక మంత్రులు దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉండేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. కేంద్ర కేబినెట్‌లో మనవాళ్లను వెతికి చూసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. దీనికి కారణాలు విశ్లేషించి ఏం చర్యలు తీసుకోవాలన్నది అనుభవజ్ఞులైన రిటైర్డ్ అధికారులు రాజకీయాలకు అతీతంగా ఆలోచించి సూచించాలి. విలువైన సలహాలు, సూచనలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. జాతీయ స్థాయిలో మన ప్రాభవం చాటేలా మళ్లీ మనమంతా కలిసి ప్రయాణం మొదలు పెట్టాల్సిన అవసరం ఉంది'అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కీలక అంశాలతో మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు రాసిన పుస్తకం పొలిటికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా మారుతుందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

కీలక పరిణామాలను పుస్తకంలో ప్రస్తావించా: రామ్మోహన్‌రావు

తాను రచించిన పుస్తకం ఎన్నో వెలుగులోకి రాని చారిత్రక అంశాలకు వేదికగా నిలుస్తుందని తమిళనాడు మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన కీలక పరిణామాలను ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. కేంద్ర మాజీ మంత్రి రంగయ్య నాయుడు ఐపీఎస్ అధికారిగా, రాజకీయ నాయకుడిగా తన అనుభవాలు, నాటి పరిస్థితులను పంచుకున్నారు. కార్యక్రమంలో డీజీపీ రవిగుప్తా, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డీజీ శశాంక్ గోయల్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, పలువురు రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌లు, సీనియర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గుట్టలెక్కి.. పోలియో చుక్కలు వేసి..



నడిచి వెళ్తున్న వైద్య సిబ్బంది



పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది

వాజేడు: ఇద్దరే ఇద్దరు పిల్లలున్న గ్రామమది. అయితేనేం.. దారిలేని ఆ గ్రామానికి వైద్య సిబ్బంది గుట్టలెక్కి నడిచి వెళ్లారు. పోలియో చుక్కలు వేసి వచ్చారు. ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల జీపీ పరిధి పెనుగోలు గ్రామం గుట్టలపై ఉంది. అక్కడికి వెళ్లాలంటే మండల కేంద్రం నుంచి 16 కిలోమీటర్ల దూరం. అంతా రాళ్ల దారి. ఈ గ్రామంలో అయిదేళ్ల లోపు పిల్లలు ఇద్దరున్నారు. పల్స్ పోలియోలో భాగంగా ఆ చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి వాజేడు పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు, లఖాన్, ధర్మయ్య ఆదివారం కాలినడకన అక్కడికి చేరుకున్నారు. ఇద్దరు పిల్లలకు పోలియో చుక్కలు వేసి భోజనం చేసి తిరిగి పీహెచ్‌సీకి చేరుకున్నారు.

విరిగిన స్టీరింగ్ రాడ్..

- పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



పొలంలోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

చెన్నారావుపేట: వరంగల్ జిల్లాలో స్టీరింగ్ రాడ్ విరగడంతో ఆర్టీసీ బస్సు పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహాడ్ శివారులో ఆదివారం ఈ ఘటన జరిగింది. నర్సంపేట డిపో నుంచి ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు మండల పరిధిలోని బోజేర్వు గ్రామానికి వెళ్లింది. అక్కడి నుంచి 30 మంది ప్రయాణికులతో నర్సంపేటకు వస్తున్న క్రమంలో తిమ్మరాయినిపహాడ్ శివారుకు రాగానే బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోయింది. దీంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకుపోయింది. అందులో బురద ఉండటంతో బస్సు కూరుకుపోయి పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి క్షతగాత్రులను నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

విగ్రహాల ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

- తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్‌లు మాట్లాడుతూ.. ట్యాంక్‌బండ్‌పైన దళిత, బహుజన విప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం గొప్ప పరిణామం అని, అందుకు గౌడ జాతి తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి, సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్, పోతగాని ఐలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మంత్రి పొన్నం ప్రయాణం

- ఇయర్ ఫోన్ పెట్టుకున్న డ్రైవర్‌పై ఆగ్రహం



మహిళా కండక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

షాద్‌నగర్ (హైదరాబాద్)/జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన గౌడ సంఘం సమావేశానికి వెళ్లేందుకు.. ఆయన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వరకు బస్సులో ప్రయాణించారు. నారాయణపేట డిపో బస్సు ఎక్కిన మంత్రి మహిళా ప్రయాణికులతో ముచ్చటించారు. డ్రైవర్ ఇయర్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న విషయాన్ని గమనించిన పొన్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బస్సులోని మహిళా కండక్టర్‌ను ఈ విషయమై అడిగారు. డ్రైవర్ చెవిలో ఇయర్ ఫోన్లు పెట్టుకొని తమాషా చేస్తున్నాడా?.. అలా మాట్లాడితే సస్పెండ్ అవుతాడు తెలుసా?.. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరికాదు కదా? అన్నారు. 'కాంగ్రెస్ సర్కార్ ఆయా.. ఏ సబ్ కా సర్కార్ హై'.. అంటూ ఓ ముస్లిం ప్రయాణికురాలితో మంత్రి ముచ్చటించారు. పెన్షన్ వస్తుందా? అని ప్రశ్నించగా.. రావడం లేదని చెప్పడంతో దరఖాస్తు చేసుకున్నావా? అని అడిగారు. లేదని ఆమె చెప్పడంతో వెంటనే దరఖాస్తు చేసుకోమని మంత్రి పొన్నం సూచించారు.

కాంగ్రెస్ డబుల్ ఇంజన్ సర్కారు రావాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉందని.. అదే విధంగా కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే డబుల్ ఇంజన్ సర్కారుతో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంఘం ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రెండు చోట్ల ఆప్ పోటీ

కవాడిగూడ (హైదరాబాద్): ఆమ్ ఆద్మీపార్టీ తెలంగాణలో రెండు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ఈడీ, సీబీఐలను ఉపయోగించి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే ఇండియా కూటమి దెబ్బ తింటుందని మోదీ కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానాలలో పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించిందని గుర్తు చేశారు.

మనుషులు-జంతువుల మధ్య సంఘర్షణ తగ్గాలి

- ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం మనుషులు, జంతువుల మధ్య సంఘర్షణ పెరుగుతోందని, జంతు ఆవాసాల్లో మనుషుల చొరబాట్ల వల్లే ఈ సమస్య వస్తోందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. దీనిని వీలైనంతగా తగ్గించటం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. అటవీ నేరాల అదుపునకు, వన్యప్రాణుల వేట, స్మగ్లింగ్ నివారణకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఆదివారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా ఇచ్చిన సందేశంలో...' పర్యావరణ సమతుల్యత, జంతుజాలం, మనుషుల జీవనం పరస్పర ఆధారాలు. ఇందులో ఏ ఒక్కటి లోపించినా మిగతా వాటి జీవనంపై ప్రభావం పడుతుందన్న విషయాన్ని అందరూ గ్రహించాలని, బాధ్యతతో మెలగాలని ఆశిస్తున్నాను'అని తెలిపారు. ఎండాకాలం జంతువులు, పక్షుల నీటి వసతికి వీలైనంతగా అందరూ సహకరించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పర్యావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని, వన్యప్రాణుల మనుగడ, రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఏటా మార్చి 3న ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలియజేశారు. సాంకేతిక అభివృద్ధి, కొత్త ఆవిష్కరణలను వన్యప్రాణుల రక్షణ కోసం వాడాలనే సంకల్పంతో ఈ యేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని (వరల్డ్ వైల్డ్ లైఫ్ డే) జరుపుకుంటున్నామని మంత్రి వెల్లడించారు.

విప్లవకారులంతా ఏకం కావాలి

- ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి
- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ బహిరంగ సభలో వక్తలు
- యూనిటీ మహాసభ సందర్భంగా ఖమ్మంలో భారీ ప్రదర్శన

ఖమ్మం మయూరి సెంటర్: దేశంలో ప్రజాస్వామ్య హక్కులు హరించుకుపోతున్న తరుణంలో మతతత్వ, నియంతృత్వ, పెట్టుబడిదారీ శక్తులపై ఉద్యమించేందుకు కమ్యూనిస్టు విప్లవకారులంతా ఏకం కావాలని సీపీఐ (ఎంఎల్) ఆర్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్ పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీలైన సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీసీపీఐ (ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) ఆర్‌ఐ ఒకే పార్టీగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పేరిట అవతరించింది. ఈ సందర్భంగా ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ యూనిటీ మహాసభలో ప్రదీప్‌సింగ్ ప్రసంగిస్తూ మూడు విప్లవ పార్టీలు ఒకే పార్టీగా ఏర్పడటాన్ని చరిత్మాత్మకంగా అభివర్ణించారు. దేశంలో హిందుత్వం పేరుతో ఆదివాసీలు, గిరిజనులు, ముస్లిం, మైనారిటీలపై దాడులు చేస్తున్నారని... అందువల్ల ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నియంతృత్వ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకొని చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, ప్రజాస్వామిక శక్తులపై దాడులు చేస్తున్నారని దుయ్యబట్టారు. పాలస్తీనాపై దాడి చేసిన ఇజ్రాయిల్‌కు మద్దతు ఇచ్చిన మోదీకి.. మణిపూర్‌లో మహిళలపై దాడులు, విధ్వంసం జరిగినా అక్కడ పర్యటించేందుకు సమయం దొరకలేదని విమర్శించారు. రైతులకు భరోసా ఇస్తామన్న మోదీ.. ఢిల్లీ సరిహద్దులో రైతులపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెచ్చల రంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో జాతీయ, రాష్ట్ర నాయకులు సుభాష్ దేవ్, సంజయ్ సింఘ్వీ, దినేష్ గోహైన్, కేజీ రామచందర్, కె.రమ, ఆర్.చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, జీవన్ కుమార్, రవిబాబు, త్రివేది తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన ఎర్రదండు: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ యూనిటీ మహాసభ సందర్భంగా ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. వేలాది మంది నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. దేశ, విదేశాల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొనగా డప్పు నృత్యాలు, కోలాట ప్రదర్శనలు, కొమ్ము నృత్యాలు, గిరిజన కళా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



ఖమ్మంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ శ్రేణులు

ఎండ.. మండె!

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మరో ఐదు రోజులు మరింత పెరిగే అవకాశం
- హెచ్చరిస్తున్న హైదరాబాద్ వాతావరణ శాఖ

సాక్షి,సిటీబ్యూరో: భానుడు భగ్గుమంటున్నాడు. నగరవాసులు బెంబేలెత్తుతున్నారు.మార్చి నెల ఆరంభంలోనే ఎండలు అదరగొడుతున్నాయి. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. మధ్యాహ్నం ఎండలైతే మరింతగా మండిపోతున్నాయి. ఆదివారం సగటు గరిష్ట ఉష్ణోగ్రత 35.5 డిగ్రీలు నమోదు కాగా, అత్యధికంగా గోల్కొండలో 38.8 డిగ్రీల సెల్సియస్‌గా రికార్డు అయింది. రాబోయే ఐదురోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పుడు ఎండలు మండుతుండటంతో ఇక ఏప్రిల్, మే నెలలో చుక్కలు చూపించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రామలింగేశ్వరాలయంలో శిలాయుగపు ఆనవాళ్లు

- పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



సీతమ్మ గుహను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

అడ్డాకుల: మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట శివారులోని రామస్వామి గుట్టపై వెలసిన రామలింగేశ్వరాలయం చరిత్ర గొప్పదని, ఆలయం వద్ద శిలాయుగపు ఆనవాళ్లు ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఆలయాన్ని సందర్శించి పురాతన కాలం నాటి శిథిలమైన శివాలయం, సీత, రాముని గుహ, వీరభద్ర, రామేశ్వర, సరస్వతి అమ్మవారి ఆలయాలు, నాటి శాసనాలు, విగ్రహాలను పరిశీలించారు. క్రీ.శ.1076 నాటి కల్యాణ చాళుక్య చక్రవర్తి విక్రమాదిత్యుని కాలంలో ఏర్పాటు చేసిన కన్నడ శాసనాన్ని వెలుగులోకి తెచ్చారు. విజయనగరం కాలంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం, శిఖరాలను పరిశీలించారు. శిలాయుగపు ఎద్దు బొమ్మలు, శిలాతోరణాలను పరిశీలించి వాటి చరిత్ర గురించి ఆలయ నిర్వాహకులకు వివరించారు. అదేవిధంగా ఆలయం గుట్ట కింద నాటి కాలంలో ఏర్పాటైన కోనేరును పరిశీలించి దాని అభివృద్ధికి సూచనలు చేశారు. ఆలయాభివృద్ధికి మాస్టర్ ప్లాన్, చేపట్టాల్సిన పనుల గురించి స్థపతి భీమవరపు వెంకట్‌రెడ్డితో కలిసి నిర్వాహకులతో చర్చించారు. అనుభవజ్ఞులైన శిల్పులతో ఆలయాభివృద్ధికి అంచనాలు రూపొందిస్తామని, ఏడాదిలోపు పనులు పూర్తయ్యేలా సహకరిస్తామని ప్రకటించారు. రామలింగేశ్వరస్వామి ఆలయం చరిత్రను కాపాడితే టూరిస్టు ప్రాంతంగా వెలుగొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ ఇంజనీర్లపై త్వరలో వేటు

- వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ల జారీపై సర్కారు సీరియస్
- ఈఈ, ఎస్‌ఈలకు త్వరలో షోకాజ్ నోటీసులు.. ఆపై సస్పెన్షన్‌కు నిర్ణయం
- తప్పుడు మార్గంలో సర్టిఫికెట్ల జారీతో సర్కారుకు తలనొప్పులు
- బ్యారేజీ పునరుద్ధరణ పనుల ఖర్చు భరించేందుకు నిరాకరిస్తున్న ఎల్ అండ్ టీ

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం పూర్తయిందని ధ్రువీకరిస్తూ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీకి తప్పుడు మార్గంలో వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్లు జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ)లపై చర్యలకు నీటిపారుదల శాఖ సిద్ధమైంది. తొలుత షోకాజ్ నోటీసులు జారీ చేసి సంజాయిషీ కోరాలని, ఆ తర్వాత సస్పెన్షన్ వేటు వేయాలని నిర్ణయం తీసుకుంది. ఒప్పందంలోని నిబంధనల మేరకు నాణ్యత, రక్షణా ప్రమాణాలు పాటిస్తూ బ్యారేజీ నిర్మాణ పనులను పూర్తి చేసినట్లు ధ్రువీకరిస్తూ 2019 సెప్టెంబర్ 10న మహదేవపూర్ డివిజన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతిరావు ఎల్ అండ్ టీకి 'సబ్‌స్టాన్షియల్ కన్‌స్ట్రక్షన్ కంప్లీషన్ సర్టిఫికెట్'ను జారీచేశారు. దానిపై నాటి సూపరింటెండింగ్ ఇంజనీర్, ప్రస్తుత మహబూబ్‌నగర్ జిల్లా చీఫ్ ఇంజనీర్ రమణారెడ్డి కౌంటర్ సంతకం చేశారు. నిర్మాణ సంస్థ విజ్ఞప్తి మేరకు 2021 మార్చి 15న పనులు పూర్తయినట్లు ధ్రువీకరిస్తూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతిరావు మళ్లీ సర్టిఫికెట్ జారీ చేశారు. మరోవైపు ఒప్పందం గడువును 2022 మార్చి 31 వరకు పొడగిస్తూ ఈఎన్‌సీ ఆరోసారి పొడిగింపు ఉత్తర్వులు జారీచేశారు. పలు అంశాల్లో నిబంధనలకు అనుగుణంగా పనులు చేయనందుకుగాను నిర్మాణ సంస్థకు జారీ చేసిన నోటీసులను పట్టించుకోకుండా రూ. 159.72 కోట్ల సెక్యూరిటీ డిపాజిట్‌ను సైతం విడుదల చేశారు. 2020 ఫిబ్రవరి 29 నుంచి డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ వర్తిస్తుందని నాటి ఈఎన్‌సీ రామగుండం నల్లా వెంకటేశ్వర్లు జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా సెక్యూరిటీ డిపాజిట్‌ను నిర్మాణ సంస్థకు తిరిగి ఇచ్చేశారు. విజిలెన్స్ దర్యాప్తు ఆధారంగా నాటి ఈఎన్‌సీ సి.మురళీధర్, రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు ను ప్రభుత్వం తొలగించడం తెలిసిందే. వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ జారీ వెనక మతలబు ఉందని విజిలెన్స్ విభాగం తేల్చినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఈ సర్టిఫికెట్లను ఆధారంగా చూపి డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ ముగిసిందంటూ మేడిగడ్డ పునరుద్ధరణను సొంత ఖర్చులతో చేపట్టేందుకు ఎల్ అండ్ టీ నిరాకరిస్తోంది. ఒప్పందం ప్రకారం కాంట్రాక్టర్‌కు తుది బిల్లు జారీ కాకపోయినా ఈ సర్టిఫికెట్లను జారీ చేసినట్లు ఆరోపణలు రావడం నీటిపారుదల శాఖకు అప్రతిష్టగా మారింది. ఇద్దరు అధికారులు చేసిన తప్పులకు మొత్తం శాఖ బద్నాం అయిందని, వారిపై చర్య లు తీసుకోవాల్సిందేనని ఉన్నతస్థాయి అధికార వర్గాలు ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు తెలిసింది.

ఎన్డీఎస్‌ఏ చెప్పిందే వింటాం

బీఆర్‌ఎస్ నేతల మాటలకు విలువ లేదు: మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: 'మెడిగడ్డ బ్యారేజీలోని ఒక్క పిల్లర్ కుంగితేనే ఇంత రాద్ధాంతమా?'అంటూ బీఆర్‌ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రం, రైతాంగ ప్రయోజనాలను పణంగా పెడుతూ మాట్లాడటం దురదృష్టకరమని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ సూచనలనే పాటిస్తుందని, బీఆర్‌ఎస్ నేతల మాటలకు విలువ లేదన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిశీలన కోసం ఈ నెల 6న నిపుణుల కమిటీ రానుందని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహకారం అందిస్తామన్నారు. కుంగిన మేడిగడ్డ బ్యారేజీని ఎన్డీఎస్‌ఏ నిపుణులు పరిశీలించి నీటిని ఖాళీ చేయాలని సూచించారని, బీఆర్‌ఎస్ నేతలు రాజకీయాలు చేస్తూ మళ్లీ నీటితో నింపాలని డిమాండ్ చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని ఉత్తమ్ విమర్శించారు. డిజైన్లు, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ, పర్యవేక్షణ.. ఇలా అన్ని విషయాలల్లో గత ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కడంతో రూ. 94 వేల కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు సమస్యల్లో చిక్కుకుందన్నారు.

వ్యాయామ టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

- యాదగిరిగుట్ట నుంచి పీఈటీల పాదయాత్ర



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు

యాదగిరిగుట్ట: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1,500 వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం యాదాద్రీశుడి వైకుంఠద్వారం వద్ద నిరుద్యోగులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. అనంతరం యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్ వరకు వారు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైదులు గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీలో 150 పీఈటీ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పెద్దమనసు చేసుకొని మిగిలిన ఉన్నత పాఠశాలల్లో 1,500 పీఈటీ పోస్టులు మంజూరు చేసి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తామన్నారు. అంతకు ముందు వైకుంఠ ద్వారం వద్ద వారు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందజేశారు.

'కాళేశ్వరా'నికి హాలిడే!

▶ మొదటి పేజీ తరువాయి

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిఫారసు చేయాలని... 4 నెలల్లోగా నివేదిక సమర్పించాలని గడువు విధించారు. ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ బ్యారేజీలను పరిశీలించి నివేదిక సమర్పించాకే మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టడానికి ఆస్కారముందని ఇప్పటికే నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో వచ్చే 4 నెలలపాటు కాళేశ్వరం ప్రాజెక్టుకు హాలిడే ప్రకటించినట్లేనని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్డీఎస్‌ఏ కమిటీ సిఫారసులకు అనుగుణంగా జూలై తొలి వారం తర్వాతే పునరుద్ధరణ పనులు చేపట్టే అవకాశం ఉంది. నిపుణుల కమిటీ సిఫారసులు, సూచనల కోసం వేచిచూడక తప్పని పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ నెల 6న కమిటీ బ్యారేజీల పరిశీలనకు రానుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

కమిటీలో కీలక విభాగాల నిపుణులు

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలపై ఏర్పాటైన కమిటీలో పలు కీలక విభాగాలకు చెందిన నిపుణులు ఉన్నారు. ఢిల్లీలోని సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రిసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త యు.సి. విద్యార్థి, పుణేలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రిసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త ఆర్.పాటిల్, సీడబ్ల్యూసీ డైరెక్టర్ (బీసీడీ) శివకుమార్, సీడబ్ల్యూసీ డైరెక్టర్ (గేట్స్)/ఎన్డీఎస్‌ఏ డైరెక్టర్ (విపత్తులు) రాహు ల్ కుమార్‌సింగ్‌లు ఈ కమిటీ సభ్యులుగా, ఎన్డీఎస్‌ఏ డైరెక్టర్ (టెక్నికల్) అమితాబ్ మీనా కమి టీ సభ్యకార్యదర్శిగా వ్యవహరించనున్నారు.

ఇప్పటికే లోపాలను నిర్ధారించిన ఓ కమిటీ...

గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ కుంగిపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వరుసగా రెండుసార్లు అన్నారం బ్యారేజీకి బుంగలు ఏర్పడి భారీగా నీళ్లు లీక్ అయ్యాయి. ప్రణాళిక, డిజైన్లు, నిర్మాణం, నాణ్యత, పర్యవేక్షణ, నిర్వహణ లోపాలతోనే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని గతంలో ఎన్డీఎస్‌ఏ ఏర్పాటు చేసిన మరో నిపుణుల కమిటీ తేల్చిచెప్పింది. అన్నారం బ్యారేజీ పునాదుల దిగువన పాతిన సెకెంట్ పైల్స్‌కి పగుళ్లు రావడంతోనే బ్యారేజీలో పదేపదే బుంగలు ఏర్పడుతున్నాయని మరో నివేదికలో స్పష్టం చేసింది. మూడు బ్యారేజీలను ఒకే తరహాలో డిజైన్, సాంకేతికతతో నిర్మించినందున మూడింటిలోనూ లోపాలు ఉంటాయని, అన్నింటికీ జియోఫిజికల్, జియోలాజికల్ పరీక్షలు నిర్వహించాలని అప్పట్లో సూచించింది. ఈ నేపథ్యంలో మూడు బ్యారేజీల డిజైన్లు, నిర్మాణ లోపాలపై సమగ్ర అధ్యయనం జరిపి తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 13న ఎన్డీఎస్‌ఏకు లేఖ రాసింది. డ్యామ్ సేఫ్టీ చట్టం-2021లోని 2వ షెడ్యూల్‌లోని 8వ క్లాజు కింద ఈ మేరకు కమిటీని ఏర్పాటు చేస్తూ ఎన్డీఎస్‌ఏ నిర్ణయం తీసుకుంది.

బ్యారేజీలపై అధ్యయనం కోసం కమిటీకి ఎన్డీఎస్‌ఏ జారీ చేసిన విధివిధానాలు..

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు తనిఖీలు నిర్వహించాలి. బ్యారేజీల స్థలం, హైడ్రాలిక్, స్ట్రక్చరల్, జియోటెక్నికల్ వంటి అంశాలకు సంబంధించిన సమస్యలను నిర్ధారించడానికి అధికారులు, కాంట్రాక్టర్లు, ఇతర భాగస్వామ్యవర్గాలతో చర్చించాలి.
- ప్రాజెక్టు డేటా, డ్రాయింగ్స్, డిజైన్ల నివేదికలు, పరీక్షలు, స్థల తనిఖీ నివేదికలు, బ్యారేజీల తనిఖీ నివేదికలు, మూడు బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత పర్యవేక్షణ, నాణ్యత హామీల నివేదికలను పరిశీలించాలి.
- బ్యారేజీ నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఇన్వెస్టిగేషన్లు, డిజైన్లు, నిర్మాణం, నాణ్యత పర్యవేక్షణ, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ఇతర వ్యవహారాల్లో పాలుపంచుకున్న భాగస్వామ్యవర్గాల (ప్రభుత్వ, ప్రభుత్వరంగ, ప్రైవేటు)తో సంప్రదింపులు జరపాలి.
- బ్యారేజీల డిజైన్ల రూపకల్పనకు దోహదపడిన భౌతిక/గణిత నమూనా అధ్యయనాలను పరిశీలించాలి. (బ్యారేజీల డిజైన్ల రూపకల్పనకు ముందు ప్రయోగాత్మకంగా ల్యాబ్స్‌లలో నమూనా బ్యారేజీలను రూపొందించి వరదలను తట్టుకోవడంలో వాటి పనితీరును పరీక్షిస్తారు)
- మూడు బ్యారేజీల్లోని సమస్యలను గుర్తించి నష్ట నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పరిష్కారాలు, చేపట్టాల్సిన తదుపరి అధ్యయనాలు/పరిశోధనలను సిఫారసు చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించాలి.

సన్నిధి

మంచిమాట



సాధారణంగా పెంపకం విషయంలో ఆడపిల్లలకి ఎన్నో జాగ్రత్తలు చెప్పటం చూస్తాం. మగపిల్లలకి చెప్పవలసినది ఏమీ లేదని చాలా మంది అభిప్రాయం. ఈ కారణంగానే సమాజంలో ఎన్నో అయోమయ పరిస్థితులు, అలజడులు, అరాచకాలు. ముఖ్యంగా ఆడపిల్లలకి సమాజం మీద ఏవగింపు, కోపం, పురుష ద్వేషం పెరిగి అవాంఛనీయ సంఘటనలకి దారి తీయటం జరుగుతోంది. అమ్మాయిలు విప్లవభావాల పట్ల ఆకర్షించబడటం, పెళ్లి చేసుకోవద్దు అనుకోటం, చేసుకున్నా విడాకులు తీసుకోవటం, కుటుంబాలు విచ్ఛిన్నం కావటం, లేదా అమ్మాయిలనే పెళ్లి చేసుకోవటమో, సహజీవనం చేయటమో జరుగుతోంది. ఇవన్నీ కొంతవరకైనా అదుపులో ఉండి సమాజంలో సమరసత ఉండటానికి మగపిల్లలని సరిగా పెంచటం ప్రధానం.

మగపిల్లల పెంపకం

మన తరువాతి తరం వారికి మనం ఏం నేర్పిస్తున్నాం? అని కాస్త వివేచన చేస్తే ... అమ్మో! ఎంత భయం వేస్తుందో! మన ప్రవర్తన ద్వారా నేర్పే విషయాలే కాదు, మన మాటలు, ఆదేశాలు, ఉపదేశాలు, బోధలు మొదలైనవి కూడా తలుచుకుంటే బాధ కలుగుతుంది. ఆడ, మగ వివక్ష ఇంట్లోనే మొదలవుతుంది. ఆడపిల్ల పుట్టిందనగానే ముందుగా ''అయ్యో!'' అనేది తల్లే. పెంపకంలోనూ తేడా చూపిస్తారు. ఉదాహరణకి ఇంట్లో అమ్మాయిని తల్లే అంటుంది ''ఆడపిల్లవి నీకెందుకు?'' అని. అంటే ఆడపిల్ల కొన్ని విషయాలు పట్టించుకోకూడదు. అవసరం లేదు. కొడుకు కూడా కొన్ని పట్టించుకోకూడదు. కానీ అవి వేరు. అవి ఇంటి విషయాలు, వంటవిషయాలు మొదలైనవి. ఇంక కొన్ని కుటుంబాలలో ఆస్తిపాస్తులు పంచి ఇవ్వటం మాట అటుంచి కూతురిని ఇంటిపని చెయ్యమని, కొడుకుని చదువుకోమని చెప్పేవారు కనపడుతూనే ఉన్నారు.

ఇద్దరినీ సమానంగా చూడటం ఎట్లా కుదురుతుంది? ఆడపిల్లలు కొంచెం నాజూకుగా ఉంటారు, మగపిల్లలు కాస్త మొరటుగా ఉంటారు కదా! అనిపించటం సహజం. సమానత్వం అంటే వారి పట్ల ప్రవర్తించే తీరు సమానంగా ఉండటం. వారికి ఇష్టమయినవి, వారి అభిరుచులకు తగినవి అందించటం. నిజానికి మగపిల్లలైనా ఏ ఇద్దరికీ ఒకే రకమైన అభిరుచులు, లక్ష్యాలు ఉండవు కదా! ఒకరికి ఇంజనీరింగ్ ఇష్టమైతే మరొకరికి వైద్యవృత్తి ఇష్టం, వేరొకరికి వ్యవసాయం మీద మక్కువ ఉండవచ్చు. వారికి తగిన ప్రోత్సాహం ఇవ్వటం తల్లితండ్రుల కర్తవ్యం. అదే ఆడపిల్లల విషయంలో కూడా పాటించాలి. ఇది ప్రోత్సాహం మాత్రమే. అసలు చేయవలసినది మగపిల్లల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు.

ప్రతి క్షణం ఆడపిల్ల, మగపిల్లవాడు అనే మాటని అని వారికి ఆ సంగతి గుర్తు చేస్తూ ఉండకూడదు. ఇంటి పనులన్నీ ఇద్దరి చేత సమానంగా చేయిస్తూ ఉండాలి. ఎందుకంటే ఈ రోజులలో ఆడ, మగ అందరు ఉద్యోగం చేస్తున్నారు. మగవారి బాధ్యత అయిన సంపాదించటంలో ఆడవారు భాగస్వామ్యం వహిస్తున్నప్పుడు, ఇంటి పనిలో మగవారు కూడా భాగస్వామ్యం వహించాలి అని చిన్నప్పుడే బుర్రకి ఎక్కించాలి. ముందు తిన్నకంచం తీయటం, వంటపనిలో సహాయం చేయటం అలవాటు చేయాలి. లేకపోతే కోడలు అత్తగారి పెంపకాన్ని తప్పు పడుతుంది.

ఆడపిల్లలని గౌరవించటం నేర్పాలి. ఇది తండ్రి ప్రవర్తన వల్ల కలుగుతుంది. తండ్రి తల్లిని గౌరవిస్తూ ఉంటే కొడుకు కూడా తల్లిని, స్త్రీలని గౌరవిస్తాడు. చీటికి మాటికి భార్యని భర్త చులకన చేస్తూ ఉంటే కొడుకుకి ఆడవారిని తక్కువగా చూడటం అలవాటు అవుతుంది. తరువాతి కాలంలో ఈ భావం సరి అవటం కష్టం. ఇటువంటి పెంపకంలో పెరిగిన వారే ఆడపిల్లలని ఏడిపించటం నుండి యాసిడ్ దాడులు, అత్యాచారాలు మొదలైనవి చేస్తూ ఉంటారు. ఏ ఇంట్లో తండ్రి తల్లిని అగౌరవపరచడో, ఆడపిల్లలని బరువుగా భావించ కుండా ఉంటారో ఆ ఇంట్లో పెరిగిన మగపిల్లలు తోటి ఆడపిల్లలతో మర్యాదగా ప్రవర్తిస్తారు. అటువంటి వాళ్ళు ఉన్న సమాజంలో మన ఆడపిల్లలు కూడా భద్రంగా ఉంటారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

గంగే మాం పాహి



విష్ణుమూర్తి స్పర్శచేత పరమపావనియైన గంగలో స్నానం చేస్తే సకల పాపాలు పోతాయన్నది సనాతన ధర్మ విశ్వాసం. అంటే... పాపాలు చేసి గంగలో మునిగి వాటిని పోగొట్టుకోవచ్చని అర్థం చేసుకోకూడదు. తెలిసో తెలియకో ఇప్పటివరకు చేసిన పాపాలు గంగాస్నానంతో పోగొట్టుకుని, ఇక మీదట ఎటువంటి పాపపు పనులు చేయకుండా నన్ను నేను నియంత్రించుకునే శక్తినీయవలసిందిగా భగవంతుని వేడుకోవాలి. అదే ధర్మాచరణం. వద్దన్న పని వదిలి పెట్టడమే ధర్మాచరణ. అది విష్ణువుకు ప్రీతిపాత్రం. ముత్తుస్వామి దీక్షితార్ వారు గంగపై కీర్తన చేస్తూ... ''గంగే మాం పాహి గిరీశ శిర స్థితే/గంభీర కాయే గీత వాద్య ప్రియే/అంగజ తాత ముదే అసి వరుణా మధ్యే /అక్రూర పూజితే అఖిల జనానందే...'' అన్నారు. గంగమ్మ గొప్పదనాన్ని చెబుతూ... అక్రూరపూజితే అని కూడా అన్నారు.

గంగను కీర్తిస్తూ అక్రూరుడి ప్రస్తావన ఎందుకు తెచ్చినట్టు ..? మిగిలిన పురాణాలన్నింటినీ వ్యాస భగవానుడు రాస్తే... విష్ణు పురాణాన్ని పరాశర మహర్షి ఇచ్చాడు. శమంతకోపాఖ్యానం దీనిలోనిదే. అయితే ఇక్కడ గమ్మత్తయిన ఒక విషయం చెప్పుకోవాలి. వినాయక చవితినాడు వ్రత మహాత్మ్యంలో మనం ఒక కథ చదువుకుంటూంటాం. ఒక పసిపిల్ల ఉయ్యాల్లో ఉందనీ, ఆ పిల్లను కృష్ణుడు పెళ్ళి చేసుకున్నాడనీ, ఆమే జాంబవతి అనీ... ఇలా సాగుతుంది.. కానీ నిజానికి విష్ణు పురాణంలో చెప్పింది వేరు. ఉయ్యాల్లో ఉన్నది పసిపిల్లవాడు. దానిని ఊపుతున్న యవ్వని జాంబవతిని కృష్ణపరమాత్మ పెళ్లి చేసుకున్నాడు. వినాయక చవితి రోజున మిగిలిన కథను పూర్తిగా చదివినా చదవకపోయినా...''...తవ హియేషా శమంతకః'' అంటూ ముగిస్తారు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

నిజానిక శ్రీకృష్ణుడు శమంతక మణివల్ల ఎన్ని కష్టాలుపడాలో అన్ని కష్టాలు పడ్డాడు. అటు సత్యభామకు దూరమయిపోయాడు, ఇటు జాంబవతికీ దూరమయ్యాడు. శమంతక మణిని కృష్ణుడే కాజేసాడని వారిద్దరే కాదు, బలరాముడు, ఇతర బంధువులు, ద్వారకానగరవాసులూ అందరూ అనుమానించారు. ఇంతకూ అసలు శమంతకమణి ఎక్కడుంది? అక్రూరుడి దగ్గర. అక్రూరుడు ఎక్కడున్నాడు? అంటే... ఆ మణికి ఒక నియమం ఉంది. బాహ్యాభ్యంతర శౌచం ఎవరికుంటుందో వారి దగ్గర అది బంగారం పెడుతుంది, దాన్ని దాచుకోకుండా లోకసంక్షేమం కోసం వెచ్చించే పరమ భాగవతోత్తముడి దగ్గర ఉంటుంది. లేకపోతే చంపేస్తుంది. ప్రసేనుడు, సత్రాజిత్తు అలాగే చచ్చిపోయారు. కాబట్టి

వాగ్గేయకార వైభవం

అది ఉన్నచోట నిత్యాన్నదానాలతో నవ వసంతశోభ ఉంటుంది. అలా కాశీ వెలిగిపోతున్నది కాబట్టి అక్కడ అక్రూరుడు ఉంటాడని భావించి 'అక్కడికి వెళ్ళి అక్రూరుడిని పిలుచుకురండి' అని కృష్ణుడు ఆదేశించాడు. గంగను పూజిస్తూ గంగలో స్నానం చేస్తున్న అక్రూరుడికి కృష్ణుడి సందేశం వినిపించగానే.. అక్రూరుడు వెళ్ళి ఆ శమంతకమణిని ఇవ్వబోతే...'' అంతః శౌచం, బాహ్య శౌచం' నీలో ఉన్నాయి కనుక అది నీవద్దే ఉంచుకో' అని కృష్ణుడు చెప్పాడు. అక్రూరుడు ద్వారకానగరం వదిలి పెట్టాల్సి వచ్చినప్పుడు కాశీవెళ్ళి అక్కడే ఉండిపోయాడు గంగ కోసం. పరమ భక్తితో రోజూ పూజిస్తూ నిత్యం గంగలో స్నానం చేసేవాడు. శాస్త్రాలు చదవకపోయినా గంగానది ఒడ్డున గురువుగారి శుశ్రూషలో ఇన్ని విషయాలు తెలుసుకున్న దీక్షితార్ వారి కీర్తనల్లో అనేక శాస్త్ర రహస్యాలను ప్రస్తావిస్తారు. వాటిలో గంగను స్తుతిస్తూ చేసిన ఈ కీర్తన ఒకటి.

ధమ్మపథం

సమ్యక్ దర్శనం



మగధ రాజ్య రాజధాని రాజగృహ సమీపంలోని పక్షి పర్వతం. ఆ పర్వతం చివర విశాలమైన చదును భాగం. ఒకపక్క పెద్ద పెద్ద కొండ రాళ్ళు. ఆ రాళ్ళ సందులో చిన్న గుహ. అది చల్లగా విశ్రాంతి తీసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. చదును భాగం చుట్టూ పనస చెట్లు దట్టంగా ఉన్నాయి. ఒకరోజు బుద్ధుడు సాయంత్రం వేళ ఆ గుహ ముందున్న రాతిమీద కూర్చొని ఉన్నాడు. ఆ సమయానికి వచ్చాడు దీర్ఘనఖుడు అనే సన్యాసి. అతను అగ్ని ఆరాధకుడు. దీర్ఘనఖుడు వచ్చి, వంగి బుద్ధునికి నమస్కరించాడు. ఒక పక్కన నిలబడ్డాడు.

ఆ రోజుల్లో కొందరు తాపసులు''మీరు చెప్పేది ఏదీ నాకు సమ్మతం కాదు. దేన్నీ నేను ఒప్పుకోను'' అనేవారు. ఏ విషయాన్ని చెప్పినా, దాన్ని ఏదో ఒక విధంగా విమర్శించేవారు. తప్పులు వెదికేవారు. అంగీకరించేవారు కాదు.

ఇంకొందరున్నారు. వారు ప్రతిదాన్నీ అంగీకరించేవారు. ఆయా విషయాలపై వాదవివాదాలు చేసేవారు కాదు. 'అలాగే...' 'అవునవును' అంటూ తలలూపేవారు.

ఇక మూడోరకం ఉన్నారు. వారు ''మాకు కొంత సమ్మతం కాదు'' అనేవారు.

దీర్ఘనఖుడు ఇందులో మొదటి రకం వాడు. ''ఏదీ నాకు సమ్మతం కాదు'' అనేవాడు.

ఆరోజు ఇదే విషయం గురించి చర్చించుకుంటూ....

''దీర్ఘనఖా! ఏదీ నాకు సమ్మతం కాదు' అనేదైనా నీకు సమ్మతమేనా?'' అని అడిగాడు.

''గౌతమా! అది మాత్రం నాకు సమ్మతమే'' అన్నాడు. బుద్ధుడు అతని వైపు తదేకంగా చూశాడు. బుద్ధుని ప్రశాంత దృక్కులు తనని ఏదో ప్రశ్నిస్తున్నట్లు గమనించాడు.

అప్పుడు బుద్ధుడు– ''ఏదీ సమ్మతం కాదు... అనేవారి దృష్టి రాగ రహితంగా ఉంటుంది. దేనితో కలవకుండా ఉంటుంది. పొగడ్తలకు, ప్రతి దాన్నీ పొందాలనే భావనకూ దూరంగా ఉంటుంది. దేనినీ పట్టుకుని వేళ్ళాడదు!'' అన్నాడు.

''గౌతమా! మంచిది. మీరు నా దృష్టి కోణాన్ని మెచ్చుకుంటున్నారన్నమాట'' అన్నాడు.

''దీర్ఘనఖా! ఇంకా విను. 'అంతా సమ్మతమే అనేవారు దీనికి భిన్నంగా ఉంటారు. వారి దృష్టి రాగంతో ఉంటుంది. ప్రతి దానితో కలసిపోతుంది. పొగడ్తలను కోరుకుంటుంది. ప్రతి దాన్నీ పొందాలి అనుకుంటుంది. ఇక మూడోరకంవారి దృష్టి ఈ రెండు రకాలనూ కలగలుపుకుని ఉంటుంది. విశేషం ఏమిటంటే.. ఈ మూడు రకాల వారిలో ప్రతి ఒక్కరూ తమ దృష్టే సరైనదనుకుంటారు. ఇతరుల్ని విమర్శిస్తారు. వ్యతిరేకిస్తారు. తమ అనుభవంలో... తాము అనుకునేదానికి భిన్నమైన ఫలితం చూసినా, గ్రహించినా గానీ,,, వీరు మారరు. మూర్ఖంగా తాను అనుకున్నదే సత్యం అనుకుంటారు. సర్వం అదే అని నిర్ణయించుకుంటారు. మిగిలినదంతా మిధ్యే అని భావిస్తారు. దీని వల్ల ప్రజ్ఞని (ఎరుకను) కోల్పోతారు. సత్యాన్ని ఆవిష్కరించలేరు'' అని చెప్పాడు.

బుద్ధుడు అలా మూడురకాల దృష్టి గలవారి గురించి చెప్పాక, తన తప్పు ఏమిటో దీర్ఘనఖునికి అర్థమైంది.

ద్వేషం, క్రోధాలు ఎలా సత్యాన్ని తెలుసుకోడానికి అవరోధాలలో... రాగం మోహం కోరికలు కూడా అలాంటి అవరోధాలే అని గ్రహించాడు. ఇవి తొలగించుకుని సమ్యక్ దర్శనం వల్లనే సత్యాన్ని సత్యంగా.. ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకోగలం అని అర్థం చేసుకున్నాడు.

మనస్సుని మాలిన్య రహితం చేసుకోవడం వల్ల సమ్యక్ దృష్టి కలుగుతుందని గ్రహించి... వినమ్రంగా బుద్ధుని పాదాలంటి నమస్కరించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

కల నిజమైంది


రష్మిక

చిన్ననాటి కల నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉందంటున్నారు హీరోయిన్ రష్మికా మందన్నా. జపాన్‌లోని టోక్యోలో జరిగిన ఎనిమిదో ఎడిషన్ 'క్రంచీ రోల్ అనిమే' అవార్డ్స్ ఫంక్షన్‌కు అతిథిగా వెళ్లారు రష్మిక. విజేతలకు అవార్డులను అందజేశారు. జపాన్‌కు వెళ్లడం పట్ల రష్మికా మందన్నా ఈ విధంగా స్పందించారు.''నా చిన్నతనంలో జపాన్‌కు వెళ్లాలనే కల ఉండేది. అయితే అది అసాధ్యం అనుకున్నాను. కానీ ఇన్నేళ్లుగా జపాన్‌కు వెళ్లాలనే కల మాత్రం అలానే ఉంది. ఇప్పుడు అది సాధ్యమైనందుకు సంతోషంగా ఉంది. కొన్నేళ్ల నా కల నిజమైంది. జపాన్‌లోని ఆహారం, వాతావరణం, ఇక్కడి ప్రజలు నాపై చూపించిన ప్రేమ, ఆదరణ నాకు ఆనందాన్నిచ్చాయి. జపాన్ నాకు ఇప్పుడు చాలా స్పెషల్'' అని 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు రష్మిక. ఇక సినిమాల విషయానికి వస్తే.. అల్లు అర్జున్ 'పుష్ప 2', ధనుష్ 'డీఎన్ఎస్' (వర్కింగ్ టైటిల్), హిందీ 'ఛావా'లో హీరోయిన్‌గా నటిస్తున్నారామె. అలాగే 'ది గాళ్ ఫ్రెండ్', 'రెయిన్ బో' అనే ఉమెన్‌సెంట్రిక్ ఫిల్మ్స్ కూడా చేస్తున్నారు రష్మికా మందన్నా.


ప్రభాస్

యాక్షన్‌తో స్టార్ట్

'సలార్' రెండో భాగం 'సలార్: శౌర్యంగ పర్వం' షూటింగ్‌కు రెడీ చేస్తున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' సినిమాలోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' గత ఏడాది డిసెంబరులో విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో వెంటనే 'సలార్' రెండో భాగం 'సలార్: శౌర్యంగపర్వం' పనులను ఆరంభించారు ప్రశాంత్ నీల్. ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి కావస్తుండటంతో ఏప్రిల్‌లో షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారని తెలిసింది. ముందుగా యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తారట ప్రశాంత్ నీల్. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు, బాబీ సింహా, శ్రియా రెడ్డి, ఈశ్వరీ రావు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 చివర్లో విడుదల కానుందని సమాచారం.



నాకు నేనే పరాయిదానిలా...


ఇన్‌స్టాలో ఇలియానా తాజా ఫొటో

''నేను ఫొటోలు దిగి చాన్నాళ్లయింది. అలాగే ఈ ప్లాట్‌ఫామ్‌లో నా అభిప్రాయాలు షేర్ చేసి కూడా చాలా రోజులైంది. తల్లయ్యాక బిడ్డను చూసుకోవడం, ఇల్లు చక్కబెట్టుకోవడంతోనే సరిపోతోంది. నాకోసం టైమ్ కేటాయించుకోలేకపోతున్నాను'' అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పేర్కొన్నారు ఇలియానా. గత ఏడాది ఆగస్టులో ఒక బాబుకి జన్మనిచ్చారు ఇలియానా. ప్రెగ్నెన్సీ తర్వాత సహజంగా కొందరికి ఏర్పడే డిప్రెషన్ లాంటిది ఇలియానాకి కూడా ఏర్పడిందట. సినిమా స్టార్‌గా కొన్నేళ్లు మేకప్‌కి దగ్గరగా ఉన్న ఇలియానాకి ఇప్పుడు మేకప్ బాక్స్ తెరిచే సమయం కూడా లేదు. ఇక హెయిర్ స్టయిల్ అంటారా? గట్టిగా ముడి వేసుకునే ఉంటున్నారట. తల్లయ్యాక వచ్చిన ఆ మార్పులు గురించి ఇలియానా మాట్లాడుతూ – ''మా చిన్నోడి చేతికి జుట్టు దొరికితే అంతే సంగతులు. అందుకే దాదాపు ముడి వేసుకునే ఉంటున్నాను'' అంటూ ఆ ఫొటోను కూడా షేర్ చేశారు. ఇంకా చెబుతూ – ''అమ్మ అయ్యాక నా లైఫ్ స్టయిల్‌లో చాలా మార్పు వచ్చింది. ఇప్పటివరకూ ఒక రకంగా.. ఇప్పుడు ఒక రకంగా. నాకు నేనే పరాయిదానిలా అనిపిస్తున్నాను. తల్లయ్యాక కొంతమంది త్వరగా కోలుకుని, పనిలో (కొందరు హీరోయిన్లు సినిమాలు చేయడం గురించి) పడిపోతారు. కానీ నేను అంత త్వరగా కమ్‌బ్యాక్ కాలేను. అయితే ఎప్పటికైనా రావడం ఖాయం. కాకపోతే త్వర త్వరగా కాకుండా నాకు కుదిరినట్లు మెల్లిగా వర్కవుట్స్ చేసుకుంటూ, పూర్వపు శక్తి తెచ్చుకున్నాకే వస్తాను. ఇలా ఇంటికి, నా బిడ్డకి అంకితం కావడం నాకు ఏమాత్రం బాధగా లేదు. ఎందుకంటే అన్నింటికన్నా నా జీవితంలోకి వచ్చిన ఈ అందమైన చిన్నోడు ముందు నాకు ఏదీ పెద్దగా అనిపించడంలేదు. ఇప్పుడైతే ప్రతి రోజూ ఓ 30 నిమిషాలు వర్కవుట్ చేస్తున్నాను. ఆ తర్వాత జస్ట్ ఓ ఐదు నిమిషాలు స్నానం చేసి, నా ఇంటి పనులతో బిజీ అవుతున్నాను. ఒక్కోసారి వర్కవుట్ చేసే వీలు కుదరడంలేదు. అయినా ఫర్వాలేదు. నేను చెప్పొచ్చేదేంటంటే కచ్చితంగా 'బౌన్స్ బ్యాక్' అవుతా. అయితే కొంత ఆలస్యంగా..'' అన్నారు ఇలియానా. ఇదిలా ఉంటే... గత ఏడాది మైఖేల్ డోలన్‌ని పెళ్లాడారు ఇలియానా. అయితే కొన్నాళ్ల పాటు రహస్యంగా ఉంచారు. కుమారుడు పుట్టాక మైఖేల్ పూర్తి ఫొటోను షేర్ చేశారు ఇలియానా.

మధ్యతరగతి షరతులు

చైతన్యా రావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డా. కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుకలో హీరో చైతన్యా రావు మాట్లాడుతూ– ''షరతులు వర్తిస్తాయి' ట్రైలర్ మీకు నచ్చిందనే అనుకుంటున్నాను. దిగువ మధ్య తరగతి, మధ్యతరగతి వాళ్ల జీవితాల్లో ఉండే సంతోషాలు, బాధలు, భావోద్వేగాలతో ఈ సినిమా కథనం ఉంటుంది. ఇందులో చిరంజీవి పాత్రలో నేను, విజయశాంతి పాత్రలో భూమి శెట్టి నటించాం. ప్రేక్షకులందరూ చూడాల్సిన చిత్రం ఇది'' అన్నారు. ''ఓ మంచి పాయింట్‌కు కమర్షియల్ హంగులు జోడించి ఈ సినిమా తీశాం. ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన చిత్రం'' అన్నారు కుమారస్వామి. ''ఏషియన్ ఫిలిమ్స్, సురేష్ ప్రొడక్షన్స్ మా సినిమాను రిలీజ్ చేస్తున్నాయి. ఇప్పటికి 60 థియేటర్స్ కన్ఫార్మ్ అయ్యాయి'' అన్నారు డా. కృష్ణకాంత్ చిత్తజల్లు. ''కరీంనగర్ నేపథ్యంలో సాగే ఈ సినిమా కోసం తెలంగాణ యాస నేర్చుకున్నా'' అన్నారు భూమి. నటుడు సంతోష్ యాదవ్ మాట్లాడారు.


చైతన్యా రావు, భూమి శెట్టి

హిందీకి అరి


సాయి కుమార్, అనసూయ, శుభలేఖ సుధాకర్, శ్రీకాంత్ అయ్యంగార్

వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ నటించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. ఆర్వీ రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మించారు. 'పేపర్ బాయ్' చిత్రదర్శకుడు జయశంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ''ఈ చిత్రం విడుదలకు ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ భాగస్వామి కానుంది. త్వరలోనే గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం. ఈ సినిమా హిందీ రీమేక్‌పై అభిషేక్ బచ్చన్ ఆసక్తిగా ఉన్నారు'' అని చిత్రబృందం పేర్కొంది. కాగా.. ఈ చిత్రం ప్రివ్యూని అభిషేక్ బచ్చన్‌కి చూపించారట దర్శకుడు జయశంకర్. కాన్సెప్ట్ యూనివర్సల్‌గా ఉందని, హిందీలో రీమేక్ చేస్తే బాగుంటుందని అభిషేక్ బచ్చన్ పేర్కొన్నట్లు సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: కృష్ణ ప్రసాద్.

వెంకటేశ్‌కి జోడీగా...

హీరోయిన్‌గా మీనాక్షీ చౌదరి ప్రస్తుతం ఫుల్‌ఫామ్‌లో ఉన్నారు. తమిళ హీరో విజయ్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్', వరుణ్ తేజ్ 'మట్కా', దుల్కర్ సల్మాన్ 'లక్కీ భాస్కర్', విశ్వక్ సేన్ పదో చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు ఈ యంగ్ బ్యూటీ. కాగా మీనాక్షీకి హీరోయిన్‌గా మరో సూపర్ చాన్స్ వచ్చిందని టాక్. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్–దర్శకుడు అనిల్ రావిపూడిల కాంబినేషన్‌లో ఓ విలేజ్ బ్యాక్‌డ్రాప్ మూవీ తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మించనున్నారని సమాచారం. కాగా ఈ సినిమాలో హీరోయిన్‌గా తొలుత త్రిష పేరు వినిపించింది. తాజాగా మీనాక్షీ చౌదరి పేరు తెరపైకి వచ్చింది. వెంకీ వంటి స్టార్ హీరో సినిమా కాబట్టి మీనాక్షీ కూడా ఆల్మోస్ట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసినట్టేనని అంటున్నారు ఫిల్మ్‌నగర్ వాసులు. ఇక ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయాలనుకుంటున్నారని, 'సంక్రాంతికి వస్తున్నాం' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఇంకా.. కథ రీత్యా ఇందులో ఓ గెస్ట్ రోల్ ఉందని, ఈ పాత్రలో రవితేజ లేదా బాలకృష్ణ కనిపిస్తారని భోగట్టా.


మీనాక్షీ చౌదరి

విలేజ్‌లో మిస్టరీ

రవితేజ నున్నా, నేహ జురెల్ హీరో హీరోయిన్‌గా నటించిన చిత్రం 'రాజుగారి అమ్మాయి.. నాయుడుగారి అబ్బాయి'. మణికొండ రంజిత్ సమర్పణలో సత్యరాజు దర్శకత్వంలో ముత్యాల రామదాసు, నున్నా కుమారి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. మర్డర్ మిస్టరీ నేపథ్యంలో సాగే విలేజ్ బ్యాక్‌డ్రాప్ మూవీగా ఈ చిత్రం ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ''విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కమర్షియల్ సబ్జెక్ట్ ఈ చిత్రం. ఎన్నో ఇబ్బందులు పడి ఈ సినిమా పూర్తి చేశాం'' అన్నారు రవితేజ. ''ఈ సినిమాలో హిట్ కళ కనిపిస్తోంది'' అన్నారు ముత్యాల రామదాసు. ''ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు సత్యరాజ్. ఈ చిత్రానికి సంగీతం: రోషన్ సాలూరి.


నేహ జురెల్, రవితేజ నున్నా



తొలి రౌండ్‌లోనే దీపక్ పరాజయం

పారిస్ ఒలింపిక్స్ వరల్డ్ బాక్సింగ్ క్వాలిఫయింగ్ టోర్నీలో తొలి రోజు బరిలోకి దిగిన ఇద్దరు భారత బాక్సర్లకు నిరాశే ఎదురైంది. ఆదివారం ఇటలీలో జరిగిన పురుషుల 51 కేజీల విభాగంలో దీపక్... +92 కేజీల విభాగంలో నరేందర్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. నిజాత్ హుసెనోవ్ (అజర్‌బైజాన్)తో జరిగిన బౌట్‌లో దీపక్ 2-3తో... టియాఫాక్ (జర్మనీ)తో జరిగిన బౌట్‌లో నరేందర్ 0-5తో ఓడిపోయారు. హరియాణాకు చెందిన దీపక్ గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు.


ప్రజ్ఞానందకు రెండో విజయం

ప్రాగ్ మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద రెండో విజయం నమోదు చేశాడు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతితో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో ప్రజ్ఞానంద 52 ఎత్తుల్లో గెలిచాడు. డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన గేమ్‌లో భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ 61 ఎత్తుల్లో ఓడిపోయాడు. ఐదో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద, గుకేశ్ 2.5 పాయింట్లతో వరుసగా నాలుగో, ఐదో ర్యాంక్‌లో ఉన్నారు.



‘టాప్’లోకి భారత్

డబ్ల్యూటీసీ ర్యాంకింగ్స్



దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-2025లో రెండుసార్లు రన్నరప్‌గా నిలిచిన భారత్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో భారత్ గెలుపొందడం ద్వారా పాయింట్ల శాతం (64.58)తో రెండో స్థానాన్ని పటిష్ట పర్చుకుంది. అయితే టీమిండియా తాజా డబ్ల్యూటీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌కు ఎగబాకడానికి కారణం... న్యూజిలాండ్ సొంతగడ్డపై జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడటమే! కివీస్ ర్యాంకు దిగజారడంతో భారత్ అగ్రస్థానం చేరుకుంది. ఆడిన 8 మ్యాచ్‌ల్లో ఐదు గెలిచి రెండింట ఓడిన భారత్ ఒక మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకుంది. ఐదు మ్యాచ్‌లాడిన న్యూజిలాండ్ మూడు గెలిచి, రెండు ఓడింది. దీంతో 60 పాయింట్ల శాతంతో రెండో స్థానానికి పడిపోయింది. ఆసీస్‌తో ఓటమికి ముందు కివీస్ 75 శాతంతో అగ్రస్థానంలో ఉండేది. కానీ 172 పరుగుల భారీతేడాతో ఓడిపోవడంతో టాప్‌ర్యాంకును కోల్పోయింది.

ప్రవీణ్‌కు నిరాశ



గ్లాస్గో (స్కాట్లాండ్): ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత ట్రిపుల్ జంపర్ ప్రవీణ్ చిత్రావెల్ తన అత్యుత్తమ ప్రదర్శన కూడా నమోదు చేయలేకపోయాడు. ఆదివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో 22 ఏళ్ల ప్రవీణ్ 16.45 మీటర్ల దూరం దూకి 11వ స్థానంలో నిలిచాడు. ఫాబ్రిస్ జాంగో (బుర్కినఫాసో; 17.53 మీటర్లు) స్వర్ణం, యాసిర్ మొహమ్మద్ ట్రికీ (అల్జీరియా; 17.35 మీటర్లు), టియాగో పెరీరా (పోర్చుగల్; 17.08 మీటర్లు) వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించాడు. 17.37 మీటర్లతో తన పేరిట ఉన్న జాతీయ రికార్డు ప్రదర్శనను ప్రవీణ్ గ్లాస్గోలో పునరావృతం చేసి ఉంటే అతని ఖాతాలో రజత పతకం చేరేది. గత ఏడాది ఆసియా క్రీడల్లో ప్రవీణ్ (17.68 మీటర్లు) కాంస్య పతకాన్ని సాధించాడు.

ఢిల్లీ ‘హ్యాట్రిక్’...

- మూడో విజయంతో అగ్రస్థానానికి
- రాణించిన మెగ్ లానింగ్, జెస్ జొనాసెన్, రాధా యాదవ్
- వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఓడిన గుజరాత్ జెయింట్స్


మెగ్ లానింగ్


జెస్ జొనాసెన్, రాధా యాదవ్ సంబరం

బెంగళూరు: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ ‘హ్యాట్రిక్’ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన పోరులో ఢిల్లీ 25 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. టోర్నీ తొలి మ్యాచ్‌లో ముంబై చేతిలో ఓడిన తర్వాత క్యాపిటల్స్ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలుపొందింది. అయితే గుజరాత్ పరిస్థితి మాత్రం మరింత దిగజారింది. ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన టీమ్ ఒక్క గెలుపు కూడా లేకుండా వరుసగా నాలుగో పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 163 చేయగా.... జెయింట్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 138 పరుగులకే పరిమితమైంది. ఢిల్లీ కెప్టెన్ మెగ్ లానింగ్ (41 బంతుల్లో 55; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో తన జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించింది. షఫాలీ వర్మ (13), జెమీమా రోడ్రిగ్స్ (7) విఫలం కావడంతో లానింగ్ ముందుండి నడిపించింది. అలైస్ క్యాప్సీ (17 బంతుల్లో 27; 5 ఫోర్లు)తో రెండో వికెట్‌కు లానింగ్ 26 బంతుల్లో 38 పరుగులు జోడించగా... చివర్లో అనాబెల్ సదర్లాండ్ (12 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని కీలక పరుగులు జత చేసింది. గుజరాత్ పేలవ ఫీల్డింగ్, క్యాచ్‌లు వదిలేయడం కలిసొచ్చినా ఢిల్లీ వాటిని పూర్తిగా వినియోగించుకోలేకపోయింది. ఒకదశలో 105/2తో మెరుగైన స్థితిలో నిలిచిన జట్టు ఆ తర్వాత వేగంగా వికెట్లు కోల్పోయింది. చివరి 5 ఓవర్లలో ఢిల్లీ 33 పరుగులు చేసింది. జెయింట్స్ పేసర్ మేఘనా సింగ్ (4/37) కీలక వికెట్లు తీయగా... గార్డ్‌నర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ తడబడింది. సున్నా స్కోరు వద్దే వాల్‌వార్ట్ (0) వెనుదిరగ్గా... బెత్ మూనీ (12), లిచ్‌ఫీల్డ్ (15), వేద కృష్ణమూర్తి (12) ప్రభావం చూపలేకపోయారు. అయితే యాష్లీ గార్డ్‌నర్ (31 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే పోరాడగలిగింది. అయితే 35 బంతుల్లో 59 పరుగులు చేయాల్సిన స్థితిలో జెస్ జొనాసెన్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి గార్డ్‌నర్ స్టంపౌట్ కావడంతో గుజరాత్ ఆశలు కోల్పోయింది. ఆ తర్వాత జట్టు ఇన్నింగ్స్ లాంఛనమే అయింది. ఢిల్లీ బౌలర్లలో రాధా యాదవ్, జెస్ జొనాసెన్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... అరుంధతి రెడ్డి, శిఖా పాండే చెరో వికెట్ తీశారు. నేడు జరిగే మ్యాచ్‌లో బెంగళూరుతో యూపీ వారియర్స్ తలపడుతుంది. లీగ్ దశలో తొలి అర్ధ భాగం మ్యాచ్‌లు (11) నేటితో బెంగళూరులో ముగియనున్నాయి. మంగళవారం నుంచి తర్వాతి 11 మ్యాచ్‌లకు ఢిల్లీ వేదిక కానుంది.

తొలి కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్

ఆదివారం మ్యాచ్‌లో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. డబ్ల్యూపీఎల్‌లో కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగిన తొలి ప్లేయర్‌గా గుజరాత్ జెయింట్స్‌కు చెందిన సయాలీ సద్‌గరే గుర్తింపు తెచ్చుకుంది. జెయింట్స్ ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో ఢిల్లీ బ్యాటర్ జొనాసెన్ షాట్ కొట్టగా డీప్ మిడ్ వికెట్ వద్ద క్యాచ్‌ను అందుకునే క్రమంలో హేమలత పట్టు తప్పింది. క్యాచ్ చేజారగా... బంతి ఆమె నుదుటికి బలంగా తాకింది. దాంతో కన్‌కషన్‌తో హేమలత మైదానం వీడింది. గుజరాత్ తరఫున పదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన సయాలీ 7 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది.

లయన్‌కు 6 వికెట్లు

తొలి టెస్టులో న్యూజిలాండ్‌పై ఆస్ట్రేలియా ఘనవిజయం

వెలింగ్టన్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియాదే పైచేయి అయింది. మ్యాచ్ నాలుగో రోజు ఆదివారం ముగిసిన ఈ టెస్టులో ఆసీస్ 172 పరుగుల తేడాతో కివీస్‌పై విజయం సాధించింది. ఆస్ట్రేలియా ఆఫ్ స్పిన్నర్ నాథన్ లయన్ (6/65) ఆరు వికెట్ల అద్భుత బౌలింగ్ ప్రదర్శన ముందు సొంతగడ్డపై న్యూజిలాండ్ నిలవలేకపోయింది. 369 పరుగుల లక్ష్యాన్ని అందుకునే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 111/3తో ఆట కొనసాగించిన కివీస్ 64.4 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌటైంది. టాప్ స్కోరర్ రచిన్ రవీంద్ర (59) ఏడో ఓవర్లో వెనుదిరగడంతోనే జట్టు పతనం మొదలైంది. బ్లన్‌డెల్ (0), ఫిలిప్స్ (1) విఫలం కాగా స్కాట్ కుగ్‌లీన్ (26) కొద్దిసేపు నిలబడ్డాడు. క్రీజ్‌లో పట్టుదల కనబర్చిన డరైల్ మిచెల్ (38)ను హాజల్‌వుడ్ చివరి వికెట్‌గా అవుట్ చేయడంతో సిరీస్‌లో ఆసీస్ 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలి ఇన్నింగ్స్‌లో కీలక సెంచరీ సాధించిన కామెరాన్ గ్రీన్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన లయన్ మ్యాచ్‌ను 10/108తో ముగించాడు. లయన్ ఒక ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టడం ఇది 24వసారి కాగా, మ్యాచ్‌లో 10 వికెట్లు తీయడం ఐదోసారి కావడం విశేషం. రెండో టెస్టు శుక్రవారం నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో జరుగుతుంది.



శార్దుల్ శతకం...

- భారీ ఆధిక్యంలో ముంబై
- తమిళనాడుతో రంజీ సెమీస్


శార్దుల్ ఠాకూర్

ముంబై: దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో 41 సార్లు చాంపియన్ అయిన ముంబై రెండో సెమీఫైనల్లో భారీ ఆధిక్యంలోకి దూసుకెళుతోంది. తమిళనాడుతో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో లోయర్ ఆర్డర్ బ్యాటర్ శార్దుల్ ఠాకూర్ (105 బంతుల్లో 109; 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) అనూహ్యంగా చెలరేగాడు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 100 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 353 పరుగులు చేసింది. ప్రస్తుతం ముంబై 207 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 45/2తో ఆట కొనసాగించిన ముంబైని తమిళనాడు స్పిన్నర్ సాయికిశోర్ (6/97) తిప్పేశాడు. ముషీర్ ఖాన్ (131 బంతుల్లో 55; 6 ఫోర్లు) ఒక్కడే రాణించగా... ఒకదశలో 106/7తో పీకల్లోతు కష్టాల్లో పడిన ముంబైని శార్దుల్ అసాధారణ పోరాటంతో ఆదుకున్నాడు. ఎనిమిదో వికెట్‌కు హార్దిక్ తమోర్ (92 బంతుల్లో 35; 3 ఫోర్లు)తో కలిసి 105 పరుగులు... తొమ్మిదో వికెట్‌కు తనుష్ కొటియన్ (109 బంతుల్లో 74 బ్యాటింగ్; 10 ఫోర్లు)తో కలిసి శార్దుల్ 79 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తొలి శతకం పూర్తి చేసుకున్నాక కుల్దీప్‌సేన్ (2/65) బౌలింగ్‌లో శార్దుల్ నిష్క్రమించాడు. తర్వాత టెయిలెండర్లు తనుష్, తుషార్ దేశ్‌పాండే (17 బ్యాటింగ్, 2 ఫోర్లు) జట్టు స్కోరును 300 పైచిలుకు తీసుకెళ్లారు. అబేధ్యమైన పదో వికెట్‌కు 63 పరుగులు జోడించారు.

మధ్యప్రదేశ్‌కు ఆధిక్యం


హిమాన్షు

నాగ్‌పూర్: రంజీ ట్రోఫీలో విదర్భతో జరుగుతున్న మొదటి సెమీఫైనల్లో మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 82 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 47/1తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన మధ్యప్రదేశ్ 94.3 ఓవర్లలో 252 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ హిమాన్షు మంత్రి (265 బంతుల్లో 126; 13 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. మిగతా వారిలో సారాంశ్ జైన్ (30; 1 ఫోర్, 1 సిక్స్), హర్ష్ గావ్లీ (25; 3 ఫోర్లు), సాగర్ సోలంకి (26; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. విదర్భ బౌలర్లు ఉమేశ్ యాదవ్, యశ్ ఠాకూర్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో వికెట్ నష్టానికి 13 పరుగులు చేసింది. ధ్రువ్ షోరే (10 బ్యాటింగ్), అక్షయ్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువ క్రికెటర్‌కు గాయాలు

ఐపీఎల్ వేలంలో రూ. 3 కోట్ల 60 లక్షలు దక్కించుకున్న రాబిన్ మింజ్



రాంచీ: గతేడాది నిర్వహించిన ఐపీఎల్ మినీ వేలంలో రూ. 3 కోట్ల 60 లక్షలు దక్కించుకున్న యువ వికెట్‌కీపర్ బ్యాటర్ రాబిన్ మింజ్ రోడ్డు ప్రమాదం బారిన పడ్డాడు. 21 ఏళ్ల రాబిన్ అనూహ్య ధరతో అందరికంటా పడ్డాడు. జార్ఖండ్‌కు చెందిన గిరిజన క్రికెటర్‌ను గుజరాత్ టైటాన్స్ కొనుగోలు చేసింది. రాబిన్ ఈనెల 22 నుంచి మొదలయ్యే ఐపీఎల్ సీజన్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాడు. ఇంతలో ప్రమాదానికి గురయ్యాడు. అతను బైక్‌పై వెళ్తుంటే వాహనం ఢీ కొట్టడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై ఆందోళన చెందాల్సిన పనిలేదని స్వయంగా క్రికెటర్ తండ్రి ఫ్రాన్సిస్ తెలిపారు. స్వల్పగాయాలైన అతను స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు చెప్పారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

అధ్యాపక కొలువుకు అర్హత పరీక్ష

ఏపీసెట్-2024

» ఏపీ సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల
» మొత్తం 30 సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహణ

ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలు, కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, లెక్చరర్లుగా చేరాలనుకునే అభ్యర్థుల ప్రతిభ, నైపుణ్యాలను అంచనా వేసేందుకు నిర్వహించే అర్హత పరీక్ష.. ఏపీసెట్(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష). ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారు రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో, డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత లభిస్తుంది. తాజాగా ఆంధ్రా యూనివర్సిటీ ఏపీసెట్-2024 ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఏపీసెట్‌కు దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ తదితర వివరాలు..

మొత్తం 30 సబ్జెక్టులు

ఏపీసెట్‌లో మొత్తం 30 సబ్జెక్టులు ఉంటాయి. వీటిలో కామర్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ సబ్జెక్ట్‌లు రెండు భాషల్లో (తెలుగు/ఇంగ్లిష్) నిర్వహిస్తారు. మిగతా సబ్జెక్టులు ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటాయి. అభ్యర్థులు తాము చదివిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ సబ్జెక్ట్ సెట్ జాబితాలో లేకుంటే.. ఏదైనా ఇతర సంబంధిత సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

సబ్జెక్టులు

జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్ (పేపర్-1), ఆంత్రోపాలజీ, హిస్టరీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్-అట్మాస్ఫియరిక్-ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, హిందీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, లా, లైఫ్ సైన్సెస్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్స్ సైన్స్, మేనేజ్‌మెంట్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సంస్కృతం, సోషియాలజీ, సోషల్ వర్క్, తెలుగు, ఉర్దూ, విజువల్ ఆర్ట్స్ సబ్జెక్టులపై పరీక్ష ఉంటుంది.

అర్హతలు

గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కనీసం 55శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులతో పీజీ పూర్తిచేయాలి. పీజీ చివరి సంవత్సరం విద్యార్థులు/పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

పరీక్ష విధానం

» ఏపీసెట్ పరీక్ష ఆఫ్‌లైన్ (పెన్-పేపర్) విధానంలో జరుగుతుంది. ఇందులో రెండు పేపర్లు 1, పేపర్ 2 ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలు-100 మార్కులకు, పేపర్-2లో 100 ప్రశ్నలు-200 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష సమయం 3 గంటలు.
» పేపర్-1లో.. టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌ను అన్ని విభాగాల అభ్యర్థులు రాయాల్సి ఉంటుంది. ఈ పేపర్ తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది.
» పేపర్-2 పరీక్ష అభ్యర్థి పోస్టుగ్రాడ్యుయేషన్ ఏ విభాగంలో పూర్తిచేశారో దానిపై ఉంటుంది.

టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ (పేపర్-1)

» ఈ పేపర్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌పై ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. ఇది అందరూ రాయాల్సిన కామన్ పేపర్. మొత్తం 50 ప్రశ్నలు -100 మార్కులకు పేపర్-1 పరీక్ష జరుగుతుంది. ప్రతి సరైన సమాధానానికి 2 మార్కుల చొప్పున కేటాయించారు. ఎలాంటి నెగిటివ్ మార్కులు లేవు. తెలుగు/ఇంగ్లిష్‌లో ప్రశ్నపత్రం ఉంటుంది. ఈ పేపర్‌కు కేటాయించిన సమయం ఒక గంట మాత్రమే.
» పేపర్-1లో టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, మ్యాథమెటికల్ రీజనింగ్ అండ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్ ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ), పీపుల్, డెవలప్‌మెంట్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
» **ఎలక్టివ్ సబ్జెక్ట్ (పేపర్-2):** ఇది అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్ట్ (ఎలక్టివ్)కు సంబంధించిన పేపర్. ఇందులో ఆబ్జెక్టివ్ తరహ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. మొత్తం 100 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ప్రతి సరైన సమాధానానికి రెండు మార్కుల చొప్పున కేటాయించారు.

ప్రిపరేషన్ ఇలా

» ఈ పరీక్షలో అందరికీ కామన్‌గా ఉండే పేపర్-1 ఎంతో కీలకమైంది. ఈ పేపర్ సిలబస్ కొంత భిన్నంగా ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు తొలుత పేపర్-1పై దృష్టిపెట్టి ప్రిపరేషన్ కొనసాగించాలి. » పేపర్-2లో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.
ఇది అభ్యర్థి పీజీ స్థాయిలో చదివిన సబ్జెక్ట్. దీనికోసం యూజీసీ గతంలో నిర్వహించిన నెట్ ప్రశ్నపత్రాలు, సెట్ గత పేపర్లను పరిశీలించి సన్నద్ధం కావాలి.

ముఖ్యసమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:06.03.2024
» ఏపీసెట్ పరీక్ష తేదీ: 28.04.2024
» వెబ్‌సైట్: https://apset.net.in

లైఫ్ సైన్సెస్‌లో.. పీజీ, పీహెచ్‌డీ

» జీఏటీ-బి, బీఈటీ-2024 నోటిఫికేషన్ విడుదల
» బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్‌లో పీజీ, పీహెచ్‌డీ
» పీజీ స్థాయి నుంచే ఆర్థిక ప్రోత్సాహకం
» లైఫ్ సైన్సెస్ విద్యార్థులకు చక్కటి అవకాశం

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్- బయోటెక్నాలజీ.. జీఏటీ-బి! బయో టెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్.. బీఈటీ!! నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ.. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షల స్కోర్ ఆధారంగా.. దేశంలోని ప్రముఖ యూనివర్సిటీల్లో.. లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీల్లో పీజీ, పీహెచ్‌డీల్లో ప్రవేశాలు పొందొచ్చు! అదే విధంగా.. పీజీ స్థాయిలోనే ఆర్థిక ప్రోత్సాహకం అందుకోవచ్చు!! తాజాగా.. 2024కు సంబంధించి జీఏటీ-బి, బీఈటీలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. జీఏటీ-బి, బీఈటీల ప్రత్యేకత, పరీక్ష విధానం, ప్రవేశ విధానాలు, భవిష్యత్తు అవకాశాలపై ప్రత్యేక కథనం..


జీఏటీ-బి, బీఈటీ 2024

పీజీలో ప్రవేశానికి జీఏటీ-బి

జీఏటీ-బి టెస్ట్‌లో స్కోర్ ఆధారంగా.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ నెలకొల్పిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ గుర్తింపు పొందిన యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ స్పెషలైజేషన్లలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో 77 యూనివర్సిటీల్లో అగ్రి బయోటెక్, ప్లాంట్ బయో టెక్నాలజీ, ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్, బయోమెడికల్ టెక్నాలజీ, కంప్యుటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ తదితర స్పెషలైజేషన్లతో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 30 సీట్లు, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్‌లో 10 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- జీఏటీ-బి స్కోర్ ఆధారంగా ఆయా యూనివర్సిటీల నిబంధనల మేరకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పీజీ కోర్సుల్లో సీటు సొంతం చేసుకుంటే.. స్టైఫండ్ కూడా అందిస్తారు. ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ, అనుబంధ విభాగాల విద్యార్థులకు నెలకు రూ.5 వేలు చొప్పున; ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ విద్యార్థులకు నెలకు రూ.7.5 వేలు చొప్పున; ఎంటెక్/ఎంవీఎస్సీ స్పెషలైజేషన్ల విద్యార్థులకు నెలకు రూ.12 వేలు చొప్పున రెండేళ్ల వ్యవధికి ఈ స్టయిఫండ్ అందిస్తారు.

బీఈటీతో జేఆర్ఎఫ్

బీఈటీలో మెరిట్ ఆధారంగా యూనివర్సిటీలు, డీబీటీ లేబొరేటరీలు, డీబీటీ స్పాన్సర్డ్ రీసెర్చ్ ప్రోగ్రామ్స్‌లో పీహెచ్‌డీ ప్రవేశం లభిస్తుంది. పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన వారికి తొలి రెండేళ్లు నెలకు రూ.31 వేలు చొప్పున జేఆర్ఎఫ్. తర్వాత మరో మూడేళ్లు నెలకు రూ.35 వేలు చొప్పున ఎస్ఆర్ఎఫ్ అందుతుంది. వీటితోపాటు హౌస్ రెంట్ అలవెన్స్, మెడికల్ అలవెన్స్, రీసెర్చ్ కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన వనరులు సమకూర్చుకోవడానికి సరిపడే మొత్తంతో ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుంది.

అర్హతలు

- **జీఏటి-బి:** పీజీలో ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్‌కు సంబంధించిన సబ్జెక్ట్‌లతో లైఫ్ సైన్సెస్, వెటర్నరీ సైన్స్, ఎంబీబీఎస్, ఫార్మసీ, అగ్రికల్చర్ తదితర సబ్జెక్ట్‌లతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. మలి దశలో ఆయా యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకునే క్రమంలో సంబంధిత యూనివర్సిటీలు నిర్దేశించిన శాతంతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- **బీఈటీ:** బీఈ/బీటెక్/ఎంబీబీఎస్/ఎమ్మెస్సీ/ఎంటెక్/ఎంవీఎస్సీ/ఎం.ఫార్మసీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంటెక్‌లలో బయోటెక్నాలజీ, బయో మెడికల్, బయో ఇన్ఫర్మాటిక్స్, బయె కెమిస్ట్రీ, బయో ఫిజిక్స్, బోటనీ, కెమిస్ట్రీ, కంప్యుటేషనల్ బయాలజీ, జెనెటిక్స్, మైక్రోబయాలజీ, జువాలజీ లేదా బయాలజీ/లైఫ్ సైన్సెస్ అనుబంధ ఇతర సబ్జెక్ట్‌లతో కనీసం 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

- దరఖాస్తు చివరి తేదీ నాటికి జనరల్, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు 33 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 31 ఏళ్లుగా గరిష్ట వయో పరిమితిని నిర్ణయించారు.

240 మార్కులకు జీఏటీ-బి

- బయో టెక్, లైఫ్ సైన్సెస్‌లలో పీజీ స్పెషలైజేషన్లలో ప్రవేశానికి నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను రెండు సెక్షన్లుగా, ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో 240 మార్కులకు నిర్వహిస్తారు.
- సెక్షన్-ఎలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, బయాలజీ సబ్జెక్ట్‌ల నుంచి 60 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొపున 60 మార్కులు ఉంటాయి.
- సెక్షన్-బిలో బేసిక్ బయాలజీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అనుబంధ విభాగాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 60 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 180 మార్కులకు సెక్షన్-బిని నిర్వహిస్తారు.
- సెక్షన్-ఎలో ప్రతి తప్పు సమాధానానికి అర మార్కు, సెక్షన్-బిలో ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు చొప్పున నెగెటివ్ మార్కులు ఉంటాయి.
- సెక్షన్-ఎలో ప్రశ్నలు ఇంటర్మీడియెట్ స్థాయి సిలబస్‌కు సరితూగే విధంగా, సెక్షన్-బి ప్రశ్నలు బ్యాచిలర్ డిగ్రీ స్థాయి సిలబస్‌తో ఉంటాయి.
- జీఏటీ-బిలో పొందిన స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలో మెరిట్ జాబితాను రూపొందిస్తారు.

300 మార్కులకు బీఈటీ

- డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీకి చెందిన రీసెర్చ్ కేంద్రాల్లో పీహెచ్‌డీ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు నిర్వహించే బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్‌ను మూడు వందల మార్కులకు రెండు సెక్షన్లుగా నిర్వహిస్తారు.
- సెక్షన్-ఎలో జనరల్ సైన్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, జనరల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, జనరల్ బయోటెక్నాలజీ సబ్జెక్ట్‌ల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 150 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- సెక్షన్-బిలో బయోటెక్నాలజీకి సంబంధించిన అంశాల నుంచి 150 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున మొత్తం 150 మార్కులు కేటాయిస్తారు.
- మొత్తం 300 మార్కులకు నిర్వహించే ఈ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

రెండింటికీ అవకాశం

పీహెచ్‌డీలో ప్రవేశాలకు నిర్వహించే బీఈటీ ఎంట్రన్స్‌కు బీఈ, బీటెక్, ఎంబీబీఎస్‌లను కూడా అర్హతగా పేర్కొన్నారు. దీంతో పలు కోర్సుల ఉత్తీర్ణులు.. జీఏటి-బి, బీఈటీ రెండు పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయితే వారు రెండింటికీ వేర్వేరుగా ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

సబ్జెక్టుపై పట్టుతోనే విజయం

జీఏటీ-బి, బీఈటీలలో బెస్ట్ స్కోర్ సొంతం చేసుకోవాలంటే.. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న స్పెషలైజేషన్ ఆధారంగా బ్యాచిలర్ స్థాయిలో సంబంధిత సబ్జెక్ట్‌లలో పరిపూర్ణ నైపుణ్యం సొంతం చేసుకోవాలి. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలు అభ్యర్థుల్లో ఆయా అంశాల పట్ల ఉన్న పూర్తి అవగాహనను పరీక్షించే విధంగా ఉంటున్నాయి. కాబట్టి బ్యాచిలర్ స్థాయి పుస్తకాల్లోని అంశాలను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ప్రాథమిక భావనలకు సంబంధించి పూర్తి అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు జీప్యాట్, గేట్, జీఏటీ-బి, బీఈటీల పాత ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

భవిష్యత్తు అవకాశాలు

జీఏటి-బి స్కోర్‌తో పీజీ పూర్తి చేసుకున్న వారికి.. సదరు స్పెషలైజేషన్‌ను అనుసరించి బయోటెక్నాలజీ సంస్థలు, ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సంస్థలు, ఫార్మాస్యుటికల్ సంస్థలు, హెల్త్‌కేర్ ఇండస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్‌లోని సంస్థల్లో ప్రొడక్షన్, మానిటరింగ్ విభాగాల్లో కొలువులు లభిస్తున్నాయి. ప్రారంభంలోనే సగటున నెలకు రూ. 50 వేల వరకు వేతనం అందుకునే అవకాశముంది. అదేవిధంగా బీఈటీ ద్వారా పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న వారికి ఐఐసీటీ, సీసీఎంబీ వంటి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని రీసెర్చ్ ల్యాబ్స్‌లో రీసెర్చ్ అసోసియేట్ హోదాలో కొలువులు లభిస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024 మార్చి 6
- దరఖాస్తు సవరణ అవకాశం: మార్చి8, 9 తేదీల్లో
- జీఏటీ-బి, బీఈటీల పరీక్ష తేదీ: ఏప్రిల్ 20 (జీఏటి-బీ ఉదయం 9 - 12; బీఈటీ మధ్యాహ్నం 3-6 గంటల వరకు)
- వెబ్‌సైట్: https://exams.nta.ac.in/DBT, www.nta.ac.in

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శనివారం ముగింపు)		
సెన్సెక్స్ ▲ 61	73,806	
నిఫ్టీ ▲ 40	22,378	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	16,275	▲	183
డోజోన్స్	39,087	▲	91
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,683	▲	52
డాక్స్	17,735		0
షాంఘై	3,027	▲	12
నికాయ్	39,940	▲	751

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.47	83.49
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.55	106.11
€	యూరో	ఎస్‌బీఐ	88.60	90.95
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.58	55.81
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.07	54.99
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.27	63.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.20	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.67	23.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

తీవ్ర వ్యాధులపై బ్రహ్మాస్త్రం..!



- క్రిటికల్ ఇల్‌నెస్ ఇన్సూరెన్స్
- మారిన జీవనశైలితో వ్యాధుల ముప్పు
- వీటికి మెరుగైన చికిత్సలు
- కానీ, వీటి ఖరీదు ఎక్కువే
- సాధారణ హెల్త్ ప్లాన్ ఒక్కటీ చాలదు
- తీవ్ర వ్యాధి వచ్చినా బతికుంటేనే పరిహారం!

జీవనశైలి వ్యాధుల ముప్పు పెరుగుతోంది. అదే సమయంలో వైద్య శాస్త్రం పురోగతి, అత్యాధునిక టెక్నాలజీ, రోబోటిక్ పుణ్యమా అని మెరుగైన చికిత్సా విధానాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. కనుక ఇప్పుడు ఏదైనా తీవ్ర ఆరోగ్య సమస్య వస్తే, వైద్యుల కృషితో విజయవంతంగా అధిగమించొచ్చు. కానీ, ఇందుకు కావాల్సిందల్లా ముందస్తు సన్నద్ధత. అందుకే ఆరోగ్య బీమా ఎంత అవసరమో.. క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ కూడా అంతే ముఖ్యమని తెలుసుకోవాలి. సాధారణ ఆరోగ్య బీమా పాలసీలో.. అనుకోకుండా ఆస్పత్రిలో చేరాల్సి వచ్చినప్పుడు, ముందస్తుగా అనుకుని ఆస్పత్రిలో చేరి తీసుకునే చికిత్సలకు కవరేజీ వర్తిస్తుంది. కానీ, ఏదైనా క్రిటికల్ ఇల్‌నెస్ (మొండి వ్యాధులు, తీవ్ర అనారోగ్యం) కారణంగా ఎక్కువ రోజుల పాటు చికిత్స అవసరం పడితే ఏంటి పరిస్థితి..? రెగ్యులర్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఉన్న కవరేజీ సరిపోతుందా..? చాలకపోవచ్చు. రెగ్యులర్ ఇండెమ్నిటీ హెల్త్ ఇన్సూరెన్స్ అన్ని రకాల వ్యాధుల్లోనూ గట్టెక్కిస్తుందని అనుకోవద్దు. తీవ్ర వ్యాధుల్లో చికిత్సల ఖరీదు ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ రోజుల పాటు ఆస్పత్రిలో ఉండాల్సి వస్తే అప్పుడు ఆదాయం ఆగిపోవచ్చు. ఇలాంటి సందర్భాలను అధిగమించేందుకు క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ ఆదుకుంటుంది.



క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ విడిగా ప్లాన్ రూపంలోనూ లేదంటే రైడర్ రూపంలోనూ తీసుకోవచ్చు. పాలసీలో పేర్కొన్న ఏదైనా వ్యాధి బారిన పడినట్టు తేలితే నిబంధనల మేరకు పరిహారాన్ని బీమా సంస్థలు ఒకే విడత చెల్లించేస్తాయి. ఇండెమ్నిటీ పాలసీలు కేవలం ఆస్పత్రిలో అయ్యే వ్యయాలకే పరిహారాన్ని చెల్లిస్తాయి. క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ అలా కాదు. ఏక మొత్తంలో చెల్లింపులు చేస్తాయి. దీంతో ఆయా తీవ్ర వ్యాధుల చికిత్సకు అయ్యే భారీ వ్యయాలను తట్టుకోగలరు. క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ కింద ఏకమొత్తంలో వచ్చిన పరిహారాన్ని దేనికి అయినా వినియోగించుకోవచ్చు. చికిత్స కోసమే వినియోగించాలని లేదు. కనుక రెగ్యులర్ ఇండెమ్నిటీ ఆధారిత ఆరోగ్య బీమా పాలసీ కింద ఆస్పత్రిలో చికిత్స తీసుకుని, అదనంగా అయ్యే వ్యయాలను క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీతో గట్టెక్కొచ్చు. కానీ, క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ తీసుకున్న వెంటనే అమల్లోకి రాదు. ఓ చిన్న కొర్రీ ఉంటుంది. అదే సర్వైవల్ పీరియడ్. అలాగే, మరికొన్ని షరతులు కూడా ఉంటాయి. వీటిపై అవగాహనతోనే క్రిటికల్ ఇల్‌నెస్ కవర్ తీసుకోవాలి.



సర్వైవల్ పీరియడ్

క్రిటికల్ ఇల్‌నెస్ కవర్‌ను ఇండివిడ్యువల్ ప్లాన్‌గాను, లేదంటే రైడర్‌గానూ తీసుకోవచ్చు. జీవిత బీమా కంపెనీలు దీన్ని ఎండోమెంట్, టర్మ్ ప్లాన్లకు రైడర్‌గా అందిస్తుంటే.. హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు స్టాండలోన్ పాలసీగా ఆఫర్ చేస్తున్నాయి. వీటిల్లో సర్వైవల్ పీరియడ్ (జీవించి ఉండే కాలం) అనే క్లాజ్ ఉంటుంది. ఏదేనీ క్రిటికల్ ఇల్‌నెస్ (జాబితాలోని) బారిన పడితే పరిహారం అన్నది, వెంటనే రాదు. క్లెయిమ్ చేసుకోవాలంటే, వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత నిర్ణీత రోజుల పాటు పాలసీదారు జీవించి ఉండాలి. ఉదాహరణకు 30 రోజుల సర్వైవల్ పీరియడ్ ఉందనుకోండి. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాతి నుంచి 30 రోజుల పాటు జీవించి ఉన్నప్పుడే క్లెయిమ్‌కు అర్హత వస్తుంది. ఈ 30 రోజుల్లోపు మరణించినట్టయితే బీమా సంస్థ నుంచి పరిహారం పొందేందుకు అర్హత లభించదు. ''ఇన్సూరెన్స్ కంపెనీలు సాధారణంగా 30 రోజుల సర్వైవల్ పీరియడ్ అమలు చేస్తుంటాయి. కొన్ని కంపెనీలు ఈ సర్వైవల్ పీరియడ్‌ను తగ్గించుకునే ఆప్షన్ ఇస్తున్నాయి. బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ అయితే 30 రోజుల కాలాన్ని, 15 రోజులకు తగ్గించేందుకు అంగీకరిస్తోంది. ఇందుకు గాను 5 శాతం అదనంగా ప్రీమియంను చార్జ్ చేస్తోంది. మరో 5-10 శాతం అదనపు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు వస్తే, అప్పుడు సర్వైవల్ పీరియడ్ 7 రోజులకు లేదంటే సున్నాకు తగ్గిస్తోంది''అని ప్రమోట్ ఫిన్‌టెక్ సంస్థ సహ వ్యవస్థాపకుడు నిషా సంఘ్వి తెలిపారు.

వెయిటింగ్ పీరియడ్..

పాలసీ కొనుగోలు చేసిన రోజు నుంచి 90-180 రోజుల వరకు క్రిటికల్ ఇల్‌నెస్ బారిన పడినా కానీ, క్లెయిమ్‌కు అర్హత లభించదు. ఈ వెయిటింగ్ పీరియడ్ తర్వాత నుంచి పాలసీ అమలు సమయంలో ఎప్పుడైనా వ్యాధి నిర్ధారణ అయితే క్లెయిమ్ చేసుకోవచ్చు. అంటే పాలసీ తీసుకున్నా కానీ, కవరేజీ లేని కాలంగా దీన్ని పరిగణించాల్సి ఉంటుంది. ప్రముఖ బీమా సంస్థలు ఎక్కువ శాతం 90 రోజుల వెయిటింగ్ పీరియడ్‌ను అమలు చేస్తున్నాయి.

ఎన్నింటికి కవరేజీ..?

క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్‌లో మొత్తంగా ఎన్ని వ్యాధులకు కవరేజీ వరిస్తుందన్నది ముఖ్యంగా చూడాల్సిన అంశాల్లో ఒకటి. ఎందుకంటే నేడు జీవనశైలి వ్యాధుల ముప్పు గణనీయంగా పెరిగిపోయింది. మరీ ముఖ్యంగా గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులు, కేన్సర్ రిస్క్ ఎక్కువగా ఉంటోంది. కొన్ని పాలసీలు లేదా రైడర్‌లు 10-20 వ్యాధులకు కవరేజీ ఆఫర్ చేస్తున్నాయి. 60 నుంచి 99 వ్యాధుల వరకు కవరేజీనిచ్చేవీ ఉన్నాయి. ఎన్ని ఎక్కువ వ్యాధులకు కవరేజీ ఉంటే, అంత మంచిదనుకుంటారేమో..? కానీ, ఇది తప్పుడు అభిప్రాయం. తీసుకునే ప్లాన్‌లో ముఖ్యమైన వ్యాధులకు, అది కూడా సమగ్రమైన కవరేజీ ఉందా? అన్నదే కీలకం. ''60 లేదా అంతకంటే ఎక్కువ వ్యాధులకు కవరేజీనిచ్చే ప్లాన్, కేన్సర్‌ను పలు దశలుగా వేరు చేసి ఆఫర్ చేయవచ్చు. మరో పాలసీలో కేవలం 25 వ్యాధులకే కవరేజీ ఉండొచ్చు. ఈ ప్లాన్ అన్ని కేన్సర్‌లను ఒక్కటిగానే పరిగణించి, నిర్ధారణ అయిన వెంటనే క్లెయిమ్‌కు అనుమతించొచ్చు''అని ఎలిఫెంట్ డాట్ ఇన్ (అలియన్స్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్) ప్రొడక్ట్ హెడ్ కల్పేష్ చవాన్ పేర్కొన్నారు. నిపుణులు చెబుతున్న దాని ప్రకారం టాప్-5 తీవ్ర వ్యాధులకు సంబంధించి 90% క్లెయిమ్‌లు వస్తున్నాయి. టాప్-10 క్రిటికల్ ఇల్‌నెస్‌లు కాకుండా, ఇతర వ్యాధుల కారణంగా వచ్చే క్లెయిమ్‌లు చాలా తక్కువ. కనుక దాదాపు 60 అంతకంటే ఎక్కువ వ్యాధులకు కవరేజీ ఉందంటే, వాటి బారిన పడే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నట్టు అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ ఇక్కడ ఏ ప్లాన్ తీసుకోవాలనే సందేహం రావచ్చు. అధిక వ్యాధులకు కవరేజీ ఇస్తూ, అందులో ఒక్కో వ్యాధి వారీ కవరేజీ పరిమితి లేకపోవడం, ఉన్నా మెరుగైన కవరేజీ, అన్ని కేన్సర్‌లను ఒకటిగానే పరిగణించేట్టు అయితే ఆ ప్లాన్‌ను తీసుకోవచ్చు. లేదంటే ఎలాంటి షరతుల్లేకుండా ఆఫర్ చేసే క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్, అది టాప్ 25-30 వ్యాధులకు కవరేజీ ఇచ్చేది అయినా నిస్సందేహంగా తీసుకోవచ్చు. సంఖ్య కంటే షరతులు, కవరేజీకే ప్రాధాన్యం ఇవ్వాలి.

రైడర్ - స్టాండెలోన్ ప్లాన్

క్రిటికల్ ఇల్‌నెస్‌ను రైడర్‌గా లేదంటే, స్టాండలోన్ పాలసీగా తీసుకుంటే ఏవైనా వ్యత్యాసాలు ఉంటాయా? అన్న సందేహం కలగొచ్చు. రైడర్ రూపంలో అయితే సులభంగా తీసుకోవచ్చు. బీమా పాలసీ తీసుకునే సమయంలోనే ఈ రైడర్‌ను కూడా ఎంపిక చేసుకుంటే, ఒకేసారి వైద్య పరీక్షలు చేస్తారు కనుక, మళ్లీ విడిగా తీసుకోవడాన్ని నివారించొచ్చు. కాకపోతే టర్మ్ ఇన్సూరెన్స్‌తోపాటు తీసుకుంటే కవరేజీ పరంగా పరిమితి ఉంటుంది. జీవిత బీమా కవరేజీ మించి క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్ కవరేజీ తీసుకోవడానికి అనుమతించరు. అంటే కోరుకున్నంత కవరేజీ తీసుకోవడానికి ఇక్కడ అవకాశం ఉండదు. జీవిత బీమా ప్లాన్‌తో వచ్చే రైడర్లలో సాధారణంగా వ్యాధి ముదిరిన దశలోనే కవరేజీ అనే షరతు ఉంటుంది. ఉదాహరణకు కేన్సర్ మొదటి దశను ఇవి కవర్ చేయవు. అలాగే, రైడర్‌ల లోనూ రెండు రకాలు ఉన్నాయి. కాంప్రహెన్సివ్ రైడర్ అయితే, బేస్ పాలసీ కవరేజీకి అదనంగా ఉంటుంది. యాక్సిలరేటెడ్ రైడర్ అయితే, బేస్ పాలసీలో భాగంగానే కవరేజీ ఉంటుంది. యాక్సిలరేటెడ్ రైడర్ తీసుకుని ఏదైనా తీవ్ర వ్యాధి బారిన పడి క్లెయిమ్‌కు వెళితే, ఆ మేరకు బేస్ కవరేజీ తగ్గిపోతుంది. స్టాండలోన్ క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్‌లో కవరేజీ విస్తృతంగా ఉంటుంది. పైగా జీవిత బీమా లేదా టర్మ్ ఇన్సూరెన్స్‌తో తీసుకునే క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్ జీవితాంతం పనిచేయదు. జీవిత బీమా ఎంత కాలానికి తీసుకుంటారో? అంత వరకే పరిమితం అవుతుంది. విడిగా తీసుకుంటే మీరు జీవితాంతం రెన్యువల్ చేసుకోవచ్చు. పాలసీ వర్డింగ్స్ డాక్యుమెంట్ సమగ్రంగా చదవడం ద్వారా వేటికి కవరేజీ వస్తుంది, వేటికి రాదు? షరతులు అన్నీ తెలుస్తాయి. స్టాండలోన్ ప్లాన్ ప్రీమియం,



రైడర్‌తో పోలిస్తే ఎక్కువగా ఉంటుంది. స్టాండలోన్ ప్లాన్‌లో ప్రీమియం ప్రతి కొన్నేళ్లకోసారి పెరుగుతూ వెళుతుంది. ఈ పెరుగుదల, రైడర్‌తో పోల్చినప్పుడు అధికంగా ఉంటుంది. రైడర్‌లో కొన్ని అనుకూలతలు ఉన్నప్పటికీ, ప్రతికూలతలను సైతం పరిగణనలోకి తీసుకోవాలి. జీవితాంతం రెన్యువల్‌కు అవకాశం ఉందా? వ్యాధులకు విస్తృతమైన కవరేజీ ఉందా? సర్వైవల్ పీరియడ్ జీరో లేదంటే 7-15 రోజులుగా ఉందా? (వీలైనంత తక్కువ) అని కూడా చూడాలి. అలాగే, విడిగా ఒక్కో వ్యాధికి సంబంధించి కవరేజీ ఎందులో ఎక్కువ ఉంటే, అదే అనుకూలంగా పరిగణించొచ్చు. ఒకవేళ రైడర్ ఆకర్షణీయంగా ఉందని భావిస్తే, అప్పుడు టర్మ్ ఇన్సూరెన్స్‌ను 85-90 ఏళ్ల కాలానికి తీసుకుని, రైడర్‌ను జోడించుకోవడం సరైనది. అప్పుడు జీవితాంతం టర్మ్ ప్లాన్ ప్రీమియం చెల్లింపుల్లో వైఫల్యం లేకుండా చూసుకోవాలి. ఇక ఇప్పటికే జీవిత బీమా పాలసీ తీసుకుని ఉంటే, అటువంటి వారు ఎలాంటి సందేహం లేకుండా స్టాండలోన్ క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్‌ను తీసుకోవడం సరైనది. మరీ ముఖ్యంగా కవరేజీ విస్తృతంగా ఉండాలని చెప్పి, భారీ ప్రీమియంతో కూడిన ప్లాన్ తీసుకుంటే, ఆర్థికంగా భారం అవుతుందేమో ఓసారి ఆలోచించుకోవాలి. భవిష్యత్తులో ఏదైనా వ్యాధి బారిన పడితే, ఆర్థికంగా ఆదుకుంటుందని చెప్పి, ప్రస్తుత బడ్జెట్‌ను భారంగా మార్చుకోరాదు. కనుక తమ పూర్వీకుల ఆరోగ్య చరిత్ర, వ్యాధుల రిస్క్‌ను వైద్య నిపుణుల సూచనతో మదింపు వేసుకుని, అప్పుడు ఎంతకు కవరేజీ తీసుకోవాలనే విషయంలో స్పష్టతకు రావాలి. క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్, సాధారణ అనారోగ్యాలతో ఆస్పత్రి పాలైతే ఆదుకోదు. కనుక రెగ్యులర్ హెల్త్ ప్లాన్ తీసుకోవడం కూడా ఎంతో అవసరం. అందుకే క్రిటికల్ ఇల్‌నెస్‌ను బెనిఫిట్ ప్లాన్‌గా చెబుతారు. రెగ్యులర్ హెల్త్‌ప్లాన్, క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్‌ను ఒకే సంస్థ నుంచి తీసుకుంటే కొంత అనుకూలం.



టాప్ క్రిటికల్ ఇల్‌నెస్‌లు / చికిత్సలు

కేన్సర్, యాంజియోప్లాస్టీ(ప్రొసీజర్), హార్ట్‌ఎటాక్, అరోటా సర్జరీ, హార్ట్ వాల్వ్ వైఫల్యం, కార్డియో మయోపతి, ప్రైమరీ పల్మనరీ హైపర్ టెన్షన్, సీఏబీజీ, క్రానిక్ లంగ్ డిసీజ్, క్రానిక్ లివర్ డిసీజ్, కిడ్నీ ఫెయిల్యూర్, కోమ, స్ట్రోక్, అల్జీమర్స్, మస్క్యులర్ డిస్ట్రోఫీ, పార్కిన్సన్స్, బ్రెయిన్ సర్జరీ, పోలియోమైలైటిస్, మోటార్ న్యూరాన్ డిసీజ్, బ్యాక్టీరియల్ మెనింజైటిస, ఎన్‌సెఫలైటిస్, ఎయిడ్స్ (రక్త మార్పిడి వల్ల), థర్డ్ డిగ్రీ కాలిన గాయాలు.

కవరేజీ ఎంత..?

గుండె జబ్బులకు సంబంధించి శస్త్రచికిత్సల ఖరీదు నేడు 2-5 లక్షల మధ్య ఉంది. వైద్య ద్రవ్యోల్బణం 10 శాతం పైనే ఉంటోంది. కనుక భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత చికిత్సల చార్జీలకు ఐదు నుంచి పది రెట్లు అధికంగా కవర్ తీసుకోవాలి. లేదంటే కనీసం నాలుగైదేళ్ల వార్షిక ఆదాయానికి సమానమైన కవర్ తీసుకోవాలి. ఉదాహరణకు వార్షికాదాయం రూ.5 లక్షలు ఉందంటే, కనీసం రూ.25 లక్షలు అవసరం. ఎక్కువ రోజుల పాటు ఆస్పత్రిలో ఉండి, ఇండెమ్నిటీ హెల్త్ కవరేజీ చాలనప్పుడు, అదనంగా అయ్యే వ్యయాలను తట్టుకునేందుకు, ఆ కాలంలో నిలిచిన ఆదాయాన్ని భర్తీ చేసుకునేందుకు ఈ మాత్రమైనా ఉండాల్సిందే.



మహీంద్రా మాన్యులైఫ్ మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్

మహీంద్రా మాన్యులైఫ్ మ్యుచువల్ ఫండ్ తాజాగా మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్‌ను అందిస్తోంది. మార్చి 5 వరకు ఈ ఎన్‌ఎఫ్‌వోలో ఇన్వెస్ట్ చేయొచ్చు. ఒకే పథకం ద్వారా డైవర్సిఫైడ్ సాధనాల్లో (ఈక్విటీ, డెట్.. గోల్డ్/సిల్వర్ ఈటీఎఫ్‌లు మొదలైనవి) ఇన్వెస్ట్ చేసే ప్రయోజనాలను పొందాలనుకునే వారికి ఇది అనువైనదని సంస్థ తెలిపింది. దీని ద్వారా సమీకరించిన నిధుల్లో 35-80 శాతాన్ని ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాల్లో, 10-55 శాతాన్ని డెట్..మనీ మార్కెట్ సెక్యూరిటీల్లో, 10-30 శాతాన్ని గోల్డ్-సిల్వర్ ఈటీఎఫ్‌లు మొదలైన వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-3-2024	
విశాఖ	500-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463-00
విజయవాడ	463-00
రిటైల్ ధర (డజను)	72.00
3-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	466-00
వరంగల్	468-00
రిటైల్ ధర	5.25

ఆర్థిక ప్రభావశీలురు నుంచి రక్షణ ఎలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్



యూట్యూబ్‌లో ఎంతో మంది ఆర్థిక ప్రభావశీలురు (ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్) ఈ మధ్యకాలంలో కనిపిస్తున్నారు. పెట్టుబడులకు సంబంధించి కోర్సులు, శిక్షణను ఆఫర్ చేస్తున్నారు. ఇలాంటి వారిని అనుసరించే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? - యశస్వి పటేల్

ఆర్థిక ప్రభావశీలురకు సంబంధించి ఎలాంటి నియంత్రణలు ప్రస్తుతం అధికారికంగా అమల్లో లేవు. ఈ తరహా వ్యక్తులను సమర్థవంతంగా నియంత్రించేందుకు సెబీ చురుగ్గా సంప్రదింపులు నిర్వహిస్తోంది. వారు ఆఫర్ చేసే మార్గదర్శనం, హామీలకు సంబంధించి వారిని జవాబుదారీ చేయాలని చూస్తోంది. ఆర్థిక ప్రభావశీలురు తప్పకుండా సెబీ వద్ద రిజిస్టర్ చేసుకుని, సోషల్ మీడియా ప్రకటనల్లో రిజిస్ట్రేషన్ నంబర్ ప్రదర్శించాలంటూ భారత ప్రకటన ప్రమాణాల మండలి (ఏఎస్‌సీఐ) ఇటీవలే ఆదేశించింది. బీఎఫ్‌ఎస్‌ఐలో (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్)లో పనిచేసే ప్రతి ఒక్కరికీ ఇది వర్తిస్తుంది. కాకపోతే ఏఎస్‌సీఐ ఆదేశాల అమలుకు కొంత సమయం తీసుకుంటుంది. కనుక వీరి బారి నుంచి అప్పటి వరకు రక్షణ కోరుకునే వారు వారి సూచనలను అనుసరించకపోవడం మంచిది. వినోదం నుంచి ఆర్థిక సలహాలను వేరు చేయడం తప్పనిసరి. యూట్యూబ్ మాదిరి ప్లాట్‌ఫామ్‌లపై వీడియోలను చూస్తున్న సమయంలో సిఫారసులు కనిపిస్తుంటాయి. మార్కెట్ పనితీరు గురించి, ప్రత్యేకంగా కొన్ని స్టాక్స్ గురించి చెబుతూ ఆకర్షించే ప్రయత్నం చేస్తుంటారు. ఏది ఏమైనా కనిపించేది నిజం కాకపోవచ్చు. రాత్రికి రాత్రే ధనవంతులు అయిపోవచ్చన్న వారి ఆఫర్లు వింటే, విశ్లేషిస్తే.. అలాంటప్పుడు వారంతట వారే స్వయంగా ధనవంతులు అయిపోవచ్చుగా? అన్న సందేహం వస్తుంది. అందుకని ఎవరి సూచన అయినా పరిశీలించే ముందు వారి గతాన్ని, అనుభవాన్ని తప్పకుండా విశ్లేషించుకోవాలి.

ముందుగా రిటైర్ అయితే ఈపీఎఫ్ పరిస్థితి? ఈపీఎఫ్ బ్యాలన్స్‌పై జమ అయ్యే వడ్డీకి పన్ను మినహాయింపు కొనసాగుతుందా? - హర్షవర్ధన్

ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) అనేది ఉద్యోగి మూల వేతనం, డీఏలో 12 శాతానికి సమానమైన మొత్తం చందాగా వెళుతుంది. ఇలా నెలవారీ చేసే చందా మొత్తంపైనా సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు ఉంటుంది. ఇలా జమ అయ్యే పొదుపు మొత్తంపై వచ్చే వడ్డీపైనా పన్ను లేదు. అత్యవసర నిధిగా ఈపీఎఫ్ ఉపయోగపడుతుంది. నిజానికి ఉద్యోగుల భవిష్యనిధి అనేది రిటైర్మెంట్ కోసం. రిటైర్మెంట్ తర్వాత ఉపసంహరించుకునే మొత్తంపైనా పన్ను ఉండదు. 58 ఏళ్లు నిండిన వెంటనే ఈపీఎఫ్ సొమ్మును పూర్తిగా ఉపసంహరించుకోవచ్చు. ఒకవేళ ముందుగా పదవీ విరమణ తీసుకుంటే ఏంటి పరిస్థితి? అన్నది చూద్దాం. 58 ఏళ్లలోపు రిటైర్మెంట్ తీసుకున్న వారి ఈపీఎఫ్ ఖాతా, నాటి నుంచి మూడేళ్ల పాటు కొనసాగుతుంది. ఉదాహరణకు 52 ఏళ్ల వయసులో 2023లో రిటైర్ అయ్యారని అనుకుంటే, 2026 వరకు ఈపీఎఫ్ ఖాతా కార్యకలాపాలకు అందుబాటులో ఉంటుంది. ఈ కాలంలో ఈపీఎఫ్ నిధిపై వడ్డీ జమ అవుతుంటుంది. ప్రతి ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్‌పై వడ్డీ రేటు సవరణకు లోనవుతుంటుంది. కనుక ప్రతి ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన రేటు ప్రకారం వడ్డీ జమ అవుతుందని తెలుసుకోవాలి. ఇలా వచ్చిన వడ్డీపై పన్ను ఉంటుందా? ఉద్యోగి తరఫున యాజమాన్యం ఈపీఎఫ్ చందా జమ చేస్తున్నంత కాలం వడ్డీపై పన్ను రాయితీ కొనసాగుతుంది. ఒక్కసారి రిటైర్మెంట్ తీసుకుంటే, అప్పటి నుంచి జమ అయ్యే వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఎంత మేర వడ్డీ జమ అయితే, ఆ మేరకు ఆదాయపన్ను రిటర్నుల్లో చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కనుక ముందుగా రిటైర్మెంట్ తీసుకున్న వారు, అప్పటి నుంచి మూడేళ్లు ముగిసేలోగా నిధి మొత్తాన్ని ఉపసంహరించుకోవడం మర్చిపోవద్దు. ఎందుకంటే మూడేళ్ల తర్వాత ఖాతా నిలిచిపోతుంది. దాంతో ఆ తర్వాత వడ్డీ జమ కాదు.



స్టాక్స్ వ్యూ

ఐసీఐసీఐ బ్యాంక్ | బీఎన్‌పీ పరిబాస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,083 టార్గెట్: రూ. 1,310

ఎందుకంటే: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ నికర లాభం మా అంచనాలకంటే 8 శాతం, ప్రొవిజన్లకుముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) 4 శాతం చొప్పున అధికంగా నమోదయ్యాయి. ఇందుకు ప్రధానంగా తక్కువస్థాయిలో నమోదైన నిర్వహణ, రుణ వ్యయాలు ప్రభావం చూపాయి. ఆదాయ వ్యయ(కాస్ట్ టు ఇన్‌కమ్) నిష్పత్తి నిలకడను చూపుతూ 40.6 శాతంగా నమోదైంది. అయితే ఉద్యోగుల జత, డిజిటల్ టెక్నాలజీ వ్యయాల నేపథ్యంలో త్రైమాసికవారీగా 0.30 నీరసించింది. ఏఐఎఫ్ పెట్టుబడులపై 0.22 శాతం ప్రొవిజన్లు చేపట్టినప్పటికీ రుణ వ్యయాలు 0.37 శాతంగా నమోదయ్యాయి. ముందస్తుగా చేపట్టిన అధిక ప్రొవిజన్లను వినియోగించుకోవడం ఇందుకు కలసి వచ్చింది. నిధుల సమీకరణ వ్యయాలు 0.21 శాతం పెరగడంతో నికర వడ్డీ మార్జిన్లు 4.52 శాతానికి చేరాయి. త్రైమాసికవారీగా 0.14 శాతం బలహీనపడ్డాయి. గత మూడు త్రైమాసికాలుగా ఇదేస్థాయిలో కొనసాగుతున్నాయి. కాగా.. వార్షిక ప్రాతిపదికన కాలపరిమితి డిపాజిట్లు 31 శాతం వృద్ధిని అందుకోవడం ద్వారా మొత్తం పురోగతికి కారణంగా నిలుస్తున్నాయి. సమీప ప్రత్యర్థి సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో పోలిస్తే మార్జిన్లు తక్కువేకాగా.. కాలపరిమితి డిపాజిట్ల ధరల(వడ్డీ రేట్లు) సవరణ ప్రభావం చూపుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)వరకూ నిధుల సమీకరణ వ్యయాలు పెరిగే వీలున్నట్లు బ్యాంక్ యాజమాన్యం పేర్కొంటోంది.



ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 171 టార్గెట్: రూ. 200

ఎందుకంటే: మౌలిక దిగ్గజం ఎల్‌అండ్‌టీ గ్రూప్ కంపెనీ ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ హోల్డింగ్స్ ఈ ఆర్థిక సంవత్సరం(2023-24) మూడో త్రైమాసికంలో అంచనాలకు అనుగుణంగా రూ. 640 కోట్ల నికర లాభం ఆర్జించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో ప్రొవిజన్లకుముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) వార్షికంగా 7 శాతం బలపడి రూ. 1,340 కోట్లను తాకింది. రుణ వ్యయాలు రూ. 510 కోట్లకు చేరడంతో వార్షికంగా రుణ వ్యయాలు 2.5 శాతాన్ని తాకాయి. ఈ ఏడాది క్యూ2(జులై-సెప్టెంబర్)లో ఇవి 2.6 శాతం, క్యూ3లో 2.7 శాతంగా నమోదయ్యాయి. ఈ ఏడాది తొలి 9 నెలల్లో(ఏప్రిల్-డిసెంబర్) కంపెనీ నికర లాభం 58 శాతం జంప్‌చేసి రూ. 1,770 కోట్లకు చేరింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన సంస్థ ఆర్‌వోఏ 2.5 శాతం, ఆర్‌వోఈ 11.4 శాతంగా నమోదయ్యాయి. త్రైమాసికవారీగా ఆర్‌వోఏ 0.1 శాతం, ఆర్‌వోఈ 0.55 శాతం చొప్పున మెరుగుపడ్డాయి. రిటైల్ ఆర్‌వోఏ 0.1 శాతం పుంజుకుని 3.4 శాతానికి చేరింది. చివరి త్రైమాసికం(జనవరి-మార్చి)కల్లా రిటైల్ మిక్స్ 4 శాతం పెరిగి 95 శాతాన్ని తాకే వీలుంది. ఊపందుకున్న హోల్‌సేల్ బుక్ రన్‌డౌన్ ప్రకారం వచ్చే రెండేళ్లలో(2025-2026) కన్సాలిడేటెడ్ రుణ వృద్ధి 18 శాతం, నికర లాభం 34 శాతం చొప్పున పురోగమించవచ్చని అంచనా. వీటిని కన్సాలిడేటెడ్ ఆర్‌వోఈ 2.7 శాతం, ఆర్‌వోఈ 15 శాతం ప్రాతిపదికగా అంచనా వేశాం. కంపెనీ రిటైల్ ఫ్రాంచైజీగా ఆవిర్భవించిన నేపథ్యంలో లాభదాయకతతోపాటు.. ఆర్‌వోఏ సైతం మెరుగుపడే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే


నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో తైక్వాండో ప్రదర్శన ఇస్తున్న 11 వేల మంది బాలికలు, మహిళలు

ఇంతింతై..క్వాండో..

- ఒకేసారి తైక్వాండో ప్రదర్శన
- 11 వేల మంది బాలికలు, మహిళల విన్యాసం
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): ఒకరూ ఇద్దరూ కాదు.. ఏకంగా 11 వేల మంది బాలికలు, మహిళలు ఒకేసారి ఒక అద్భుతం చేశారు. భారీ తైక్వాండో ప్రదర్శన నిర్వహించారు. రికార్డు సృష్టించారు. దీనికి వేదికైంది నిజామాబాద్ ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు, కార్యనిర్వాహక శాఖల సహకారంతో నిర్వహించిన ఈ ప్రదర్శన ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్స్‌లో చోటు దక్కించుకుంది. సంస్థ ప్రతినిధులు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతిని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాలకు అందజేశారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ రాష్ట్ర సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ హైదరాబాద్ కార్యాలయ ప్రతినిధి వసుధ అశోక్ తదితరులు పాల్గొన్నారు.


ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాన్ని అందుకుంటున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

యాదాద్రిలో భక్తుల రద్దీ

శ్రీస్వామి దర్శనానికి 3 గంటల సమయం




యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు అధికంగా శ్రీస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ధర్మదర్శనానికి 3గంటల సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఇక శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.39,55,896 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కాగా.. మధ్యాహ్నం సమయంలో ఆలయ క్యూకాంప్లెక్స్‌లోని క్యూలైన్లు భక్తుల్లేక ఖాళీగా కనిపించాయి. ఎండ తీవ్రతకు భక్తులు మధ్యాహ్నం సమయంలో బయటకు రాలేకపోయారు.

ఏడాదిలో రూ. 12.6 కోట్ల సొత్తు రికవరీ



- కేసుల ఛేదనలో కీలకంగా ఫింగర్‌ప్రింట్ బ్యూరో
- 2023లో 47 గుర్తుతెలియని శవాల వివరాల గుర్తింపు
- ఈ ఏడాదిలో రెండు నెలల్లోనే 83 కేసుల ఛేదన

సాక్షి, హైదరాబాద్: దొంగతనాలు, దోపిడీలు సహా పలు ఆస్తి సంబంధ నేరాలు కలిపి 2023లో తెలంగాణ పోలీసులు రూ. 12.6 కోట్ల విలువైన ఆస్తులను రికవరీ చేశారు. అలాగే ఒక్క ఏడాదిలోనే 504 కేసుల ఛేదనలో వేలిముద్రల విభాగం ఇచ్చిన ఆధారాలు కీలకంగా మారాయి. ప్రపంచస్థాయి అత్యుత్తమ ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీ అయిన 'పాపిలాన్'ను వినియోగిస్తున్న తెలంగాణ ఫింగర్‌ప్రింట్ బ్యూరో కేసుల ఛేదనలోనూ భేష్ అనిపించుకుంటోంది. సీఐడీలో అత్యంత ముఖ్యమైన ఫింగర్‌ప్రింట్ బ్యూరో సిబ్బంది 2024లో ఫిబ్రవరి 15 వరకు మొత్తం 83 కేసుల ఛేదనలో పాల్గొన్నారు. అదేవిధంగా 25 గుర్తింపులేని శవాల జాడను వేలిముద్రల ఆధారంగా గుర్తించారు. మరో ఆరుగురు నేరచరిత్ర ఉన్న వారి పాస్‌పోర్టు దరఖాస్తులను రద్దు చేశారు. ఇలా చోరీలు, ఇతర నేరాలతోపాటు గుర్తింపులేని శవాల జాడ కనిపెట్టడం, పాస్‌పోర్టు దరఖాస్తుదారుల్లో నేరస్తుల గుర్తింపు, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు, చోరీ కేసులు ఛేదించి సొత్తు రికవరీలోనూ ఫింగర్‌ప్రింట్ సాంకేతికత ముఖ్యపాత్ర పోషిస్తోంది.



క్లుప్తంగా...


ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు

జర్నలిస్టు యూనియన్ ఆఫ్ స్టేట్ తెలంగాణ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జర్నలిస్టు యూనియన్ ఆఫ్ స్టేట్ తెలంగాణ (జస్ట్) పేరుతో మరో సంఘం ఏర్పాటైంది. హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవోస్ భవన్‌లో పది ఉమ్మడి జిల్లాల పాత్రికేయులు సమావేశమై ఈ మేరకు కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పాత్రికేయుడు కొండల్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం కన్వీనర్‌గా ఎంవీ రమణ, కో–కన్వీనర్లుగా పీవీ శ్రీనివాస్, జమాల్పూర్ గణేష్, బిజిగిరి శ్రీనివాస్, శశికాంత్, మల్లీశ్వరి, నాంపల్లి మురళి, సలహాదారుగా కొండల్ రావు ఎన్నికయ్యారు. పాత్రికేయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం కృషి చేస్తామని సంఘం కన్వీనర్ ఎంవీ రమణ పేర్కొన్నారు.

టీయూజేఎస్ అధ్యక్షుడిగా ఎంఎం రెహమాన్

- తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల కొత్తగా ఆవిర్భంచిన తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం (టీయూజేఎస్) అధ్యక్షుడిగా ఎం.ఎం.రెహమాన్ ఎన్నికయ్యారు. హైదరాబాద్ నాంపల్లిలోని టీజేఏస్ కార్యాలయంలో ఆదివారం సంఘం కోర్ కమిటీ సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. సంఘం ప్రధాన కార్యదర్శిగా తాటికొండ రమేశ్‌బాబు, కోశాధికారిగా యాటకర్ల మల్లేశ్, ఉపాధ్యక్షులుగా కందుకూరి రమేశ్‌బాబు, సాదిక్ పాషా, పసునూరి రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీలుగా కాజీపేట నరేందర్, జనార్దన్, బి.సుమబాల, సప్తగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అబ్బాస్ ఎన్నికయ్యారు. ఉద్యమ జర్నలిస్టుల సంఘం ప్రధాన సలహాదారుగా ఎండీ మునీర్, ఢిల్లీ ప్రతినిధిగా పి.సురేశ్‌ను కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. కాగా, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా వ్యవహరించిన కందుకూరి రమేశ్‌బాబుకు నమస్తే తెలంగాణ యాజమాన్యం రూ.వంద కోట్ల పరువు నష్టం దావా వేస్తూ నోటీసులు పంపడాన్ని టీయూజేఎస్ నూతన కార్యవర్గం ఖండించింది.

జేఎన్‌జే సొసైటీ నూతన డైరెక్టర్ల ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ (జేఎన్‌జే) మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి ఆదివారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సొసైటీలోని ఐదు డైరెక్టర్ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో పీవీ రమణారావు, ఎస్.వంశీ శ్రీనివాస్, ఆర్. రవికాంత్ రెడ్డి, బొమ్మగాని కిరణ్ కుమార్, కె.అశోక్ రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చోళ ఓం ప్రకాష్ ప్రకటించారు.

పట్టణ తలసరి వ్యయంలో తెలంగాణ టాప్

- నెలకు సగటున రూ.8,251 ఖర్చు చేస్తున్న పట్టణ ప్రజలు
- పెద్ద రాష్ట్రాలలో తెలంగాణదే అగ్రస్థానం
- సగటు భారతీయుడి నెలవారీ ఖర్చు పట్టణాల్లో రూ.6,459, గ్రామీణ ప్రాంతాల్లో రూ.3,773

హౌస్ హోల్డ్ కన్ జంప్షన్ సర్వే వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సగటు భారతీయుడి నెలవారీ ఖర్చు పట్టణాల్లో రూ.6,459 ఉంటే, అదే గ్రామీణ ప్రాంతాలకు వచ్చేసరికి రూ.3,773గా ఉన్నట్లు ఓ నివేదిక తేల్చింది. పట్టణ ప్రాంతాల్లో ఆహారేతర నెలవారీ ఖర్చు రూ.3,929 కాగా ఆహారానికి సంబంధించి రూ.2,530 వ్యయం చేస్తున్నట్లు తెలిపింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఆహారేతర ఖర్చు నెలకు రూ.2,023 కాగా ఆహారానికి రూ. 1,750 వ్యయం చేస్తున్నారు. పెద్ద రాష్ట్రాల్లో సగటు పట్టణ నెలవారీ తలసరి వ్యయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. నిత్యావసరాల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సగటు భారతీయుడి నెలవారీ ఖర్చులు ఎలా ఉంటాయి? వేటికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాడు? పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యయాల తీరు ఎలా ఉంటుంది? ఇవన్నీ అందరికీ ఆసక్తిని కలిగించే అంశాలే. ఈ నేపథ్యంలోనే..'హౌస్‌హోల్డ్ కన్‌జంప్షన్ ఎక్స్‌పెండిచర్ (గృహావసరాల వినియోగ ఖర్చు) (మంత్లీ పర్ క్యాపిటా ఎక్స్‌పెండిచర్–ఎంపీసీఈ (నెలవారీ తలసరి ఖర్చు) సర్వే 2022–23'పేరిట కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఓ సర్వే నిర్వహించింది. గతంలో కన్స్యూమర్ ఎక్స్‌పెండిచర్ సర్వే పేరిట ప్రతి ఐదేళ్లకు సర్వే నిర్వహిస్తుండగా, చివరగా 2011–12లో దీనిని నిర్వహించారు. ఇప్పుడు పదేళ్ల తర్వాత తాజా సర్వే నిర్వహించారు. అయితే సర్వేకు అనుసరించిన విధానం (మెథడాలజీ)లో మార్పుల కారణంగా గతంలో నిర్వహించిన అధ్యయనాలతో దీనిని పోల్చలేదని నేషనల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్‌వో) తెలిపింది. కాగా ఇటీవల విడుదల చేసిన ఈ సర్వే వివరాలు ఇలా ఉన్నాయి.

ఆహారేతర వ్యయం ఇలా..

ఐటెం గ్రూప్	గ్రామీణ (రూ.లలో)	పట్టణ (రూ.లలో)
పాన్, పొగాకు, ఇతరాలు	143	157
ఇంధనం, లైట్లు	251	404
విద్య	125	374
వైద్యం	269	382
కన్వెయెన్స్	285	555
కన్స్యూమర్ సర్వీసెస్ ఎక్స్‌క్లూడింగ్ కన్వెయెన్స్	192	382
మిస్‌లీనియస్ గూడ్స్, ఎంటర్‌టైన్‌మెంట్	234	424
అద్దె	30	423
టాక్స్ అండ్ సెస్‌లు	05	16
బట్టలు, బెడ్డింగ్, ఫుట్‌వేర్	230	350
మన్నికయ్యే వస్తువులు (డ్యూరబుల్ గూడ్స్)	260	463

ఆహారానికి సంబంధించి నెలవారీ వ్యయం ఇలా..

ఐటెం గ్రూప్	గ్రామీణ (రూ.లలో)	పట్టణ (రూ.లలో)
వివిధ రకాల ధాన్యాలు (సెరియల్, సబ్‌స్టిట్యూట్స్)	185	235
పప్పు దినుసులు, వాటి ఉత్పత్తులు	35	39
పాలు, పాల ఉత్పత్తులు	314	466
కూరగాయలు	203	245
పండ్లు, ఫలాలు	140	246
గుడ్లు, చేపలు, మాంసం	185	231
వంటనూనెలు	136	153
మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాలు	113	138
బేవరేజెస్, రిఫ్రెష్‌మెంట్లు, ప్రాసెస్డ్ ఫుడ్	363	687

తెలంగాణ తర్వాత ఢిల్లీ, హిమాచల్

పెద్ద రాష్ట్రాల్లో సగటు పట్టణ నెలవారీ తలసరి వ్యయంలో రూ.8,251తో తెలంగాణ టాప్‌లో ఉండగా, ఢిల్లీ (రూ.8,250), హిమాచల్‌ప్రదేశ్ (రూ.8,083) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే మొత్తంగా చూస్తే చండీగఢ్ (రూ.12,577) మొదటి స్థానంలో ఉండగా, సిక్కిం (రూ.12,125), అండమాన్ అండ్ నికోబార్ (రూ.10,268), గోవా (రూ.8,761), అరుణాచల్ ప్రదేశ్ (రూ.8,649) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక పట్టణాల్లో శ్రీమంతులుగా ఉన్న టాప్ 5 శాతం మంది రూ.20,824 వ్యయం చేస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10,501 ఖర్చు చేస్తున్నారు. మరోవైపు దిగువ స్థాయిలో ఉన్న 5 శాతం మంది పట్టణాల్లో రూ.2,001, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,373 ఖర్చు చేస్తున్నట్లు నివేదిక వివరించింది.

అన్ని పాఠశాలల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు

నిర్లక్ష్యం చేస్తే ఆయా స్కూళ్లపై చర్యలు: విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సందీప్ శాండిల్య, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, తరుణ్‌జోషి తదితరులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): అన్ని విద్యా సంస్థల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేయాలని, వాటిని ఏ పేరుతో పిలవాలో త్వరలో నిర్ణయిస్తామని, పాటించాల్సిన అంశాలను నిర్లక్ష్యం చేస్తే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మాదక ద్రవ్యాల నివారణపై హైదరాబాద్ సీపీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలంటే వారికి పాఠశాల స్థాయి నుంచే అవగాహన ముఖ్యమన్నారు. తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. గర్ల్ చైల్డ్ సేఫ్టీ గురించి పాఠశాలల్లో అవగాహన కల్పించాలన్నారు.

తల్లిదండ్రులు పిల్లలతో గడపాలి..

టీఎస్ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ దేశంలో డ్రగ్స్ ప్రధాన సమస్యగా మారిందని అన్నారు. తమ పిల్లలను తల్లిదండ్రులు ఎప్పుడూ గమనిస్తుండాలని సూచించారు. పాఠశాల దశలోనే విద్యార్థులకు మద్యం, మాదకద్రవ్యాలు అలవాటవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేరెంట్స్ ఎంత బిజీగా ఉన్నా పిల్లలను ప్రేమతో చూసుకోవాలని, వారితో సమయాన్ని గడపాలని ఆయన చెప్పారు.

ఆ శక్తి గురువులకే ఉంది..

నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, పాఠశాలల వరకు డ్రగ్స్ చేరుతున్నట్లు ఇటీవల వార్తలు చూస్తున్నామని, కొన్ని పాన్ షాపుల్లోనూ గంజాయి చాక్లెట్లు, డ్రగ్స్ దొరుకుతున్నాయని ఇది ఆందోళనకర విషయమన్నారు. పాఠశాలల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు ఏర్పాటుచేయాలని సూచించారు. విద్యార్థులను ఉత్తములుగా మలిచే శక్తి గురువులకు మాత్రమే ఉందని, టీచర్లు పిల్లల ప్రవర్తనలో తేడా వస్తే గమనిస్తుండాలన్నారు. విద్యా సంస్థల్లో ఏర్పాటుచేసిన యాంటీ డ్రగ్ కమిటీలతో ఒక ఫోరం ఏర్పాటుచేసే ప్రతిపాదన ఉందని, ఇందులో పోలీస్, విద్యాశాఖ, చైల్డ్ వెల్ఫేర్, స్వచ్ఛంద సంస్థలకు చోటు కల్పిస్తామన్నారు.

డ్రగ్స్..సమాజాన్ని నాశనం చేస్తుంది..

సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం చాలా ప్రమాదకరమని, ఇది సమాజాన్ని నాశనం చేస్తుందన్నారు. పాఠశాల దశ నుంచే డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రాచకొండ సీపీ తరుణ్ జోషి, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, యాంటీ నార్కోటిక్ ఫోరం జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

7న పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన

- ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు నిర్మాణం
- రూ.2 వేల కోట్ల వ్యయంతో 5.5 కి.మీ. మేరకు..
- రెండోదశలో ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టు వరకు...



సాక్షి, హైదరాబాద్: పాతబస్తీ మెట్రో రైల్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 7న ఫలక్‌నుమా వద్ద మెట్రో నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 5.5 కి.మీ. మార్గంలో చేపట్టనున్న ఈ మార్గానికి సుమారు రూ.2 వేల కోట్ల వరకు ఖర్చుకానున్నట్లు అంచనా. జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు పాతబస్తీ మెట్రో నిర్మాణానికి 2012లోనే ప్రణాళికలను సిద్ధం చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల ఎంజీబీఎస్ వరకే నిలిపివేశారు. పాతబస్తీలో రోడ్డు విస్తరణ, నిర్మాణాల కూల్చివేతలకు ఆటంకం వంటి కారణాల వల్ల పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. గత ప్రభుత్వ హయాంలోనే అడ్డంకులన్నీ తొలగిపోయి డీపీఆర్ సహా అన్ని పనులు పూర్తయినప్పటికీ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కూడా నిర్లక్ష్యం చేసింది. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాతబస్తీ మెట్రోపై దృష్టిసారించి, బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించింది.

డ్రోన్ సర్వే...

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. మార్గంలోని ఆధ్యాత్మిక స్థలాల పరిరక్షణ కోసం గత ఆగస్టులో డ్రోన్ సర్వే నిర్వహించారు. దారుల్‌షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ వరకు 103 మతపరమైన, ఇతర సున్నితమైన కట్టడాలు ఉన్నట్లు గుర్తించారు. కర్వేచర్ సర్దుబాటు, వయాడక్ట్ డిజైన్, ఎత్తులు, మెట్రో పిల్లర్ లొకేషన్‌లలో తగిన మార్పులు తదితర ఇంజనీరింగ్ పరిష్కారాల కోసం డ్రోన్ ద్వారా సేకరించిన డేటా దోహదపడుతుందని అధికారులు తెలిపారు. మతపరమైన, సున్నితమైన నిర్మాణాలను కాపాడేందుకు రోడ్డు విస్తరణను కూడా 80 అడుగులకే పరిమితం చేశారు. నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో మొదటి ఫేజ్ ప్రాజెక్ట్ నుంచి పాఠాలు నేర్చుకోవడం ద్వారా స్టేషన్ స్థానాల్లో మాత్రం రహదారిని 120 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు. ఫలక్‌నుమా వరకు మెట్రో రైలు అందుబాటులోకి వస్తే నాలుగు వందల ఏళ్ల నాటి చారిత్రాత్మక చార్మినార్ కట్టడాన్ని మెట్రో రైల్‌లో వెళ్లి సందర్శించవచ్చు. అలాగే, సాలార్‌జంగ్ మ్యూజియం, ఫలక్‌నుమా ప్యాలెస్ వంటి చారిత్రక కట్టడాలనూ వీక్షించే అవకాశం ఉంటుంది.

ఐదు స్టేషన్లు: ప్రస్తుతం జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మెట్రో రాకపోకలు సాగిస్తున్నాయి. అక్కడి నుంచి దారు షిఫా జంక్షన్, పురానీ హవేలీ, ఇత్తెబార్ చౌక్, అలీజాకోట్ల, మీర్ మోమిన్ దర్గా, హరిబౌలి, శాలిబండ, షంషీర్‌గంజ్, అలియాబాద్ మీదుగా ఫలక్‌ను మా వరకు ఈ 5.5 కి.మీ. అలైన్‌మెంట్ ఉంటుంది. ఈ మార్గంలో 5 స్టేషన్లు రానున్నాయి. ఎంజీబీఎస్ తరువాత సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్‌గంజ్, ఫలక్‌నుమా స్టేషన్‌లు ఉంటాయి.

'ఉత్తర-దక్షిణా'ల మధ్య ఇక కరెంటు రైళ్లే

- డీజిల్ లోకోమోటివ్‌ల వాడకానికి స్వస్తి
- ఆదిలాబాద్– మహారాష్ట్రలోని పింపల్‌కుట్టి మధ్య విద్యుదీకరణ పూర్తి
- నేడు జాతికి అంకితం చేయనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



సాక్షి, హైదరాబాద్: ఉత్తర, దక్షిణ భారతం మధ్య ఇకపై పూర్తిగా విద్యుత్ రైళ్లు మాత్రమే నడవనున్నాయి. డీజిల్ ఇంజన్ల అవసరం లేకుండా పూర్తిగా ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల వాడకానికే రైల్వే శాఖకు వీలుకలుగుతుంది. కేవలం షంటింగ్ లాంటి పనులకు మాత్రమే డీజిల్ ఇంజన్లను పరిమితం చేయొచ్చని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా అక్కడక్కడా మిగిలిపోయిన రైల్వే లైన్ల విద్యుదీకరణను వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇందులో ఉత్తర–దక్షిణ భారత్‌లను జోడించే కీలక ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా జాతికి అంకితం చేయనున్నారు. మహారాష్ట్ర, తెలంగాణ మధ్య ఉన్న ఈ లైను అందుబాటులోకి రావటం వల్ల, నిరంతరాయంగా విద్యుత్తు రైళ్లను నడిపేందుకు అవకాశం కలుగుతుంది. తెలంగాణ పర్యటనకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆదిలాబాద్‌లో జరిగే కార్యక్రమంలో సోమవారం ఈ లైన్‌ను ప్రారంభించనున్నారు.

ఎక్కడ ఉంది ఈ లైను..

మహారాష్ట్రలోని అంబారి– తెలంగాణలోని ఆదిలాబాద్, అలాగే ఆదిలాబాద్‌నుంచి మహారాష్ట్రలోని పింపల్‌కుట్టి మధ్య ఇంతకాలం 58 రూట్ కి.మీ. (71 ట్రాక్ కి.మీ.)మేర విద్యుదీకరణ జరగలేదు. దీంతో ఎగువ నుంచి విద్యుత్తు లోకోతో వచ్చే రైలుకు ఇక్కడికి రాగానే డీజిల్ లోకోమోటివ్‌ను అమర్చి ముందుకు సాగాల్సిన పరిస్థితి ఉండేది. ఈ మార్గం హైదరాబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా నాగ్‌పూర్ వెళ్లేది కావటంతో కీలకంగా పరిగణిస్తున్నారు. హైదరాబాద్– నాగ్‌పూర్ ప్రధాన లైన్‌కు ఇది ప్రత్యామ్నాయ మార్గమని చెపుతున్నారు. ఇది మహారాష్ట్రలోని ముద్ఖేడ్ వద్ద చీలిపోయి నాగ్‌పూర్‌కు బ్రాంచ్‌లైన్‌గా సాగుతుంది. ఈ మార్గంలో 46.6 రూట్ కి.మీ. తెలంగాణ భూభాగంలో, 11.5 రూట్ కి.మీ.లు మహారాష్ట్ర భూభాగంలో ఉంటుంది. ఈ ప్రాంతాన్ని కూడా విద్యుదీకరించాలని నిర్ణయించి రూ.70 కోట్ల వ్యయం కాగల పనులకు గతంలోనే శ్రీకారం చుట్టారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి ఇప్పుడు ప్రధాని చేతులమీదుగా ప్రారంభిస్తున్నారు.

విద్యుదీకరణ కాకపోవడంతో..

బెంగళూరు నుంచి హైదరాబాద్ గుండా ఢిల్లీ వైపు వెళ్లే కొన్ని రైళ్లు నిజామాబాద్, నాగ్‌పూర్ మీదుగా ఈ మార్గంలో నడుస్తున్నాయి. ప్రస్తుతం దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను విద్యుత్తు లోకోమోటివ్‌లతోనే నడుపుతున్నారు. ఇది ప్రధాన నగరాలను అనుసంధానించే కీలక మార్గం అయినప్పటికీ, విద్యుదీకరణ కాకపోవటంతో ఈ ప్రాంతాలకు రాగానే రైళ్లను నిలిపివేయాల్సి వచ్చేది. వాటికి విద్యుత్తు ఇంజన్లను మార్చి డీజిల్ ఇంజన్లు తగిలించి ముందుకు సాగాల్సిన దుస్థితి కొనసాగుతూ వచ్చింది. ఇప్పుడు మధ్యలో ఆ భాగాన్ని కూడా విద్యుదీకరించటంతో ఇంజన్లు మార్చాల్సిన అవసరం తప్పుతుందని రైల్వేవర్గాలు తెలిపాయి.

లిషిత మైనర్ కాదు..మేజరే

డ్రగ్స్ కేసులో లిషితకు వైద్య పరీక్షలు నిర్వహించిన పోలీసులు


లిషితను వైద్య పరీక్షలకు తీసుకెళ్తున్న మహిళా కానిస్టేబుల్

గచ్చిబౌలి (హైదరాబాద్): రాడిసన్ బ్లూ డ్రగ్ పార్టీ కేసులో కొకైన్ సేవించినట్టు అనుమానితురాలిగా ఉన్న యూట్యూబర్ కల్లపు లిషిత గణేష్‌కు గచ్చిబౌలి పోలీసులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం రాత్రి లిషిత పోలీసు విచారణ కోసం గచ్చిబౌలి పీఎస్‌కు వచ్చారు. విచారణ అనంతరం పోలీసులు లిషిత నుంచి మూత్ర, రక్త నమూనాలు సేకరించారు. ఎనిమిది రోజుల అనంతరం లిషిత పోలీసుల విచారణకు హాజరవడంతో ఆమెను వివిధ కోణాలలో పోలీసులు ప్రశ్నించారు. డ్రగ్ పార్టీ జరిగిన రోజు గచ్చిబౌలిలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు ఏ సమయంలో వచ్చింది, బయటకు వెళ్లిన సమయం తదితర వివరాలను తెలుసుకున్నారు. ఆమె హోటల్‌లో ఉన్న సమయంలో అక్కడ ఎవరెవరు ఉన్నారనే కోణంలో గంటపాటు విచారించినట్లు తెలిసింది. కాగా తాను కొకైన్ తీసుకోలేదని లిషిత పోలీసులతో చెప్పి న్నట్లు సమాచారం. లిషిత మైనర్ అని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఆమె మేజర్ అని గచ్చిబౌలి పోలీసులు స్పష్టం చేశారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.